
రష్యా విప్లవం
భారత స్వాతంత్ర్య సంగ్రామం
రూ॥160/- పేజీలు:195

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

సంపుటి 08, సంచిక: 282 | శుక్రవారం | 12-09-2025 | కరీంనగర్

Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar

పేజీలు: 12+8 | వెల రూ. 5.00


సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తే సూర్యుడిపై ఉమ్మి వేసినట్లే

యాగాలతో 'అధికార యోగం' సంభవమా?

06



## రైల్వే ప్రాజెక్టులు, లైన్లు వేగవంతంగా పూర్తి

- సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధం
- అవసరమైన నిధులతో పాటు భూసేకరణకు వెనుకాడొద్దు
- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్ట్ అలైన్‌మెంట్ ఉండాలి
- కొత్త రైలుమార్గాలన్నీ వివిధ ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి ఉపయోగపడాలి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ
- పెండింగ్, ప్రతిపాదిత రైల్వే ప్రాజెక్టులపై ఎస్‌సిఆర్ అధికారులతో సమీక్ష

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రైలు ప్రాజెక్టులు, లైన్లను వేగవంతంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అవసరమైన నిధులను సమకూర్చడంతో పాటు భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టుల అలైన్‌మెంట్లు ఉండాలని, దూరాభారం తగ్గించి, అంచనా ఖర్చును కూడా తగ్గించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రయాణికులకు వేగవంతమైన రవాణా సదుపాయాలు అందించటంతో పాటు కొత్తగా వేసే రైలు మార్గాలన్నీ వివిధ ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి ఉపయోగపడేలా ఉండాలన్నారు. ప్రధానంగా పర్యాటక కేంద్రాలు, పారిశ్రామిక అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. విదేశాల తరహాలో రైలు, రోడ్డు, పోర్ట్ కనెక్టివిటీని అధునాతనంగా అభివృద్ధి చేయాలన్నారు. రాష్ట్రంలో పెండింగ్ రైల్వే ప్రాజెక్టులు, కొత్తగా ప్రతిపాదనలో ఉన్న ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) అధికారులతో పాటు, వివిధ విభాగాల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశానికి హాజరైన ఎస్‌సిఆర్ జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవను ముఖ్యమంత్రి స్వాగతించారు. కొత్త ప్రాజెక్టులపై ఆయనతో ప్రత్యేకంగా చర్చించారు. సిఎంతో పాటు ఎంపి కడియం కావ్య, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, రోడ్లు, భవనాల స్పెషల్ సెక్రెటరీ వికాసరాజ్, సిఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ

తరువాయి 2లో

## అందరి చరిత్రలను
# బిజెపి హైజాక్

ఏ చరిత్రా లేని కాషాయ పార్టీ దుష్ట రాజకీయాలకు పాల్పడుతోంది




- తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి మతం రంగు పులుముతూ వక్రీకరిస్తోంది
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆగ్రహం
- తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట 77వ వారోత్సవాలు ఘనంగా ప్రారంభం
- మఖ్దూం మొహియుద్దీన్ విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు 'రెడ్ ఫ్లాగ్ మార్చ్'

ప్రజాపక్షం/హైదరాబాద్

ఏ చరిత్ర లేని బిజెపి అందరి చరిత్రను తనదంటూ ఆపాదించుకుని దుష్ట రాజకీయాలకు పాల్పడుతోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఐ ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట 77వ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఉన్న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సారథుల్లో ఒకరైన మఖ్దూం మొహియుద్దీన్ విగ్రహానికి సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్లా వెంకట రెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఎస్. బోస్ పూలమాలలు వేసి వారోత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో మఖ్దూం మొహియుద్దీన్ విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు రెడ్ ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహించింది. సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్ అధ్యక్షతన జరిగిన సభను ఉద్దేశించి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ తెలంగాణ ప్రజల దాస్యశృంఖలాలను బద్దలు కొట్టేందుకు మట్టి మనుషులు బంధూకులు పట్టి సాగించిన సాయుధ సమరమైన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి బిజెపి మతం రంగు పులుముతూ చరిత్ర వక్రీకరిస్తోందని ధ్వజమెత్తారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలం నాటికి అసలు ఉనికే లేని బిజెపి విమోచన దినోత్సవం పేరుతో సెప్టెంబర్17న ఉత్సవాలను నిర్వహించడం

తరువాయి 12లో

అమరవీరుల స్మృతివనం ఏర్పాటు చేయాలి


తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి

సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే

03

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- కేంద్ర కమిటీ సభ్యుడు మొడెం బాలకృష్ణ హతం?
- ఘటనను ధ్రువీకరించిన ఐజి అమ్రేష్ మిశ్ర




## ఎదురు కాల్పుల్లో 10 మంది మావోయిస్టులు మృతి

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

ఛత్తీస్‌గఢ్‌లో గురువారం ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. ఒడిశా రాష్ట్ర సరిహద్దు గరియాబాద్ జిల్లా అటవీ ప్రాంతలో చోటు చేసుకున్న ఈ ఎదురు కాల్పుల్లో 10 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఘటనను రాయ్‌పూర్ ఐజి అమ్రేష్ మిశ్ర ధృవీకరించారు. ఈ ఎన్‌కౌంట్‌లో తెలంగాణకు చెందిన మొడెం బాలకృష్ణ మృతి చెందినట్లు తెలుస్తోంది. ఆయన ఒడిశా రాష్ట్ర కమిటీ సభ్యుడు. ఎస్‌టిఎఫ్, కోబ్రా బలగాలు సంయుక్త ఆపరేషన్ భాగంగా మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా పెద్ద ఎత్తున కూంబింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మావోయిస్టు పార్టీ ఒక్కసారిగా తారసపడడంతో ఇరు వర్గాల మధ్య ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. సుమారు నాలుగు గంటలపాటు సాగిన ఈ ఎదురుకాల్పుల్లో

తరువాయి 12లో

## మారిషస్‌కు భారత్ సహాయం
# 680 బిలియన్ డాలర్లు



- ఏడు ఒప్పందాలపై సంతకాలు
- మనం భాగస్వాములం కాదు, ఒకే కుటుంబం
- నవీన్‌చంద్రతో ద్వైపాక్షిక చర్చల్లో ప్రధాని నరేంద్రమోదీ

**వారణాసి/న్యూఢిల్లీ:** దేశంలో పర్యటిస్తున్న మారిషస్ ప్రధానమంత్రి నవీన్‌చంద్ర రామ్‌గూలమ్ గురువారం ప్రధానమంత్రి నరేంద్రమోదీతో ద్వైపాక్షిక సంప్రదింపులు జరిపారు. నాయకులు ఇద్దరూ మొత్తం ఏడు ఒప్పందాలపై సంతకాలు చేశారు.ఈ మేరకు స్థానిక కరెన్సీలలోనే దైపాక్షిక వాణిజ్యం జరుగుతుంది. ఇందులోభాగంగా మారిషస్‌కు భారత్ ప్రకటించిన 680 బిలియన్ డాలర్లు ప్రత్యేక ఆర్థిక సహాయ ఒప్పందం కూడా ఉంది. ఈ ప్రత్యేక ఆర్థిక సహాయ పథకం కింద మారిషస్‌లో కనీసం 10 ప్రాజెక్టులను భారతదేశం అమలు చేస్తుంది. రేవులు, విమానాశ్రయాలు, రహదారులు, స్కూళ్ళు ఏర్పాటు చేయడం, ఆసుపత్రులు నిర్మించడం వంటి అనేక ప్రాజెక్టులను అమలు చేస్తుంది. ఈ ఏడు ఒప్పందాలవల్ల రెండు దేశాలమధ్యా సహకారం మరింతగా విస్తరిస్తుంది. విద్యా,ఇంధనం,విద్యుత్, హైడ్రోగ్రఫీ,అంతరిక్ష పరిశోధనా రంగాలలో

తరువాయి 12లో

## నేపాల్ తాత్కాలిక ప్రధానిపై తర్జనభర్జన

జెనరేషన్ జెడ్ ఉద్యమ నాయకుల మధ్య కుదరని ఏకాభిప్రాయం

తాత్కాలిక నేతగా తెరపైకి సుశీల కర్కితో పాటు కుల్మన్ ఘీసింగ్, హర్కా సంపంగ్ పేర్లు



**ఖాట్మండు:** నేపాల్‌లో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు ముమ్మర ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఐతే తాత్కాలిక ప్రభుత్వ ప్రధానమంత్రి ఎంపికపై చర్చల్లో అనిశ్చితి ఏర్పడింది. ఏకాభిప్రాయం కుదరలేదు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి సుశీల కర్కిని తాత్కాలిక ప్రభుత్వాధినేత్రిగా నియమించాలని జనరేషన్ జెడ్ ఉద్యమ (జిజెడ్‌ఎం) నాయకత్వం

తరువాయి 2లో

## అమెరికా మితవాద యువనేత
# చార్లీ కిర్క్ హత్య

బైడెన్ సహా పలువురు నాయకులు ఖండన

**ఉతాహ్:** ట్రంప్‌కు అత్యంత సన్నిహితుడైన ఛాందసవాద యువ నాయకుడు ఛార్లీ కిర్క్ (31) హత్యకు గురయ్యారు. ఉతాహ్‌లోని ఒక విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వందలమంది విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సమయంలో గుర్తుతెలియని గన్‌మెన్ ఎత్తైన ప్రదేశం నుండి ఛార్లీ కిర్క్‌ను ఒకేఒక్క తూటా ప్రయోగించి కాల్చిచంపాడు. ఈ ఘటనతో వందలాదిమంది విద్యార్థులు భయంతో పరుగులు తీశారు. కాల్పులు జరిపిన దుండగుడు విద్యార్థుల్లో ఒక విద్యార్థిగా కలిసిపోయాడు. అతడిని



తరువాయి 2లో

## 21 నుంచి సిపిఐ జాతీయ మహాసభలు

మొహాలీ ర్యాలీతో ప్రారంభం । జయప్రదానికి అమర్‌జిత్ కౌర్ పిలుపు




**చండీగఢ్:** సిపిఐ 25వ జాతీయ మహాసభలకు చండీగఢ్ కిసాన్ భవన్ వేదికైంది. ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు మహాసభలు జరగనున్నాయి. 21వ తేదీ ఉదయం మొహాలీలో ర్యాలీతో మహాసభలు లాంఛనంగా ప్రారంభమవుతాయి. 22న కిసాన్ భవన్‌లో ప్రారంభ సభ జరుగుతుంది. సభా ప్రాంగణానికి కామ్రేడ్ సుధాకర రెడ్డి నగర్‌గా పేరు పెట్టారు. ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, సమానత్వం, శాంతి కోసం పోరాటాల బలోపేతానికి భవిష్యత్ కార్యాచరణను మహాసభలో తీర్మానిస్తారు. 'మేము పోరాడుతాం... ప్రజలు గెలుస్తారు... న్యాయం, సత్యం జయిస్తాయి' అని పార్టీ నినాదమిచ్చింది. ఈ మేరకు చండీగఢ్

తరువాయి 2లో

# మెదక్‌లో క్లౌడ్ బరస్ట్



- ఐదుగంటలపాటు భారీ వర్షం
- 17 సెంటీమీటర్ల వర్షపాతం
- చెరువులను తలపించిన రోడ్లు
- నీటమునిగిన పలు కాలనీలు
- రాష్ట్రంలో మరో ఐదురోజులు భారీ వర్షాలు

ప్రజాపక్షం/మెదక్/హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా బుధవారం సాయంత్రం నుంచి పలుచోట్ల భారీ వర్షాలు కురిసాయి. ముఖ్యంగా మెదక్ జిల్లాలో గురువారం ఉదయం కుండపోత వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. గురువారం ఉదయం 9 గంటలకు మొదలైన భారీ వర్షం మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. మెదక్ లో 17 సెంటిమీటర్ల వర్షపాతం నమోదయింది. జిల్లాలోని మెదక్, హవేలీ ఘనపూర్, రామాయంపేట, అల్లాదుర్గం, శివ్వంపేట, నర్సాపూర్, పాపన్నపేట్, కొడిపల్లి,

తరువాయి 2లో



## హైదరాబాద్‌లో కుండపోత

గ్రేటర్ హైదరాబాద్ నగర వ్యాప్తంగా గురువారం భారీ వర్షం కురిసింది. సరిగ్గా కార్యాలయాలు, విద్యా సంస్థల నుంచి ఇంటికి వెళ్లే సమయం కావడంతో ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మధ్యాహ్నం మొదలైన వాన ఎడతెరిపి లేకుండా పడుతోంది. భారీ వర్షంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. డ్రైనేజీలు పొంగిపొర్లాయి. నగరంలో కొన్ని గంటల నుంచి నిరంతరాయంగా కురుస్తున్న

తరువాయి 2లో


చలో చండీఘడ్


భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)
25వ కాంగ్రెస్
21-25 సెప్టెంబర్, 2025
చండీఘడ్ (పంజాబ్)


చైర్మన్ పదవి పునరుద్ధరణ మలి చైర్మన్ ఎస్.ఎ.డాంగే – 6వ పేజీలో



# ప్రపంచం
WORLD NEWS

## బాలిలో వరదలు : 19 మంది మృతి



**బాలి:** ఇండోనేసియా బాలిలో గడచిన పదేళ్లలో ఎన్నడూలేనంత ఉధృతస్థాయిలో వరదలు సంభవించాయి. 19 మంది మరణించారు. ఇప్పుడిప్పుడే నీరు తగ్గుముఖం పడుతోంది. ఇళ్లనీ పాచిపట్టి, బురదలో మునిగి ఉన్నాయి. మరో ఇద్దరు గల్లంతయ్యారు. ప్రావిన్సియల్ ప్రభుత్వం వారంరోజులపాటు రాష్ట్రంలో ఎమర్జెన్సీ ప్రకటించింది. ప్రజలు బురద తొలగించి ఇళ్ళు శుభ్రం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. డెన్‌పాసర్‌లో ఎనిమిదిమంది, గియానార్‌లో ముగ్గురు, బాదుంగ్ కౌంటీలో ఒకరు మరణించారు.

## హమాస్ నాయకులను అప్పగించకుంటే మూల్యం తప్పదు



నెతన్యాహూ హెచ్చరిక

**జెరూసలెం:** ఐక్యరాజ్యసమితి సహా యావత్ ప్రపంచదేశాలు ఏకమై తీవ్రంగా విమర్శిస్తున్నప్పటికీ ఖతార్ నగరం దోహాపై ఐడిఎఫ్ చేసిన దాడులను ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ సమర్థించుకున్నారు. దోహాలో మంగళవారం చేసినబాంబుదాడుల్లో ఆరుగురు మరణించార చెబుతూ, ఒకవేళ హమాస్ అగ్రనాయకత్వం ఈ దాడుల్లో హతులవ్వకపోతే మరోసారి దాడులు చేస్తామని హెచ్చరించారు. దోహాలో ఉన్న హమాస్ అగ్రనాయకులను దేశం నుండి బహిష్కరించాలని లేదా తమకు స్వాధీనం చేయాలని లేకపోతే తదుపరి తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాలని నెతన్యాహూ హెచ్చరించారు. ఉగ్రవాదం ఎక్కడున్నా సహించబోమన్నారు. ఈ సందర్భంగా వివిధ దేశాల్లో ఇస్లామిక్ ఉగ్రవాదులు చేస్తున్న జీహాదీ ఉద్యమాలను ఆయన ప్రస్తావించారు. తమ దేశంపై దాడులు చేసినవారు ఎక్కడ దాక్కున్నా గానీ తరిమి తరిమి కొట్టి చంపుతామన్నారు. ఇదిలా ఉండగా, అమెరికాకు ఖతార్ అత్యంత సన్నిహిత మిత్రదేశం కావడంతో నెతన్యాహూ నిర్ణయాలకు దూరంగా ఉన్నట్లు ప్రకటించుకున్న డోనాల్డ్ ట్రంప్ ఆయనతో ఫోన్‌లో సంభాషించి వాగ్వాదం చేసినట్లు వార్తలు వెలువడ్డాయి. నెతన్యాహూపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారన్న వార్తలు వచ్చాయి. కానీ దోహాలో దాడులకు ముందే ట్రంప్‌కు ఇజ్రాయెల్ సమాచారం అందించినట్లు తొలుత వార్తలు వెలువడటం, ట్రంప్ ఆగ్రహం వెంటివెన్నే సందేహాస్పదంగా మారాయి.

### యెమెన్‌లో ఐడిఎఫ్ దాడులు
#### 35 మంది మృతి

యెమెన్‌లో హౌతీ ఉగ్రవాదులపై ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో మృతులసంఖ్య 35కు పెరిగింది. ఖతార్ రాజధాని దోహాలో హమాస్ నాయకత్వం ఉన్న భవనంపై దాడులు చేసిన మరునాడే బుధవారం ఇజ్రాయెల్ సైనికదళం పలుచోట్ల హౌతీల స్థావరాలు, వారి ఆయుధసామాగ్రి ప్రదేశాలపై క్షిపణి దాడులు చేసింది. ఈ దాడుల్లో ఇప్పటివరకూ 35 మంది మరణించగా మరో 131 మంది గాయపడ్డారని హౌతీ నాయకత్వంనగల ప్రభుత్వంలో ఆరోగ్యమంత్రిత్వశాఖ గురువారం ప్రకటించింది. అల్ జాఫ్‌లో హౌతీలు నడుపుతున్న అల్ మస్సిరా టీవీ మీడియాను ధ్వంసం చేసింది. హౌతీ రక్షణమంత్రిత్వశాఖపై దాడులు చేసింది. సెంట్రల్ సనాలో నేషనల్ మ్యూజియం ధ్వంసమైంది. రాజధాని సనాలో 28 మరణించారని, మరో 113 మంది గాయపడ్డారని, వీరిలో అనేకమంది జర్నలిస్టులు ఉన్నారని తెలియజేసింది. అల్‌జాఫ్ ఉత్తరప్రాంతంలో ఏడుగురు మరణించగా 18 మంది గాయపడ్డారు.

## ఇజ్రాయెల్‌ను కోర్టులో నిలబెట్టాల్సిందే

### ఖతార్ డిమాండ్



**దోహా:** ఇజ్రాయెల్ చేసిన దాడులతో ఖతార్ ప్రభుత్వంమండిపడుతోంది. ఇజ్రాయెల్‌ను న్యాయస్థానంలో నిలబెట్టి జవాబుదారీ చేయాల్సిందేనని ఖతార్ ప్రధానమంత్రి, విదేశాంగమంత్రి షేక్ మహ్మద్ బిన్ అబ్దుల్‌రహ్మాన్ అల్ థాని డిమాండ్ చేశారు. దోహాలో జరిగిన దాడులపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సమావేశానికి హాజరుకావాలని ఆయనసుకుంటోంది. గురువారం రాత్రి పొద్దుపోయాక ఈ సమావేశం జరిగింది. అల్ థాని ఐక్యరాజ్యసమితి కార్యాలయానికి గురువారం చేరుకున్నారు. తొలుత ఆయన దోహా దాడుల్లో మరణించిన ఆరుగురి ఖనన కార్యక్రమంలో పాల్గొన్నారు. అయితే ఈ కార్యక్రమంలో హమాస్ అగ్రనేత ఖలీల్ హయ్యా ఎక్కడా కనపడలేదు. దోహాలో ఈనెల తొమ్మిదోతేదీన ఇజ్రాయెల్ చేసిన దాడులతో గాజాలో హమాస్ వద్ద ఇంకా సజీవంగా ఉన్న 20 మందికిపైగా బందీల భవితవ్యం అగమ్యగోచరంగా మారింది. బందీలను విడుదల చేసేందుకు ఇప్పటివరకూ ఉన్న ఆశలను ఇజ్రాయెల్ వమ్ము చేసిందని ఖతార్ ప్రధానమంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో బందీల కుటుంబాలలో తీవ్ర నిరాశానిస్పృహలు నెలకున్నాయి. ఐడిఎఫ్ దాడుల్లో హమాస్ అగ్రనాయకుడు ఖలీల్ హయ్యా, ఇతర సీనియర్లు తప్పించుకుని బయటపడ్డారు. గాజాలో మధ్యవర్తిత్వంపై ఖతార్ పునరాలోచన చేస్తున్నట్లు కూడా వార్తలు వెలువడ్డాయి. ఖతార్‌పై దాడిచేసి ఆ దేశ సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించిన చర్యను భారతదేశం సహా అనేక ప్రపంచదేశాలు ఖండించాయి. భారత ప్రధాని మోదీ ఖతార్ ఎమిర్ థానికి ఫోన్‌చేసి మాట్లాడారు. తన సంఘీభావాన్ని ప్రకటించారు.

## కార్మికులు, స్వల్పాదాయాలవారి ప్రభుత్వం కావాలి

### ఒకే వేదికపై మమ్దానీతో కలిసి శాండర్స్ పిలుపు



**న్యూయార్క్:** అమెరికా బ్రూక్లిన్‌కాలేజీ ఆడిటోరియంలో గడచిన శనివారం (సెప్టెంబరు 6) ఒక అద్భుతం జరిగింది. అమెరికా కాంగ్రెస్ చరిత్రలో చట్టసభ సభ్యుడుగా అత్యంత సుదీర్ఘమైన అనుభవంగల 83 ఏళ్ళ వయసుగల ఇండిపెండెంట్ సెనేటర్ (వెర్మోంట్) బెర్నార్డ్ శాండర్స్, డెమోక్రటిక్‌పార్టీ తరపున వచ్చే నవంబరులో జరిగే ఎన్నికల్లో న్యూయార్క్ సిటీ మేయర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జోహ్రాన్ క్వామే మమ్దానీ ఇద్దరు ఒకేవేదికపైన జతకూడి సభికులను అలరించారు. ఈ ఇద్దరు అమెరికాలో ఎంతో ప్రజాదరణ గలవారే. ప్రస్తుతం ట్రంప్‌కు జనాదరణ తగ్గుతున్న తరుణంలో డెమోక్రాట్లతో సుదీర్ఘ స్నేహం ఉన్న ఇండిపెండెంట్ సెనేటర్ శాండర్స్,మమ్దానీలు బ్రూక్లిన్ కాలేజీ ఆడిటోరియంలో హాజరైన 1700 మంది సభికులలలో కొత్త ఆశలు రేకెత్తించారు. మమ్దానీతో తనకు ఎంతో భావసారూప్యత ఉందని శాండర్స్ చెప్పారు. ఆయన పోరాటం చేస్తున్న ఉద్దేశాలు, తమ ఉద్దేశాలమధ్య సారూప్యతలున్నాయన్నారు. దేశంలో అధికారం కేవలం కొంతమంది చేతుల్లోనే ఉండిపోయి దుర్వినియోగం జరుగుతోందనీ, దేశాధికారం కార్మికులు, స్వల్పాదాయ వర్గాల ప్రజలకు అనుకూలంగా ఉండాలని పోరాటం చేస్తున్న శాండర్స్ ఇప్పటివరకూ దాదాపు 20 రాష్ట్రాలను చుట్టేసి అనేక సభల్లో పాల్గొన్నారు. తాజాగా గడచిన శనివారం మమ్దానీతో కలిసి వేదికను పంచుకుని సభికులను ఉత్తేజపరిచారు. ఇలా శాండర్స్ మొదటిసారి చాలా సన్నిహితంగా మమ్దానీతోఒకేవేదికను పంచుకున్నారు. మమ్దానీప్రస్తుతం డెమోక్రాట్ల తరపున 36వ డిస్ట్రిక్ట్ నుండి న్యూయార్క్ స్టేట్ అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మమ్దానీ సుదీర్ఘంగా మాట్లాడుతూ, శాండర్స్‌కు తాను రాజకీయంగా ఎంతో రుణపడి ఉంటానని హర్ష ధ్వానాల మధ్య చెప్పారు. 2016లో శాండర్స్ అధ్యక్ష ఎన్నికల్లో చేసిన ప్రచారం సందర్భంగా ప్రజాస్వామ్య సోషలిజం గురించి తాను తెలుసుకున్నానని, తన రాజకీయాలకు అదే మార్గదర్శకంగా ఉందన్నారు. 2019లో క్వీన్స్‌బెర్గ్‌లో జరిగిన ర్యాలీలో కూడా ఆయన తన మొదటి రాజకీయప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారని గుర్తు చేసుకున్నారు.

## నేపాల్ జైళ్ళ నుండి 15వేలమంది పరారీ

**ఖాట్మండు:** నేపాల్‌లో ఈనెల 8,9 తేదీలలో జరిగిన అల్లర్ల సందర్భంగా జైళ్ళపై దాడులు జరిగినప్పుడు 15000 మంది ఖైదీలు పారిపోయారు. ఖైళ్ళల్లో ఘర్షణలు చెలరేగాయిప దాదాపు 25 జైళ్ళ నుండి 15 వేలమంది ఖైదీలు పారిపోయారు. కాగా నేపాల్ జైళ్ళలో సిబ్బందికి, ఖైదీలకు జరిగిన ఘర్షణల్లో గురువారం ముగ్గురు ఖైదీలు మరణించడంతో ఇప్పటివరకూ ఇలా మరణించినవారిసంఖ్య ఎనిమిదికి పెరిగింది. గురువారం ఉదయం రామెఛాప్ జిల్లాలోని జైలులో భద్రతాసిబ్బందికి, ఖైదీలకు జరిగిన ఘర్షణలో ముగ్గురు మరణించగా 13 మంది గాయపడ్డారు. ఐతే పారిపోయిన ఖైదీలలో 35 మందిని పోలీసులు అరెస్టు చేసి తిరిగి జైళ్ళకు తరలించారు. రాజ్‌బిరాజ్ జైలు నుండి 192 మంది ఖైదీలు పారిపోయేందుకు యత్నించగా సైన్యం అడ్డుకుంది. ఏడుగురు ఖైదీలు భారత్‌వైపు పారిపోగా భారత సరిహద్దు భద్రతాబలగాలు మూడుప్రాంతాల్లో వారిని పట్టుకుని నేపాల్ ఆర్మీకి అప్పగించారు. ఝూపాజిల్లాలోని అనేక ప్రాంతాలలో జైళ్ళ నుండి 92 మంది ఖైదీలు పారిపోయారు. అనర్‌మణి నుండి 36 మంది, దమాక్ నుండి 51 మంది, ఝిల్‌మిల్ నుండి ఐదుగురు పారిపోయారు. జాడ తెలియడంలేదు. పోలీసులు వాల్‌పోస్టర్లు వేశారు. ఈ నెల 8,9 తేదీలలో జరిగిన హింసాత్మక ఘటనలలో మరణించినవారిసంఖ్య 19 నుండి 31కి పెరిగినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

## వర్జీనియాలో డెమోక్రాట్ల గెలుపు

### ఆదరణ తగ్గిన ట్రంప్‌నకు దిగువసభలో ఎదురీత



**న్యూయార్క్:** అమెరికా దిగువసభ (హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్)లో విర్జీనియా 11 కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ స్థానానికి ఈ నెల తొమ్మి దో తేదీన జరిగిన ఎన్నికల్లో డెమోక్రటిక్‌పార్టీ విజయం సాధించింది. డెమోక్రాట్ల అభ్యర్థి జేమ్స్ వాల్కిన్షా సాధించిన నిర్ణయాత్మకమైన విజయం రిపబ్లికన్‌పార్టీ నేత, దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు పెద్ద శరాఘాతంగా మారింది. దిగువసభలో అధికార–ప్రతిపక్షాలమధ్య సంఖ్యాబలం అతిస్వల్పతేడాకు చేరుకుంది. ప్రస్తుతం ట్రంప్‌కు ఉన్న ప్రతికూల పరిస్థితుల్లో ఇంకా ఖాళీగా ఉన్న రెండు స్థానాలను చాలా గెలుచుకునే అవకాశాలున్నాయి. ఇలా రెండుస్థానాలను డెమోక్రాట్లు గెలుచుకోగలిగితే సంఖ్యాబలాబాలు 219–216 స్థాయికి చేరుకునే అవకాశాలున్నాయి. ఈ విధమైన డెమోక్రాట్ల ఆధిపత్యం రిపబ్లికన్‌పార్టీకి ప్రాణాంతకంగా మారుతుంది. ట్రంప్‌కు దేశంలో 60 శాతం ప్రజలు వ్యతిరేకంగా ఉన్నట్లు తాజా సర్వేలో వెల్లడైంది. దీంతో డెమోక్రాట్లు సభపై పట్టుబిగించేందుకు అవకాశాలు గణనీయంగా పెరిగాయి. ఊహించడానికి ఇది మరొక ఉదాహరణగా మారింది. అమెరికా దిగువసభలో అధికార,ప్రతిపక్షాలమధ్య బలాబలాల్లో స్వల్పతేడా ఉంది. రిపబ్లికన్లు పరిపాలిస్తారా? డెమోక్రాట్లు గట్టిగా వారిని అడ్డుకుంటారా అనే విషయంలో ఈ సీట్లే కీలకం. మొన్నటిదాకా వర్జీనియా 11 కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ స్థానానికి ప్రాతినిధ్యం వహించిన గ్యారీ కన్నోలీ ఈ ఏడాది మే 21న మరణించడంతో దిగువసభలో ఖాళీ ఏర్పడింది. ఈ స్థానాన్ని భర్తీచేసేందుకు ప్రతిష్ఠాత్మకంగా జరిగిన ఎన్నికల్లో డెమోక్రాట్లు తిరిగి తమ ఆధిపత్యం నిలబెట్టుకున్నారు. గడచిన ఏడునెలలుగా దేశంలో ట్రంప్ అనుసరించిన విధానాలవల్ల ప్రజల్లో ఆయనకు పలుకుబడి గణనీయంగా తగ్గిందని చెప్పడానికి ఈ ఉప ఎన్నిక మరో ఉదాహరణగా నిలిచింది. ఈ ఎన్నికను రిపబ్లికన్‌పార్టీ సవాలుగా తీసుకుంది. వాల్కిన్షా విజయంతో దిగువసభలో ఈ రెండు పార్టీల బలాబలాలు నువ్వా నేనా అనే రీతిలో పదునైన కత్తి అంచుకు రెండువైపులుగా మారాయి. ఈ విజయంతో డెమోక్రాట్లకు 214 స్థానాలు, రిపబ్లికన్లకు 219 స్థానాలు సభలో ఉన్నట్లయింది. దిగువసభలో ఇంకా రెండు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. దేశంలో డోనాల్డ్ ట్రంప్ గడ్డుకాలాన్ని ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో డెమోక్రాట్లు మిగిలిన రెండు స్థానాలను కూడా చాలా సునాయాసంగా గెలుచుకునే అవకాశాలు ఉన్నాయి.

## ప్రభుత్వాన్ని కూల్చేందుకు యత్నిస్తున్నామంటూ దుష్ప్రచారం

### బిజెపి ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, పాల్వాయి హరీష్‌బాబు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తమ వైఫల్యాలు, అసమర్థత, ప్రజా వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్, బిఆర్‌ఎస్ పార్టీలు తమపై అనధికారిక సోషల్ మీడియా ద్వారా దుష్ప్రచారం చేస్తున్నాయని బిజెపి ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, పాల్వాయి హరీష్ బాబు ఆరోపించారు. వేర్వేరుగా గురువారం విడుదల చేసిన ప్రకటనలో విమర్శించారు. తాము ప్రభుత్వాన్ని కూల్చేందుకు మహేష్ కుమార్ గౌడ్‌తో కలిసి గోవా, ఢిల్లీలలో రహస్య మంతనాలు జరుపుతున్నట్లు తప్పుడు వార్తలను ప్రచారం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రోత్సాహంతోనే బిఆర్‌ఎస్ సోషల్ మీడియా విభాగం ఈ తప్పుడు ప్రచారానికి తెరలేపిందని హరీష్‌బాబు ఆరోపించారు. బిఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఆడుతున్న నాటకాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఇది కేవలం బిజెపిని బద్నాం చేయడానికి పన్నిన పన్నాగం అని ప్రజలు అర్థం చేసుకుంటున్నారన్నారు. ఇలాంటి హేయమైన చర్యల ద్వారా ప్రజల్లో బిజెపికి వస్తున్న ఆదరణను అడ్డుకోలేరన్నారు. కాంగ్రెస్, బిఆర్‌ఎస్ అవినీతి, కుటుంబ పార్టీలని, వాటిని ప్రజ లు అసహ్యించుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్, బిఆర్‌ఎస్ నేతలు ఇప్పటికైనా ఇలాంటి నీతిమాలిన చర్యలు మానుకోవాలని వారు హెచ్చరించారు.

## హైదరాబాద్‌లో కుండపోత

(మొదటి పేజీ తరువాయి)

వర్షంతో రహదారులపై నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాల్లోకి భారీగా వరద నీరు చేరడంతో చెరువులని తలిపించాయి. ఒక్కసారిగా కురిసిన వాన వరదలా మారడంతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారు. హయత్ నగర్‌లో అత్యధికంగా 9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. హయత్‌నగర్‌లో కుండపోత వర్షం పడటంతో హయత్‌నగర్ విజయవాడ జాతీయ రహదారిపై భారీగా వరద నీరు చేరింది. మోకాళ్ల లోతు వరకు నీళ్లు రావడంతో వనస్థలిపురం ఆటోనగర్ నుంచి హయత్‌నగర్ వరకు భారీగా ట్రాఫిక్ స్తంభించింది. కిలోమీటర్ల మేర వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. హయత్ నగర్ కోర్టు ప్రాంగణాన్ని వరద నీరు చుట్టుముట్టింది. హయత్‌నగర్ ఆర్‌టిసి డిపో ప్రాంగణంలో భారీగా వరద నీరు చేరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రోడ్లపై వరద నీరు నిలవడంతో ఆటోనగర్, పెద్ద అంబర్ పేట్ వరకు భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వనస్థలిపురంలో వర్షపు నీరు ఇళ్లలోకి చేరడంతో ప్రజలు అవస్థలు పడ్డారు.

## వేగవంతంగా పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

శ్రీనివాసరాజు, ఆర్థిక శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఈ సమావేశంలో పాల్గొన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు గ్రీన్ ఫీల్డ్ హైవేతో పాటు అనుసంధానంగా రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలోని హామీ ప్రకారం హైదరాబాద్ నుంచి అమరావతికి ర్యాపిడ్ రైల్ అండ్ రోడ్డు కనెక్టివిటీ ప్రాజెక్టును కేంద్రం అమలు చేయాల్సి ఉందన్నారు. కొత్తగా ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందర్ వరకు 12 లేన్ల గ్రీన్ ఫీల్డ్ హైవే ఏర్పాటు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశామని, అందుకు సంబంధించి 300 కిలోమీటర్ల అలైన్‌మెంట్ ప్రతిపాదనలను కూడా రాష్ట్ర ప్రభుత్వం తయారు చేసిందన్నారు. దానికి అనుగుణంగా రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని, రైల్వే విభాగం పరిశీలనలో ఉన్న అలైన్‌మెంట్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసిన అలైన్‌మెంట్‌ను పరిశీలించి భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని ముఖ్యమంత్రి సూచించారు. హైవే వెంట రైలు మార్గం ఉండాలని, హైవేకు ఇరువైపులా కిలోమీటర్నర దూరం వరకు ఇండస్ట్రియల్ కారిడార్‌ను విస్తరించాలనే ప్రతిపాదనలున్నాయని చెప్పారు. కొత్తగా అభివృద్ధి చేస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే ప్రతిపాదనలకు అనుగుణంగా హైదరాబాద్ – చెన్నై, హైదరాబాద్ – బెంగుళూరు హైస్పీడ్ రైలు ప్రాజెక్టుల సర్వే, అలైన్‌మెంట్ ప్రతిపాదనలను మరోసారి పరిశీలించాలని ముఖ్యమంత్రి రైల్వే అధికారులకు సూచించారు. హైదరాబాద్ చుట్టూ రీజనల్ రింగ్ రైల్ ఆవశ్యకతను ముఖ్యమంత్రి అధికారులకు వివరించారు. దాదాపు 362 కిలోమీటర్ల మేరకు రీజనల్ రింగ్ రోడ్డు వెంట రింగ్ రైలు ఏర్పాటు చేయటంతో హైదరాబాద్ మహానగరం భవిష్యత్తు స్వరూపం మారిపోతుందన్నారు. వీలైనంత తొందరగా ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రైల్వే అధికారులకు సిఎం సూచించారు. తెలంగాణ ఇండస్ట్రియల్ సెక్టార్ కోసం ప్రత్యేక రైల్వే లైన్ ఉండేలా ఈ కనెక్టివిటీ ఉండాలని సిఎం అభిప్రాయపడ్డారు. వికారాబాద్ కృష్ణా కొత్త రైల్వే లైన్ పనులను వీలైనంత త్వరగా చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. దీంతో పాటు గద్వాల – డోర్నకల్ రైల్వే లైన్ పనుల డిపిఆర్‌ను పూర్తి చేసి వేగంగా చేపట్టాలన్నారు. వరంగల్‌లోనూ రైల్వే లైన్లను అభివృద్ధి చేయాలని, భూపాలపల్లి నుంచి వరంగల్‌కు కొత్త మార్గాన్ని పరిశీలించాలని సూచించారు. కాజీపేట జంక్షన్‌లో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని అన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్‌తో పాటు వరంగల్ ను అభివృద్ధి చేయాలని, అందుకు అనుగుణంగా రైల్వే ప్రాజెక్టులను చేపట్టాలని ముఖ్యమంత్రి రైల్వే అధికారులకు సూచించారు.

## జాతీయ మహాసభలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు అమర్‌జిత్ కౌర్ ప్రకటించారు. ఆమెతో పాటు సిపిఐ పంజాబ్ నాయకులు, రిసెప్షన్ కమిటీ ప్రధాన కార్యదర్శి బంత్ సింగ్ బ్రార్, చైర్మన్ స్వరాజ్‌బీర్ సింగ్ పాల్గొన్నారు. దేశ నలుమూల నుంచి 800 మందికిపైగా ప్రతినిధులు మహాసభలకు హాజరు కానున్నారు. మహాసభల్లో భాగంగా గాజాలో ఇజ్రాయిల్ మారణహోమాన్ని ఖండించేందుకు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారు. అదే సందర్భంగా క్యూబా ప్రజలకు సంఘీభావం తెలుపుతారు. క్యూబా, పాలస్తీనా దౌత్యాధికారులు ఈ సమావేశాలకు హాజరు కానున్నారు. అలాగే, సిపిఐఎం, ఆర్‌ఎస్‌పి, ఫార్వర్డ్ బ్లాక్, సీపీఐ(ఎంఎల్) నాయకులు ప్రారంభ సభకు విచ్చేస్తారు. జాతీయ మహాసభను పురస్కరించుకొని జాతీయ, అంతర్జాతీయ అంశాలపై ప్రతినిధులు చర్చిస్తారు. ప్రజాస్వామ్యానికి ముప్పు, నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, కార్మిక హక్కుల హరణ, ఆరోగ్యం, విద్య వ్యాపారీకరణ తదితర అంశాలపై తీర్మానాలు చేస్తారు. మహాసభల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, విప్లవ గీతాలాపనలు, నాటికలు, జానపద గేయాలతో ప్రముఖ కళాకారులు ఇచ్చే ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలవబోతున్నాయి. మహాసభలకు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని, విజయవంతం చేయాలని సిపిఐ నాయకులు పిలుపునిచ్చారు.

## చార్లీ కిర్క్ హత్య

(మొదటి పేజీ తరువాయి)

కూడా అందరూ విద్యార్థిగానే భావించారు. హంతకులకోసం దేశమంతటా తీవ్ర గాలింపు జరుగుతోంది. ''సత్యం కోసం ప్రాణత్యాగం చేసిన అమరుడు ఛార్లీ కిర్క్ అని డోనాల్డ్ ట్రంప్ నివాళులు అర్పించారు. కిర్క్‌ను యూత్ లెజండరీగా అభివర్ణించారు. అమెరికా రాజకీయాలపై తనదైన ముద్ర వేసి గతించారని కొనియాడారు. ఆయన యువకుల హృదయాల్లో మిగిలిపోతారని, ఆయనకు మించిన గొప్ప నాయకుడు లేరని ట్రూత్ సోషల్ మీడియా ద్వారా చెప్పారు. లెఫ్ట్ ఉగ్రవాదులో ఈ ఘాతుకానికి పాల్పడ్డారని ఆయన విమర్శించారు. హంతకుడు విద్యార్థుల్లో ఒకడుగా గుర్తుపట్టడానికి వీల్లేకుండా కలిసిపోయాడన్నారు. అధికారులు తాజా వీడియో ఫుటేజీలను సమీక్షించారని చెప్పారు. ఇది రాజకీయహత్య అని ఉతాహ్ ప్రభుత్వం ప్రటించింది. అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్, అధ్యక్ష పదవికి పోటీ చేసిన మాజీ ఉపాధ్యక్షురాలు కమలాహ్యారిస్ సహా పలువురు నాయకులు ఈ హత్యను తీవ్రంగా ఖండించారు. అమెరికాలో రాజకీయ హత్యలకు అవకాశం లేదని వారు అన్నారు. హంతకుణ్ణి పట్టుకునేందుకు ఎఫ్‌బిఐ రంగంలోకి దిగింది. తమ పూర్తి వనరులను ఉపయోగించి హంతకులను పట్టుకుంటామని ఎఫ్‌బిఐ అధికారులు ప్రకటించారు. గడచిన పది సంవత్సరాలుగా అమెరికాలో కన్జర్వేటివ్ భావజాలాన్ని యువకులు, విద్యార్థుల్లో విస్తారంగా ప్రచారం చేస్తున్న ఛార్లీ కర్క్‌కు ట్రంప్‌కు మధ్య గాఢమైన స్నేహం ఉంది. ఆయన తరచు వైట్‌హౌస్‌కు వచ్చి ట్రంప్‌ను కలిసి వెళుతూ ఉంటారు. 2012లో విద్యార్థుల్లో ఛాందస భావాలను ప్రోత్సహించడంద్వారా ఛార్లీ కిర్క్ ప్రస్థానం ప్రారంభమైంది. 2016లో ట్రంప్‌తో కలిసి రిపబ్లికన్‌పార్టీ జాతీయ సదస్సులో ప్రసంగించి ఆయన అభిమానం సంపాదించడంతో పాపులర్ అయ్యారు. 2019లో రాజకీయ ప్రచార విభాగం ప్రారంభించడంతో ఛార్లీ కిర్క్ కెరీర్ మలుపు తిరిగింది. 2020లో ట్రంప్ అనుకూల ప్రచారం చేయడంతో ఇక కన్జర్వేటివ్ నాయకుడుగా ఆయన వెళ్ళూనుకున్నారు.

**ఛార్లీ కిర్క్‌కు 'ప్రెసిడెంట్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్'**
ఉతాహ్ విశ్వవిద్యాలయంలో ప్రసంగిస్తుండగా హత్యకు గురైన కన్జర్వేటివ్ యువ నాయకుడు ఛార్లీ కిర్క్ (31)కు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ''ప్రెసిడెంట్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్'' ప్రకటించారు. ఛార్లీ కిర్క్ దేశంలో లక్షల లక్షలమంది యువతీయువకులకు, ప్రజలకు గొప్ప స్ఫూర్తి ప్రదాతగా ఆయన పేర్కొన్నారు. ఛార్లీ సేవలకు గుర్తుగా మరణానంతరం ఆయనకకు ప్రెసిడెంట్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్'' ఇస్తున్నట్లు ప్రకటించారు. అమెరికా ట్విన్ టవర్స్‌పై అల్‌ఖైదా ఉగ్రవాదులు దాడులు చేసి సెప్టెంబరు 11వ తేదీన నాటికి 24 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పెంటగాన్‌లోని అమెరికా రక్షణశాఖ కార్యాలయ ప్రాంగణంలో గురువారం ఉదయం ట్రంప్ ప్రసంగిస్తూ, ఛార్లీ కిర్క్‌కు ప్రెసిడెంట్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్‌ను ప్రకటించారు. ఛార్లీ స్ఫూర్తి దేశంలో అసంఖ్యాక ప్రజల హృదయాల్లో పదిలంగా ఉండిపోతుందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన భార్యా,పిల్లలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## మెదక్‌లో క్లౌడ్ బరస్ట్ (మొదటి పేజీ తరువాయి)

టేడిపల్లి, పెద్ద శంకరంపేట్, కౌల్చారం, నార్సింగ్ మండలాల్లో వర్షం దంచికొట్టింది. మెదక్ పట్టణంలో కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ చెరువులను తలపించాయి. దీంతో వాహనదారులు,పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మోకాల్లోతు నీరు రావడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.దాదాపు నాలుగు గంటలు పడిన వర్షానికి లోతట్టు ప్రాంతాలలో వరద నీరు చేరింది. పట్టణంలోని గాంధీనగర్, బృందావన్ కాలనీ, ఆటోనగర్, వెంకట్రావు నగర్ కాలనీ, సాయినగర్ కాలనీ,పతే నగర్,జెయన్ రోడ్, మున్సిపల్ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు భారీగా చేరడంతో మున్సిపల్,రెవిన్యూ అధికారులు జెసిబిల సహాయంతో మాన్యువల్స్ ఓపెన్ చేసి వరద నీరును తొలగించారు.మెదక్ పట్టణంలోని గాంధీ నగర్ కాలనీలో వరద ముంచెత్తడంతో ఇండ్లలోకి చేరిన వర్షపు నీరు చేరి ప్రజలు అవస్థలు పడ్డారు.రాందాస్ చౌరస్తా నుంచి కొత్త బస్టాండ్ వరకు రోడ్డుపై వరద భారీగా పారింది. మెదక్ హైదరాబాద్ హైవేపై భారీగా వరద నీరు చేరడంతో జేసీబీతో అధికారులు డివైడర్ ని తొలగించారు. మెదక్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలోకి వరద నీరు చేరుకోగా విద్యార్థినులు సురక్షితంగా బయట పడ్డారు. మెదక్ జిల్లా కేంద్రంలో అత్యధికంగా 17 సెంటీమీటర్లు, రాజపేట 9 సెంటీమీటర్లు, పాతూరు 8 సెంటీమీటర్లు వర్షపాతం నమోదయింది. భారీ వర్షం కారణంగా మెదక్ మండలం కొంటూరు చెరువు అలుగు ఉధృతంగా పారడంతో వెంకటాపూర్, శివ్వాయిపల్లి, గుటకింది పల్లి మక్త భూపతిపూర్, తిమ్మానగర్ గ్రామాలకు వెళ్లే దారిని నీటి పారుదల శాఖ, పోలీసులు, రెవిన్యూ శాఖ అధికారులు మూసివేశారు. దీంతో గ్రామాల ప్రజలకు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

**రాష్ట్రంలో మరో ఐదురోజులు భారీవర్షాలు ...** రాష్ట్రంలో రాగల ఐదురోజులు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో వర్షాలు కురుస్తాయని తెలిపారు. గురువారం నిర్మల్, నిజామాబాద్, నల్లగొండ, సూర్యాపేట, రంగారెడ్డి, హైదరాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పారు. శుక్రవారం నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. శనివారం నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, నల్లగొండ, సూర్యాపేట, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో, ఆదివారం నిజామాబాద్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ నారాయణపేట, వపర్తి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయన్నారు. సోమవారం కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయన్నారు. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశామన్నారు.

## ప్రధానిపై తర్జనభర్జన

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపాదించగా ఇద్దరుపేర్లు కూడా చర్చకు వచ్చాయి.
రాచరికపు వాసనలతో కూడిన పరిపాలన పునరుద్ధరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అంతర్జాతీయ మీడియా వ్యాఖ్యలు చేస్తున్న తరుణంలో ఆ దేశంలో తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాటుకు రెండోరోజు గురువారం కూడా చర్చలు కొనసాగాయి. ఖాట్మండు మెట్రోపాలిటన్ సిటీ మేయర్ బాలెన్ షా, విద్యుత్ బోర్డు మాజీ ఎండి కుల్మన్ ఘీసింగ్ పేర్లు కూడా పరిశీలనకు వచ్చాయి. ఐతే మేయర్ బాలెన్ షా మాత్రం సుశీల కర్కికి మద్దతు తెలియజేశారు.కొత్త ప్రభుత్వ నేతలుగా సుశీల కర్కితోపాటు మేయర్ షా, సున్సారీజిల్లా జిల్లా ప్రధాన నగరం ధారణ్ మేయర్ హర్కా సంపంగ్ పేర్లు కూడా పరిశీలనకు వచ్చాయి. ఐతే జనరేషన్ జెడ్‌లో కొన్ని అభ్యంతరాలు వ్యక్తమవుతున్నప్పటికీ సుశీల కర్కి ఏకగ్రీవ అభ్యర్థిగా మారేందుకు ఎక్కువ అవకాశాలున్నాయి.
దేశాధ్యక్షుడు రామచంద్ర పౌడెల్‌తో అధ్యక్ష కార్యాలయంలో జనరేషన్ జెడ్ నాయకత్వంతో గురువారం జరిగిన చర్చల్లో నేపాల్ సర్వసైన్యాధిపతి జనరల్ అశోక్‌రాజ్ సిగ్దల్ కూడా పాల్గొన్నారు. తొలుత సిగ్దల్‌తో ప్రదర్శకుల తరపున నాయకులు చర్చలు జరిపి అందరూకలిసి భద్రకాళిలోని ప్రధాన ప్రభుత్వ కార్యాలయానికి వెళ్ళి చర్చలు జరిపారు. ఆమె పేరును లాంఛనంగా ధృవీకరించాల్సి ఉంది. తాత్కాలిక ప్రభుత్వాధినేత ఎంపికపై సంబంధిత వర్గాలకు చెందిన అనేకమందితో ముమ్మరంగా చర్చలు జరిపినట్లు ఆర్మీ ఉన్నతాధికార ప్రతినిధులు చెప్పారు. ఐతే ఎవరెవరితో చర్చలు జరిపారన్న విషయం ఆయన చెప్పలేదు. చర్చల సమయంలో ఆర్మీ కేంద్ర కార్యాలయం వెలుపల దజన్లసంఖ్యలో యువకులు ఎంతో ఆతృతగా తుది నిర్ణయంకోసం ఎదురుచూశారు.
ముందుగా ఆర్మీ నాయకులకు, సుశీల కర్కి సహాయకులకు మధ్య చర్చలు జరిగాయి. తాత్కాక ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టేందుకు సుశీల కర్కి సంసిద్ధత వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలతో యువకులు ఎవ్వరూ చర్చలు జరిపేందుకు సిద్ధంగా లేరని, కర్కి ఒక తటస్థమైన వ్యక్తిగా, మచ్చలేని వ్యక్తిగా పేరుపడినందువల్ల ఆమెను తాత్కాలిక ప్రధానమంత్రిగా నియమిస్తే దేశాభివృద్ధికి, శాంతి సాధనకు ప్రయోజనకరంగా ఉంటుందని జనరేషన్ జెడ్ విజ్ఞప్తి చేసింది. మంచి సైద్ధాంతిక ఆలోచనలు ఉన్న నాయకుల చేతిలో దేశ భవిష్యత్తు ఉండాలని తాము కోరుకుంటున్నామని ప్రదర్శకుల తరపున నాయకులు ఆర్మీ చీఫ్‌కు చెప్పారు. దేశక్షేమంతోపాటు నిరుద్యోగ సమస్య పరిష్కారం, యువకులకు మంచి భవిష్యత్తును అందించే నాయకులకు దేశాన్ని అప్పగించాలని పలు ఇంటర్వ్యూలలో ప్రదర్శకులు చెబుతున్నారు. అమె తాత్కాలిక ప్రధానమంత్రి స్థానంలో ఉంటే భవిష్యత్‌లో అన్నివర్గాలతో జరిపే చర్చలు ఫలవంతంగా ఉంటాయని తెలియజేసింది.

**ప్రదర్శకుల డిమాండ్లు నెరవేర్చేందుకు కృషి చేస్తున్నాం : అధ్యక్షుడు పౌడెల్**
దేశంలో నిరసన ప్రదర్శకులు కోరినవిధంగా వారి అభివృద్ధికర ఆలోచనలకు అనుగుణంగా ఒక రాజ్యాంగ పరిష్కారం సాధించేందుకు శరవేగంగా ప్రయత్నం చేస్తున్నామని నేపాల్ అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ ప్రకటించారు. రెండో రోజు పలువురితో చర్చల అనంతరం గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, ప్రదర్శకులు, దేశంలో ప్రజలు శాంతిని పాటించాలని, రాజ్యాంగాన్ని రక్షించి అందుకు అనుగుణంగా నడచుకోవాలని విజ్ఞప్తి చేశారు. డిమాండ్లు నెరవేర్చేందుకు ఉన్న అన్ని అవకాశాలను పరిశీలిస్తున్నామని, శాంతిని కాపాడేందుకు సహకరించాలని కోరారు.

**34కు పెరిగిన మృతుల సంఖ్య...** ఈనెల 8,9 తేదీలలో జరిగిన హింసాత్మక ఘటనలలో మరణించిన వారిసంఖ్య 19 నుండి 34కు పెరిగినట్లు నేపాల్ ఆరోగ్య, జనాభా మంత్రిత్వశాఖ గురువారం ఒక ప్రకటనలో తెలియజేసింది. అల్లర్లలో మొత్తం 1,368 మంది గాయపడ్డారు. వీరిలో 949 మందికి చికిత్సలుచేసి వివిధ ఆసుపత్రులనుండి విడుదల చేశారు. మొత్తం ఎనిమిది ఆసుపత్రులలో వీరు చికిత్స పొందుతున్నారు. త్రిభువన్ యూనివర్సిటీ పరిధిలో ఉన్న కాలేజీలలో దేశవ్యాప్తంగా తరగతులను, పరీక్షలను అధికారులు పరిస్థితులు చక్కబడేవరకూ రద్దుచేశారు. ఇంకోవైపు దేశంలోని అనేక ప్రాంతాలలో కర్ఫ్యూ, నిషేధాజ్ఞలను పొడిగించారు. దీంతో రాజధాని ఖాట్మండు, రూపందేహి, మోరాంగ్ సహా అనేక ప్రాంతాలలో పగటిపూట ఉదయం ఆరు నుండి సాయంత్రం ఐదు గంటల వరకూ వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఆర్మీ పెద్దసంఖ్యలో గస్తీ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఐతే ఛిత్వాల్‌లో గురువారం ఉదయ కర్ఫ్యూ తొలగించారు. బ్యాంకులు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు మధ్యాహ్నం ఒంటిగంటవరకూ పనిచేశాయి.



# జనరల్
STATE & REGIONAL NEWS

## భారత్–ఆఫ్రికా సంబంధాల బలోపేతానికి మరింత కృషి

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారత్–ఆఫ్రికా దేశాల మధ్య వ్యవసాయ రంగంలో సంబంధాల బలోపేతానికి మరింత కృషి చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. హైదరాబాద్‌లో గురువారం జరిగిన ఇండియా–ఆఫ్రికా సీడ్ సమ్మిట్– 2025కు మంత్రి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ సమ్మిట్ కేవలం వాణిజ్యంపై కాకుండా, సీడ్ డిప్లొమాసీ ద్వారా విశ్వాసాన్ని పెంపొందించడం, శాస్త్ర పరిజ్ఞానం పంచుకోవడం, సుస్థిరమైన వ్యవసాయానికి భవిష్యత్తులో పరస్పరం కలిసి పనిచేయడం కోసం ఈ వేదిక ఒక వారధిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. భారత దేశం గ్రీన్ రివల్యూషన్ ద్వారా ప్రపంచంలోనే తొలిసారిగా ఆహార ధాన్యాలలో స్వయం సమృద్ధి సాధించిందని, ఆ విజయానికి మూలం నాణ్యమైన విత్తనం అని, నాణ్యమైన విత్తనమే లేకపోతే పంట లేదు. అలాగే రైతు ప్రగతి సాధ్యం కాదు అని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ దేశాల నుండి, ప్రభుత్వ, ప్రైవేట్ రంగ ప్రతినిధులు పాల్గొన్నారు.

# అమరవీరుల స్మృతివనం ఏర్పాటు చేయాలి

### తెలంగాణలో కమ్యూనిస్టులది త్యాగాల చరిత్ర
### సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి





**ప్రజాపక్షం/కరీంనగర్ :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల కోసం హైదరాబాద్‌లో స్మృతివనం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణలో కమ్యూనిస్టులది త్యాగాల చరిత్ర ఉందన్నారు. రైతాంగ పోరాటాన్ని వక్రీకరిస్తే బిజెపికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పక తప్పదని హెచ్చరించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను కరీంనగర్‌లో గురువారం ప్రారంభించారు. స్థానిక బద్దం ఎల్లారెడ్డి విగ్రహానికి సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్‌తో కలిసి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం బద్దం ఎల్లారెడ్డి విగ్రహం నుంచి సిపిఐ శ్రేణులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కోతిరాంపూర్, కమాన్, తెలంగాణ చౌరస్తా మీదుగా అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహం వద్దకు బైక్ ర్యాలీ చేరుకుంది. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరులను స్మరిస్తూ కార్యకర్తలు నినాదాలతో మారుమ్రోగించారు. ఈ సందర్భంగా అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహానికి సిపిఐ నేతలు చాడ, పంజాల శ్రీనివాస్‌లు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ఆకలి మంటలు, ఆర్తనాదాలు, అణచివేతలకు వ్యతిరేకంగా పుట్టిందే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని పేర్కొన్నారు. భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వస్తే నిజాం నవాబుల పరిపాలనలో కొనసాగుతున్న హైదరాబాద్ రాష్ట్రానికి (తెలంగాణ)కు స్వాతంత్ర్యం రాలేదన్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఎంతోమంది కమ్యూనిస్టులు పోరాటం చేసి అసువులు బాసారని పేర్కొన్నారు. తెలంగాణలో జరిగిన ఆంధ్రమహాసభల్లో హైదరాబాద్ సంస్థానాన్ని పరిపాలిస్తున్న నవాబుల పరిపాలన అంతం కోసం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి బద్దం ఎల్లారెడ్డి, రావినారాయణరెడ్డి, మఖ్దూం మొయినొద్దీన్‌ల పిలుపుతో కమ్యూనిస్టులు వీరోచిత పోరాటాలు చేశారన్నారు. తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలన్నారు. 4500 మంది ప్రాణాలు పోగొట్టుకున్న త్యాగాల చరిత్ర కమ్యూనిస్టు పార్టీకి మాత్రమే ఉందన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కరీంనగర్ జిల్లా పాత్ర కీలకంగా ఉందన్నారు. ఈ ప్రాంత ప్రజల కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అసువులు బాసిన అమరవీరుల ఆశయాలను, లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లేందుకు సిపిఐ శ్రేణులు కంకణబద్ధులు కావాల్సిన అవసరముందన్నారు. సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందె స్వామి, పొనగంటి కేదారి, కసిరెడ్డి మణికంఠ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన కుమార్, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, నాగెల్లి లక్ష్మారెడ్డి, బోయిని తిరుపతి, పిట్టల సమ్మయ్య, వివిధ మండలాల కార్యదర్శులు బండ రాజిరెడ్డి, గోవిందుల రవి, చొక్కల్ల శ్రీశైలం, లంకదాసరి కళ్యాణ్, ఉమ్మెంతల రవీందర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు తదితరులున్నారు.

## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట దినోత్సవాన్ని
# ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం దినోత్సవం పేరుతో సెప్టెంబర్ 17న ప్రభుత్వం అధికారికంగా ఉత్సవాలను నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషాలు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహాతో కలిసి వారు మాట్లాడారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరితో పాటు తెలంగాణ ప్రాంత విముక్తి కోసం కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో మట్టిమనుషులంతా ఏకమై దొరలు, భూస్వాములు, జాగీర్దారుల గడీలు బద్దలుకొట్టి వారిని తరిమి కొట్టిన మహోత్తర ఉద్యమం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటామని, అలాంటి వీర తెలంగాణ పోరాట స్ఫూర్తిని నేటి తరాలకు అందించాల్సిన ప్రభుత్వాలు సమైక్య దినోత్సవమంటూ, ప్రజాపాలన దినోత్సమంటూ రకరకాల పేర్లతో వేడుకలు జరపడమేమిటని ప్రశ్నించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం పేరుతోనైనా ఉత్సవాలను నిర్వహించాలని, ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంచి పేరు, గుర్తింపు వస్తుందని సూచించారు. నాటి సమర యోధుల త్యాగాలతో పాటు వారి చరిత్ర భావితరాలకు అందించేందుకు రాష్ట్ర రాజధాని కేంద్రమైన హైదరాబాద్‌లో ప్రత్యేక మ్యూజియం ఏర్పాటు చేయడంతో పాటు ఈ పోరాటానికి నాయకత్వం వహించిన బద్దం ఎల్లారెడ్డి, రావి రాయణ రెడ్డి, అరుట్ల రామచంద్రారెడ్డి, కమలాదేవి, ధర్మభిక్షం లాంటి మహానేతల విగ్రహాలను ట్యాంక్ బండ్‌పై లేదా ప్రధాన ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఓ చరిత్ర అని, ఆ పోరాటాన్ని హిందూ, ముస్లింల మధ్య ఘర్షణగా వక్రీకరించేందుకు బిజెపి ప్రయత్నం చేస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

**తొలిసారి జాతీయ పతాకాన్ని ఎగురవేసింది ఎహెచ్‌ఎస్‌యు నేత రఫీనే**

దేశానికి స్వాతంత్ర్యం లభించిన 1947 అగస్టు 15న నిజాం నిర్భందాలను ఛేధించుకుని హైదరాబాద్‌లోని సిటీ కళాశాలలో జాతీయ పతాకాన్ని మొట్టమొదటిసారిగా ఆవిష్కరించింది ఆల్ హైదరాబాద్ స్టూడెంట్ యూనియన్‌ది నాయకుడు రఫీ అహ్మద్ అని, ఇది చరిత్ర అని, దీనిని ఎవరూ తుడిచివేయలేరని అజీజ్ పాషా స్పష్టం చేశారు. తెలంగాణ విముక్తి కోసం 4 వేల మంది యోధులు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన మహత్తర చరిత్ర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానిదని అన్నారు. గ్రామాల నుంచి దొరలను తరిమితరిమి కొట్టి 4వేల గ్రామాలను విముక్తి చేయడంతో పాటు 10 లక్షల ఎకరాలకు పైగా భూములను పేదలకు పంచిందని, అంత ఘనచరిత్ర ఉన్న ఈ పోరాటాన్ని 2011వరకు కనీసం జాతీయ పతాకాన్ని కూడా ఎగురవేయని ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో పురుడుపోసుకున్న బిజెపి ఇప్పుడు వక్రీకరించడం హేయమైన చర్య అన్నారు.

## పారదర్శకతే లక్ష్యంగా ఇందిరమ్మ ఇండ్ల
# ప్రత్యేక కాల్ సెంటర్ ఏర్పాటు

### కాల్ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి పొంగులేటి
### టోల్ ఫ్రీ కాల్ సెంటర్ ఫోన్ 1800 599 5991



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, నిర్మాణం మొదలు సబ్సిడీ విడుదల వరకు పూర్తి పాదర్శకతే లక్ష్యంగా ప్రత్యేక కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల సమస్యలు, సందేహాల నివృత్తి కోసం హైదరాబాద్‌లోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన టోల్ ఫ్రీ కాల్ సెంటర్‌ను, హెల్ప్ డెస్క్‌ను గురువారం మంత్రిపొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఎలాంటి సందేహాలు, సమస్యలు ఉన్నా తక్షణమే కాల్ సెంటర్ ఫోన్ నెం. 1800 599 5991 ఫోన్ చేయవచ్చాన్నారు. ఈ కాల్ సెంటర్ ప్రతి రోజూ ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9గంటలవరకు పనిచేస్తుందని ప్రధానంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించడంతోపాటు, వాటిని పరిష్కరించడంలో చొరవ చూపడానికి ఈ కాల్‌సెంటర్‌ను వినియోగించుకోవచ్చునన్నారు. లబ్ధిదారుల ఫోన్ నెంబరు, ఆధార్ నెంబరు ఆధారంగా వివరాలను పరిశీలించి సమస్యను పరిష్కరించడానికి అధికారులు చర్యలు తీసుకుంటారని వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో పారదర్శకతకు పెద్దపీట వేస్తూ, పూర్తి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటున్నామని, ఇప్పటికే ఇందిరమ్మ యాప్ ద్వారా మంచి ఫలితాలు సాధించామని, కృత్రిమ మేధ (ఎఐ)ను కూడా విరివిగా వాడుతున్నామని, ఈ కాల్ సెంటర్ ద్వారా లబ్ధిదారులకు మరింత చేరువ అవుతున్నామని మంత్రి పేర్కొన్నారు.

# సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు
### కాజీపేటలో ఘనంగా సాయుధ పోరాట వార్షికోత్సవం



**ప్రజాపక్షం/హనుమకొండ :** తెలంగాణ విలీన దినోత్సవంపై కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలు కపట నాటకాలు ఆడుతున్నాయని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా హనుమకొండ జిల్లాలో గురువారం సిపిఐ కాజీపేట మండల సమితి ఆధ్వర్యంలో రాంపూర్ లోని అర్శనపల్లి హనుమంతరావు స్తూపం వద్ద వార్షికోత్సవ సభ నిర్వహించారు. సభకు ముందుగా అర్శనపల్లి హన్మంతరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభకు సిపిఐ మండల కార్యదర్శి మాలోతు శంకర్ అధ్యక్షత వహించగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని, ట్యాంక్ బండ్ పై సాయుధ పోరాట యోధుల విగ్రహాలు పెడతామని, పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను చేర్చుతామని చెప్పిన హామీలను ప్రభుత్వం ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు. మరోవైపు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తూ నైజాం పై పోరాటాన్ని హిందూ, ముస్లింల గొడవగా చిత్రీకరిస్తున్నదని అన్నారు. బిజెపికి తెలంగాణ విలీన దినోత్సవంపై మాట్లాడే హక్కు లేదన్నారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని, అమరుల జీవిత చరిత్రలను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠ్యాంశాలుగా చేర్చడంతో పాటు తెలంగాణ విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శులు మద్దెల ఎల్లేష్, తోట బిక్షపతి, నాయకులు ఎన్ ఎ స్టాలిన్, మునిగాల బిక్షపతి, కర్రె లక్ష్మణ్, బత్తిని సదానందం, యేషబోయిన శ్రీనివాస్, కొట్టేపాక రవి, వేల్పుల సారంగపాణి, అలువాల రాజు, బొట్టు బిక్షపతి, కొట్టే వెంకటేష్, లకవత్ లక్ష్మి, దండు సుమన్, గోకుల రాజయ్య, మునిగాల ఐలయ్య, రాజరాపు రాజు, పసునూరి సునీల్, మునిగాల రాజు, రీల్ పూర్ణచందర్, బైరపాక అన్నమ్మ, మడికంటి లావణ్య, సారమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఉదయించే సూరీడు సురవరం

### అయన ఆశయాలకు పునరంకితం అవుదాం
### సురవరం సంస్మరణ సభలో వివిధ పార్టీ నేతలు పిలుపు



**విజయవాడ :** ప్రజా సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటం చేసి, ప్రజల గుండెల్లో ఉదయించే సూరీడుగా భారత కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకుడు సురవరం సుధాకరరెడ్డి చిరస్థాయిగా నిలిచిపోయారని వివిధ రాజకీయ పార్టీల నేతలు కొనియాడారు. అనారోగ్య కారణంగా ఇటీవల మరణించిన సురవరం సుధాకర్‌రెడ్డిని స్మరించుకుంటూ భారత కమ్యూనిస్టు పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో సంసర్మణ సభ విజయవాడలోని దాసరిభవన్‌లో గురువారం ఘనంగా జరిగింది. ఈ సభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకష్ణ అధ్యక్షత వహించారు.

అనంతరం కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యులు కెవిపి రామచంద్రరావు, వైసిపి శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ, టిడిపి పోలీట్‌బ్యూరో సభ్యులు టిడి జనార్ధన్, సిపిఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి మధు తదితర నాయకులు సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తొలుత ప్రజా నాట్యమండలి కళాకారులు ఆలపించిన తెలుగు నేలపై...వెలచిన సురవరమా...మరణమైన జననం గల మానవత సురవరమా అనే పాట వింటున్న వీక్షకుల గుండెలు బరువెక్కాయి. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకష్ణ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ప్రజా సమస్యలపై పోరాడి అజాతశత్రువుగా సురవరం సుధాకర్‌రెడ్డి నిలిచిపోయారని స్పష్టం చేశారు. తెలంగాణాలో జన్మించిన ఇరు రాష్ట్రాల ప్రజలతో చెరగని అనుబంధాన్ని కలిగియున్న ఏకైక నాయకుడన్నారు. కమ్యూనిజం సిద్ధాంతాల ఆశయ సాధన కోసం పనిచేసిన కుటుంబ నేపథ్యం నుండి వచ్చిన సురవరం విద్యార్థి దశ నుంచే ప్రజా ఉద్యమాలలో చురుకుగా పాల్గొని తనదైన ముద్ర వేసుకున్నారని అన్నారు. పార్టీ కోసం పనిచేస్తున్న నాయకులు మరింత ఉన్నతంగా ఎదగాలని ఆ దిశగా కృషి చేసేవారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యులు కెవిపి. రామచంద్రరావు మాట్లాడుతూ 60సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో నిబద్ధతతో అదే సిద్ధాంతాన్ని నమ్ముకుని చివరి వరకు కొనసాగిన నాయకుడు సురవరం అన్నారు. పార్టీ , నాయకులపరంగా ఎన్నో అవమానాలు, కష్టాలు వచ్చినా చెరగని చిరునవ్వుతో ముందుకు సాగేవారని తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డితో మంచి సత్సంబంధాలు ఉన్నాయని, బషీర్‌బాగ్ విద్యుత్ ఉద్యమంలో ప్రాణాలు సహితం లెక్కచేయకుండా ఉద్యమించారనిగుర్తుచేశారు. యుపిఎ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నప్పుడు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తూ కార్మిక, కర్షకులకు చెందిన అంశాలపై దృష్టిసారించి హక్కులు సాధనకు కారణమయ్యారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజనను వ్యతిరేస్తూ సిపిఐ విశాలాంధ్ర కోసం గట్టిగా నిలబడిందని, దీంతో సువరం పోరాడారని తెలిపారు.

వైసిపి శాసనమండలి పక్షనేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ సిపిఐ నాయకత్వంతో తనకు అనుబంధం ఉందని, నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకు పోరాడిన సురవరం గొప్ప నాయకుడని కొనియాడారు. ఆయన ఆశయాలు సమాజానికి ఎంతో అవసరం అన్నారు. చిన్న చిన్ని భిన్నాభిప్రాయాలు ఉన్నా ఉభయ కమ్యూనిస్టు పార్టీల సిద్ధాంతాలు నేటి సమాజానికి అందించాలని పిలుపునిచ్చారు.

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు టిడి జనార్ధన్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి చివరకు పార్టీ కోసం పనిచేశారని తెలిపారు. జిల్లా స్థాయి నుంచి దేశ స్థాయి వరకు అగ్ర నాయకుడుగా ఎదిగి, ప్రజలు పక్షంగా ఉద్యమాలు చేశారని తెలిపారు. చనిపోయిన తరువాత ప్రజల మనస్సుల్లో ఉన్నవాడే నిజమైన నాయకుడని, ఆ కోవకు చెందినవారే సురవరం అని తెలిపారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు మాట్లాడుతూ పార్టీలు వేరైనా సురవరంతో ఉన్న అనుబంధం విలువైనదని, నేటి సభకు వివిధ పార్టీలకు చెందిన నాయకులు హాజరవడం అందుకు నిదర్శనం అన్నారు. కమ్యూనిస్టు పార్టీకి ఈ స్థాయి గుర్తింపు రావడానికి సురవరం కృషే కారణమని, నిరుపేదలు, దళితులు, బలహీనవర్గాల పక్షంగా ఆయన నిలిచారని చెప్పారు. ఈ సభలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు రావుల వెంకయ్య, అక్కినేని వనజ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే మస్తాన్ వలీ, వైసిపి నాయకులు గౌతంరెడ్డి, సిపిఐ న్యూ డెమోక్రసీ నాయకులు ప్రసాద్, సిపిఐ (ఎంఎల్ ) నాయకులు, జనచైతన్య వేదిక వ్యవస్థాపకులు లక్ష్మణరెడ్డి తదితరులు ప్రసగించారు. సిపిఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ వందన సమర్పణ చేశారు. అనంతరం పలు విప్లవ గేయాలతో ఓ బాలిక చేసిన నృత్యం వీక్షకులలో పోరాట స్ఫూర్తిని రగిలించింది. ఈ కార్యక్రమంలో విశాలాంధ్ర విజ్ఞాన సమితి జనరల్ మేనేజర్ హరినాథ్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నాయకులు పి.దుర్గాభవాని, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు నరహరశెట్టి నరసింహారావు తదితర నాయకులతో పాటు కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ప్రజా సమస్యల పరిష్కారాం కోసం పరితపించేవారు
**–సురవరం సుధాకర్‌రెడ్డి సతీమణి విజయలక్ష్మి**

తన రాజకీయ జీవిత ప్రస్థానంలో నిబద్ధతతో ప్రజా సమస్యల పరిష్కారాం కోసం పరితపించేవారని సురవరం సుధాకర్‌రెడ్డి సతీమణి విజయలక్ష్మి తెలిపారు. ఆ విధంగా జిల్లా స్థాయి నుంచి దేశ స్థాయి రాజకీయాలలో తనదైన ముద్ర వేసుకున్నారని తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన విద్యుత్ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించి అన్ని పార్టీలను ఐక్యం చేసి, విద్యుత్ ఫలాలు ప్రజలకు అందడానికి పోరాటం చేశారని తెలిపారు. పార్టీ ఆశయాలు, ప్రజల పట్ల నిబద్ధతతో పోరాటాలు స్ఫూర్తిగా నిలిపిన ఆయన ఆశయాలను అందిపుచ్చుకుని యువతకు పోరాటాల విద్య పట్ల ఆసక్తిని పెంపొందించాలని పిలుపునిచ్చారు.

### సురవరం ఉద్యమ పాఠశాలకు రూ.కోటి విరాళం
**విశ్రాంత ప్రొఫెసర్ నరసింహారావు దంపతులు ప్రకటన**

నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి 55సంవత్సరాలు రాజకీయ ప్రస్థానంతో ప్రజలపక్షంగా పోరాడిన యోధుడు, గొప్ప నాయకుడు సురవరం అని విశ్రాంత ప్రొఫెసర్ నరసింహారావు అన్నారు. ఉన్నతమైన వ్యక్తిత్వంతో సామాన్యమైన జీవితాన్ని గడిపారని గుర్తు చేశారు. దేశంలో మారుతున్న రాజకీయాలు, పరిస్థితులు గందరగోళంగా మారాయని, నాటి ఉద్యమ పోరాట స్ఫూర్తి లేకపోవడం దురదష్టకరమన్నారు. సురవరం సుధాకర్‌రెడ్డి పోరాట స్ఫూర్తితో ఉద్యమ పాఠశాలను నెలకొల్పేందుకు, అందుకు కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. తొలుత కోటి రూపాయిలు విరాళాంగా ఇస్తున్నానని ఈ సభలో ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు అభినందనలు తెలియజేశారు.



## ఉద్యానవన పంటల విస్తీర్ణం పెంచాలి

### రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ఉద్యాన వన పంటల విస్తీర్ణం పెంచడం తోపాటు సాంప్రదాయ పంటలను కాపాడుకోవాలని తెలంగాణ వ్యవసాయ రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. సాంప్రదాయ పంటల్లో భాగమైన బత్తాయి రైతుల సమస్యలపై గురువారం రైతు కమిషన్ కార్యాలయంలో ఉద్యానవన, మార్కెటింగ్ శాఖ అధికారులు, హార్టికల్చర్ యూనివర్సిటీ శాస్తవేత్తలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ బత్తాయి సాగులో ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రత్యేక స్థానముందని, గతంలో ఆ జిల్లాలో 4లక్షల ఎకరాల్లో బత్తాయి సాగైతే.. ఇప్పుడు మాత్రం కేవలం 43 వేల ఎకరాలకు పడిపోయిందన్నారు. కమిషన్ సభ్యులు కెవిఎన్ రెడ్డి, భూమి సునీల్, గోపాల్ రెడ్డి, రాములు నాయక్, భవాని రెడ్డి, చెవిటి వెంకన్న యాదవ్ తోపాటు కమిషన్ సెక్రెటరీ గోపాల్, మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ పద్మహర్షిణి, ఉద్యానవన శాఖ జాయింట్ డైరెక్టర్ బాబు, నల్గొండ డిఎస్‌హెచ్‌ఓ సుభాషిణి, ఉద్యానవన శాస్త్ర వేత్తలు రాజా గౌడ్, కమిషన్ అధికారులు హరి వెంకట ప్రసాద్, మహేష్ నాయక్, శ్రావ్య, డాక్టర్ విజయలక్ష్మి , ఇతర అధికారులు పాల్గొన్నారు.


**హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ**
4వ అంతస్తు, స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్.

బహిరంగ ప్రకటన
ప్రణాళిక విభాగం
file No. 004317 /HMDA /01267/ SWBP/SKP1/2025-REV

M/s అభినందన ఇన్‌ఫ్రా రియాలిటీ LLP గతంలో రంగారెడ్డి జిల్లా మణికొండ జాగీర్ గ్రామంలో 2,919.06 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న సర్వేనెంబర్ 264/EEలో రెండు సెల్లార్లు + 1 గ్రౌండ్ + 3పై అంతస్తులు కలిగిన IT ఆఫీస్ భవనం కోసం తేదీ: 31.12.2021 నాటికి దరఖాస్తు చేసుకుంది.

రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం మణికొండ జాగీర్ గ్రామంలో 4929.26 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న Sy.No.s: 264/EE, 264/A/Pలోని ఓపెన్ ల్యాండ్‌లో 2 సెల్లార్లు +1 గ్రౌండ్ + 8 అప్పర్ ఫ్లోర్లతో కూడిన సవరించిన కమర్షియల్ బిల్డింగ్ అనుమతి ఆమోదం కోసం M/s అభినందన ఇన్‌ఫ్రా రియాలిటీ LLP తేదీ:18.07.2025న దరఖాస్తు చేసుకుంది.

అందువల్ల, రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం మణికొండ జాగీర్ గ్రామంలో ఉన్న Sy.No.s: 264/EE, 264/A/P లోని చెప్పబడిన కమర్షియల్ బిల్డింగ్ యొక్క ఫ్లాట్ ఓనర్లు / కొనుగోలుదారులు / అగ్రిమెంట్ హోల్డర్లు ఈ నోటీసు ప్రదర్శించబడిన 15 రోజుల లోపు తమ అభ్యంతరాలు / సూచనలను ఈ కార్యాలయానికి లిఖిత పూర్వకంగా దాఖలు చేయవచ్చు. పైన పేర్కొన్న వ్యవధిలోపు ఎటువంటి అభ్యంతరాలు / సూచనలు అందకపోతే రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం మణికొండ జాగీర్ గ్రామంలో ఉన్న 4929.26 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న సవరించిన కమర్షియల్ బిల్డింగ్ Sy.No.s: 264/EE, 264/A/P ఆమోదం కోసం పెట్టుకున్న దరఖాస్తు అభ్యర్థనను ఈ కార్యాలయంలో అందుబాటులో ఉన్న మెటీరియల్ పేపర్ల ఆదారంగా పరిగణిస్తారు.

సం/- మెట్రోపాలిటన్ కమిషనర్
డైరెక్టర్ ప్లానింగ్-II, HMDA కోసం.

DIPR R.O. No. : 7914-PP/CL/ADVT/1/2025-26, Date: 11-09-2025

## భూనిర్వాసితుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: భూనిర్వాసితులు సమస్యలను పరిష్కరిచేందుకు తనవంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో దామరచర్ల మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన భూనిర్వాసితులతో నిర్వహించిన సమావేశంలో ఆయన సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో భూములు కోల్పోయిన ఆయా గ్రామాల ప్రజలకు గతంలో ఇచ్చిన హామీ మేరకు థర్మల్ పవర్ ప్లాంట్‌లో ఉద్యోగాలు కల్పిస్తామని, నిర్వాసితులకు పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భూనిర్వాసితులు ఉన్నారు.

## అర్హతలు లేకుండా వైద్యసేవలు..



ప్రజాపక్షం/హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ మండలంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి చంద్రశేఖర్ తన సిబ్బందితో కలిసి గురువారం క్లినికల్, ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అర్హత లేకుండా వైద్య సేవలు చేస్తున్న ఒక క్లినిక్‌ను సీజ్ చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఇలా ఉన్నాయి. బూరుగడ్డ, లింగగిరి గ్రామాలలో అనుమతులు లేకుండా ఎలాంటి వైద్య విద్యార్హత లేకుండా వైద్య సేవలందిస్తున్న వట్టికూటి రాంబాబు నిర్వహిస్తున్న క్లినిక్‌ను తనిఖీ చేసి సీజ్ చేశారు. అలోపతి వైద్యం, విద్యార్హత లేకున్నా, ఔషధ పరిజ్ఞాన లేకున్నా మెడికల్ షాప్ నిర్వహిస్తున్న వైద్య సేవలు అందించడం చట్టరీత్యా నేరమని ఆయన చెప్పారు. ఇలాంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్‌ఓ డాక్టర్ జయమనోహర్, డాక్టర్ జి చంద్రశేఖర్, డాక్టర్ సజయా తబస్సుమ్, డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ వి సంజీవరెడ్డి పాల్గొన్నారు.



## గర్భిణీలకు వైద్య సేవల పట్ల నిర్లక్ష్యంగా ఉండొద్దు

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రజా పక్షం/నల్లగొండ టౌన్: గర్భిణీ స్త్రీల వైద్య సేవల పట్ల నిర్లక్ష్యంగా ఉండవద్దని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు.గురువారం ఆమె మండలంలోని రాములబండ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి హై రిస్క్ ఏఎన్ సి కేసులు,కుక్క కాటుకు యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్,ఈడిడీ క్యాలెండర్,ఆసుపత్రిలో మందుల అందుబాటు,మలేరియా,డెంగ్యూ పరీక్షల నిర్వహణ తదితరాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆసుపత్రి డాక్టర్ జమీర్ తో మాట్లాడుతూ హై రిస్క్ గర్భిణీ కేసుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, నిరంతరం వారికి వైద్య సేవలు అందించాలని చెప్పారు. ఈ సందర్భంగా ఆమె ఆసుపత్రికి వస్తున్న జ్వరం కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పిహెచ్‌సిలో అందుబాటులో ఉన్న మందులు, ఆంటీ రేబిస్ వ్యాక్సిన్ సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు .ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆసుపత్రి ఆవరణలో పరిశుభ్రతను పరిశీలిస్తూ సంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం జిల్లా కలెక్టర్ అప్పజిపేటలో ఉన్న చందుపట్ల మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ విద్యార్థులకు నిర్వహిస్తున్న స్క్రీనింగ్ పరీక్షలను పరిశీలించారు.డిప్యూటీ డిఎంహెచ్‌ఓ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## డ్రగ్స్, గంజాయి మాఫియా అరికట్టాలి



ప్రజాపక్షం/మోటకొండూరు : యువత డ్రగ్స్, గంజాయి మాఫియా లాంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని సిపిఐ మోటకొండూరు మండల కార్యదర్శి గాదగాని మాణిక్యం అన్నారు. ఆయన బుధవారం మోటకొండూర్ మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో డ్రగ్స్ గంజాయి మాఫియాను అరికట్టాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో యువత, విద్యార్థులు గంజాయి డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారని, విచ్చలవిడిగా డ్రగ్స్ గంజాయి తయారు చేసి సరఫరా చేస్తుంటే కేంద్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరనెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఫార్మల్ కెమికల్ ఫ్యాక్టరీల పేరుతో డ్రగ్స్ దందాకు పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత యువజన సమైక్య ఎఐవైఎఫ్ మోటకొండూరు మండల అధ్యక్షులు కార్యదర్శి బోలగాని అశోక్, బీరకాయల మధు, జివికలపల్లి పాండు, గొట్టిపాముల సునీల్ కుమార్, జీవికలపల్లి గణేష్, బోల నర్సింహా, సిద్దుల కుమారస్వామి, జీవికలపల్లి నాగరాజు, మరికుక్కల మహేష్, వడ్డ పోయిన వెంకటేష్, బొట్ల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## 207.056కిలోల గంజాయి.. 173 మత్తు టాబ్లెట్లు దగ్ధం



ప్రజాపక్షం/నార్కట్‌పల్లి: మాదక ద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా అక్రమ గంజాయి రవాణా పైన జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపడం తో పాటు అక్రమ గంజాయి నివారణ పైన నిరంతర నిఘా పెడుతుందని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ తెలిపారు.జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలలో 18 కేసులలో 207.056కేజీల గంజాయి 118 గంజాయి చెట్లు 173 మత్తు టాబ్లెట్స్ సీజ్ చేసి కోర్టు ఉత్తర్వుల ప్రకారం నిర్మానుషంగా జనావసానికి దూరంగా ఉన్నటువంటి నార్కట్‌పల్లి మండలం గుమ్మల బావి పోలీస్ ఫైరింగ్ రేంజ్‌లో గురువారం జిల్లా ఎస్‌పి,డ్రగ్ డిస్పోజల్ కమిటీ అధ్వర్యంలో పూర్తిగా దగ్ధం చేశారు.ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోనే నల్లగొండ జిల్లాను మాదకద్రవ్యాల రహిత జిల్లాగా చేయడమే లక్ష్యంగా జిల్లా పోలీసులు అక్రమ గంజాయి సరఫరా చేయు వారి పైన ప్రత్యేక నిఘా పెడుతూ పట్టుబడి చేయడం జరిగిందన్నారు. జిల్లా పరిధిలో అక్రమ గంజాయి, డ్రగ్స్ రవాణా వినియోగం అరికట్టడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకొంటున్నమని తెలిపారు. ఎవరైన గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలను సరఫరా చేస్తున్నట్లు సమాచారం తెలిస్తే, టోల్ ఫ్రీ నంబర్ 8712670266 సమాచారం తెలపాలని కోరారు.

## తాళం వేసిన ఇండ్లలో చోరీలు కీలక నిందితుడు అరెస్టు



ప్రజాపక్షం/దేవరకొండ: దేవరకొండ పట్టణంలోని హనుమాన్ నగర్‌లో రాపోతు రమేష్ ఇంట్లో ఏప్రిల్ నెలలో జరిగిన దొంగతనం కేసులో బాధితుడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు నిందితున్ని పట్టుకొని అరెస్టు చేసినట్లు దేవరకొండ ఏఎస్పి మౌనిక తెలిపారు. ఈమేరకు గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ నిందితుడు పిట్ల గంగాదర్(30) కళ్యాణదుర్గం అనంతపురం జిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి చెడు వ్యసనాలకు అలవాటు పడి పేకాట, క్రికెట్ బెట్టింగ్ వంటి వాటికి అలవాటుపడి తాళం వేసిన ఇండ్లలో చోరీలు చేస్తున్నాడని ఇతనిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో సుమారు 100కుపైగా కేసులు నమోదు అయ్యాయని ఆమె తెలిపారు. నిందితుడు దొంగతనం చేసిన కొంతమేర డబ్బులను ఖిల్లా పార్కులో దాచిపెట్టి వాటిని తీసుకువెళ్లడానికి దేవరకొండకు వచ్చిన సందర్భంలో పోలీసులు అతడిని అనుమానించి పట్టుకొని అతని వద్దనున్న సుమారు రెండున్నర లక్షల డబ్బు ను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ కేసు విచారణలో భాగంగా ఏఎస్పి మౌనిక ఆధ్వర్యంలో సిఐ వెంకట్‌రెడ్డి, ఎస్ఐ నారాయణరెడ్డిలు తమ సిబ్బందితో టీంలుగా ఏర్పడి కేసును చేధించారు. కేసును చేధించిన సిఐ వెంకట్‌రెడ్డి, ఎస్ఐలు నారాయణరెడ్డి, మౌనిక, సిబ్బంది సతీష్, అంజయ్య, సింహాద్రి, చాంద్‌పాషాలను ఏఎస్పి అభినందించారు.

## సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తున్న బిజెపి

### సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు గోదా శ్రీరాములు

### తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలి



ప్రజాపక్షం/యాదగిరిగుట్ట : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలలో భాగంగా గురువారం యాదగిరిగుట్ట మండల కేంద్రంలో స్వతంత్ర సమరయోధులు భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులు అమరజీవి గోదా యాదగిరి స్తూపం వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించి ప్రారంభించారు. అదేవిధంగా సైదాపురం గ్రామంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు రాపోల్ కొండల్ రెడ్డి, క్యాసారం ముత్యం రెడ్డి, దుంబాల రాం రెడ్డి, నంద నరసయ్య గారల స్మారక చిహ్నం వద్ద మరియు ధర్మారెడ్డి గూడెం కాచారం చౌరస్తాలో ఉన్నటువంటి స్వాతంత్ర సమరయోధుల స్మారక చిహ్నాలు పరెడ్డి చెన్నారెడ్డి, కల్లూరు భద్రారెడ్డి, దుంపల మల్లారెడ్డి, జంగంపల్లి గ్రామంలో స్వాతంత్ర సమరయోధులు శివరాత్రి మల్లయ్యల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు మాట్లాడుతూ భూమి కోసం భుక్తి కోసం తెలంగాణ ప్రజల యొక్క విముక్తి కోసం జరిగినటువంటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను నేడు కేంద్రాన్ని పాలిస్తున్నటువంటి భారతీయ జనతా పార్టీ వక్రీకరిస్తూ హిందూ ముస్లింల మధ్య జరిగిన పోరాటంలా చిత్రీకరిస్తున్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను నేటి యువతకు తెలిసే విధంగా పాఠ్యాంశాలలో చేర్చాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడినటువంటి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా పాలనను ఎంత సమర్థవంతంగా నిర్వహిస్తాఉన్నదో అదేవిధంగా సెప్టెంబర్ 17 తెలంగాణ విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, పెరబోయిన మహేందర్ సిపిఐ మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, సిపిఐ పట్టణ కార్యదర్శి బబ్బూరి శ్రీధర్, మున్సిపల్ మాజీ కోఆప్షన్ సభ్యులు పేరబోయిన పెంటయ్య, సహాయ కార్యదర్శి పేరబోయిన బంగారి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గోరేటి రాములు, మహిళా సమాఖ్య మండల అధ్యక్ష కార్యదర్శులు ఆరె పుష్ప, నరసమ్మ, రవీందర్ పాల్గొన్నారు.

## వేగవంతంగా ఎత్తిపోతల పథకాల పనులు

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్ లాల్ పవార్



ప్రజాపక్షం/చింతలపాలెం: రాజీవ్ లిఫ్ట్ ఇరిగేషన్, వెల్లటూరు వద్ద ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ గురువారం పరిశీలించారు. గురువారం చింతలపాలెం మండల కేంద్రంలోని దొండపాడు గ్రామంలో నిర్మిస్తున్న రాజీవ్ లెఫ్ట్ ఇరిగేషన్ వెల్లటూరు వద్ద ముక్త్యా_ల బ్రాంచ్ కెనాల్ లిఫ్ట్‌ను ఇరిగేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మంగళవారం హైద్రాబాద్ వెళ్లటూర్ ముక్త్యా_ల బ్రాంచ్ కెనాల వద్ద విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లా సంబంధిచిన ఇరిగేషన్ ప్రాజెక్టులపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉ త్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని చూడాలని ఆకాంక్షించారు. వెల్లటూరు గ్రామంలో ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌కు సంబంధించిన అక్కడక్కడ భూసేకరణకు సంబంధించిన టైటిల్ సరిద్దులను, అటవి శాఖ వివాదాలు ఉన్నాయని వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగిందన్నారు. సమస్య ఉన్న రైతులతో విడివిడిగా మాట్లాడి ఆ భూములకి సంబంధించిన ఆధారాలు జతపర్చి ఆర్డీవోకి దరఖాస్తు సమర్పించాలని వాటిని 15 రోజులలో పరిశీలించి చట్టప్రకారం రైతులకు న్యాయం చేస్తామని అన్నారు. ఇప్పటికే ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌కు సంబంధించి భూ సేకరణ పూర్తయిందని గ్రామాల వారిగా అవార్డులు జారీ చేసి ఎలాంటి వివాదం లేని రైతులకు 30 కోట్ల రూపాయలు నష్టపరిహారం కింద రైతులకు చెల్లించడం జరిగిందన్నారు. వర్షాలు తగ్గినందున ఎక్కువ మిషనరిని ఏర్పాటు చేసుకుని కావాల్సిన్ని పైపులు సమకూర్చుకోవాలని, ఎక్కువ సిబ్బందిని నియమించి పైపులైన్లు త్వరగా వేయాలని అదే విధంగా పంప్‌హౌజ్ నిర్మాణ పనులు కూడా వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను అదేశించారు.

**జిల్లాలో యూరియా సరిపడా ఉంది: కలెక్టర్**

జిల్లాలో యూరియా సరిపోను ఉందని, రైతులకు ఎంత అవసరం ఉంటే అంతే తీసుకోవాలని ముందస్తుగా తీసుకుని నిల్వ చేసుకోవద్దని బుధవారం ఒక వ్యాగిన్ గురువారం ఒక వ్యాగిన్ యూరియా వచ్చిందని వాటిని వ్యవసాయ అధికారుల ద్వారా అన్ని పిఎసిఎస్‌ల, ఆగ్రో సెంటర్‌లకు సరఫరా చేసి రైతులకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## రోగులకు మెరుగైన సేవలు అందించాలి



### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు

ప్రజాపక్షం/బీబీనగర్ : వైద్యులు సిబ్బంది అందుబాటులో ఉండి పేషెంట్‌లకు మెరుగైన సేవలు అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. గురువారం బీబీనగర్ మండలం రాఘవాపూర్ గ్రామంలో పల్లె దవాఖానని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. పల్లె దవాఖానలో ఎంఎల్‌హెచ్‌పిలు, వైద్య సిబ్బంది రోజు వస్తున్నారా లేదా అని అటెండన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఎంఎల్‌హెచ్‌పి లేకపోవడంతో ఎక్కడికి వెళ్లారని ఆరా తీశారు. ఏంఎల్‌హెచ్‌పి అందుబాటులో లేకుండా బీబీనగర్‌కి పిఎచ్‌సికి వెళ్లారని సిబ్బంది తెలుపడంతో రోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు పల్లె దవాఖానాలో ప్రజలకి అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మీటింగ్స్ ఏమైనా ఉంటే సాయంత్రం 4 గంటల తరవాత పెట్టుకోవాలని చెప్పారు. మీ పరిధిలో రోజు వచ్చే ఓపీ రిజిస్టార్ సరిగా మెయింటైన చేయాలని అన్నారు. ఈ పల్లె దవాఖాన పరిధిలో ఎంత మంది గర్భిణిలు వచ్చారని పరిశీలించారు. రిజిస్టర్, ఈడిడిల రిజిస్టర్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. గర్భిణిలు ప్రతి నెల చెకప్‌కి వస్తున్నరా లేదా చూసుకోవాలి, డెలివరీల పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రభుత్వ ఆసుపత్రిలో నార్మల్ ప్రసావాలు అయ్యేలా చూడాలని అన్నారు. అనంతరం బీబీనగర్ మండలంలోని రాఘవాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. గ్రామంలో మొత్తం మంజూరు అయిన ఇండ్లు ఎన్ని , అవి అన్ని కూడా నిర్మాణంలో ఉన్నాయా లేక్ ఏమైనా మొదలు పెట్టనివి ఉన్నాయ అని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు అందరూ కూడా ఇండ్లు వేగంగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ఇసుక ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందని తెలిపారు. ఇటుక కూడా ఎక్కువ రేటు కొనుగోలు చేయకూడదు, మేస్త్రిలకు నిర్మాణానికి ఎక్కువ డబ్బులు ఇవ్వొద్దు అని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన రేటు ఇవ్వాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## రుద్రమ్మ చెరువును పర్యాటక ప్రదేశంగా మార్చేందుకు కృషి


### తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు

ప్రజాపక్షం/తుంగతుర్తి : మండల పరిధిలోని వెలుగుపల్లి రుద్రమ్మ చెరువును పర్యాటక ప్రదేశంగా మార్చేందుకు కృషి చేస్తానని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు అన్నారు. గురువారం వెలుగుపల్లి శివారులో గల రుద్రమ్మ చెరువును పర్యాటక అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 600 ఎకరాలకు పైగా విస్తీర్ణం కలిగిన కాకతీయుల కాలం నాటి చెరువుకు మధ్యలో పక్కన పెద్ద పెద్ద గుట్టలు ఆనుకొని ఉండడం ఎంతో ఆహ్లాదకరంగా ఉందన్నారు. జాతీయ రహదారికి పక్కనే ఉన్నందు వల్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి మరో లక్నవరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. చెరువులో బోటు, గుట్టల వద్ద స్టాల్స్‌తో అందంగా తీర్చిదిద్దితే బాగుంటుందని సంబంధిత ఈడి ఉపేందర్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ దయా నందం, డిసిసిబి డైరెక్టర్ గుడిపాటి సైదులు, మండల పార్టీ అధ్యక్షులు దొంగరి గోవర్ధన్, నరేష్, చింతకుంట్ల మల్లేష్, దాసరి శ్రీను, కొండ రాజు, మాచర్ల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## మొబైల్ కేంద్రంగా సైబర్ మోసాలు...

### ఫోన్ వినియోగించడంలో జాగ్రత్తలు పాటించాలి :ఎస్‌పి





ప్రజాపక్షం/సూర్యాపేట : మొబైల్ కేంద్రంగా సైబర్ మోసాలు జరుగుతున్నాయని, ఫోన్ వినియోగించడంలో జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఎస్‌పి కె నరసింహ అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో సెల్‌ఫోన్ రికవరీ మేళా ఏర్పాటు చేసి జిల్లాలో వివిధ రూపాల్లో పోగొట్టుకున్న సుమారు రూ.20లక్షల విలువ గల 100 ఫోన్లను గుర్తించి జిల్లా ఎస్‌పి చేతుల మీదుగా బాధితులకు ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో మొబైల్ ఫోన్ ప్రతి ఒక్కరికి నిత్యవసరమై దానిని కమ్యూనికేషన్ కోసం, ఆన్‌లైన్ విద్య కోసం వినియోగిస్తున్నాం, మన యొక్క విలువైన సమాచారంతోపాటు బ్యాంక్ అకౌంట్స్, పాస్‌వర్డ్స్, సోషల్ మీడియా అకౌంట్స్, వ్యక్తిగత ఫోటోలు మొదలైన వంటివి ఫోన్‌లో నిక్షిప్తం చేసుకుంటున్నామని వివరించారు. మొబైల్ చోరికి గురైనా, పోగొట్టుకున్నా అందులో ఉన్న సమాచారం నేరగాళ్ళు మొబైల్ దొంగిలించి, వీక్‌పాస్‌వర్డ్స్‌లను బ్రేక్ చేసి ఫోన్‌పే, గూగుల్‌పే తదితర మాధ్యమాల ద్వారా డబ్బులు కాజేస్తున్నారని హెచ్చరించారు. పోయిన మొబైల్ ఫోన్లు మళ్లీ దొరకదనుకున్న బాధితులు జిల్లా పోలీసులు టెక్నాలజీ ఉపయోగించి ఫోన్ రికవరీ చేసి అందించినందుకు సంబంధిత బాధితులు జిల్లా ఎస్‌పి, పోలీసు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ఎస్‌పి రికవరీ చేసిన ఐటి కోర్ సిబ్బంది, పోలీసు స్టేషన్ సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట సబ్‌డివిజనల్ డిఎస్‌పి ప్రసన్న కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, ఐటి కోర్ ఆర్ఎస్ఐ రాజశేఖర్, ఐటి కోర్ సిబ్బంది, మొబైల్ బాధితులు పాల్గొన్నారు.

## 12న రాయగిరిలో సురవరం సంతాప సభ



ప్రజాపక్షం/ఆలేరు : భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆలేరు మండల ముఖ్య నాయకుల సమావేశం సిపిఐ ఆలేరు మండల పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ మాట్లాడుతూ 12న రాయగిరిలో బసవలింగ ఫంక్షన్ హాల్‌లో సిపిఐ జాతీ య కార్యదర్శి నల్లగొండ మాజీ పార్లమెంటు సభ్యుడు సురవరం సుధాకర్ రెడ్డి సంతాప సభ యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరుగ నుందని కావున ఈ సంతాప సభకు ప్రజలు, కమ్యూనిస్టు సభ్యులు, కూలీలు, రైతులు, మేధా వులు, కార్మికులు, కర్షకులు అన్ని వర్గాల ప్రజలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ మండల కార్యదర్శి చౌడబోయిన కనకయ్య మాట్లాడుతూ రేపు జరగబోయే కార్యక్ర మానికి అందరూ పాల్గొనాలని కోరారు. బొడ్డు ఆంజనే యులు, రాజు పాల్గొన్నారు.

## అత్యాచార నిందితుడికి 21ఏళ్ల జైలు

### గత సంవత్సరం కాలం నుంచి 17 కేసులలో 18 మంది నిందితులకు జైలు శిక్ష: జిల్లా ఎస్‌పి శరత్‌చంద్ర

ప్రజాపక్షం/నల్లగొండ : మైనర్ బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి అత్యాచారం చేసిన నిందితునికి 21 ఏళ్ల జైలు శిక్షతోపాటు జరిమాన విధించడం జరిగిందని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం దుగినవెల్లి గ్రామానికి చెందిన జడిగిల హరీష్ ఒక మైనర్ బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా అనుభవించించి మోసం చేసిన ఘటనలో బాధితురాలు 2018 జూలై 23న ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడి పైన ఎస్‌సి పోక్సో నెంబర్ కట్టంగూర్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి విచారణ చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం కోర్టులో ఛార్జ్ సీట్ దాఖలు చేయగా గురువారం ఏడిజె II కమ్ ఎస్‌సి,ఎస్‌టి కోర్టు అత్యాచారం అండ్ ఫోక్సో కేసుల కోర్ట్ నిందితుని దోషిగా నిర్ధారించడం జరిగిందన్నారు. సెక్షన్ 376 ఐపీసీ, ఫోక్సో చట్టం సెక్షన్.5 (1) 6 పోక్సో యాక్ట్2012 ప్రకారం 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష తో పాటు రూ.25, వేల జరిమానా 420 ఐపీసీ ప్రకారం ఒక సంవత్సరం జైలు శిక్ష 5 వేల రూపాయల జరిమానా మొత్తం కలిపి 21 సంవత్సరాల జైలు 30 వేల రూపాయల జరిమాన విధించడం జరిగిందని తెలిపారు.అదే విధంగా బాధితురాలికి రూ.5 లక్షల పరిహారంగా జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా అందించాలని తీర్పు వెలువడించిందని తెలిపారు. గడిచిన సంవత్సర కాలంగా పోక్సో యాక్ట్ ప్రకారం 17 కేసులలో 18 మంది నిందితులకు గౌరవ న్యాయస్థానం జైలు శిక్ష జరిమాన విధించడం జరిగిందని ఎవరైనా మైనర్ బాలికలపై అత్యాచారాలకు పాల్పడితే ఎప్పటికైన శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఈ కేసులో సరి అయిన సాక్ష్యదారులు సేకరించి కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు సమర్పించి నిందితునికి శిక్ష పడే విధంగా చేసిన ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ సిఐలు క్యాస్ట్రో రెడ్డి,ఎస్ఐ రంజిత్ కుమార్ ప్రాసెక్యూషన్ కు సహకరించిన నల్లగొండ డిఎస్‌పి కె.శివరాం రెడ్డి,శాలిగౌరారం సిఐ కొండల్ రెడ్డి, కట్టంగూర్ ఎస్ఐ రవీందర్,పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ వేముల రంజిత్ కుమార్, సిడిఓ రువ్వా నాగరాజు, లైజన్ అధికారులు,లీగల్ ఆఫీసర్ భరోసా సెంటర్ కె.కల్పన,పి.నరేందర్, ఎన్.మల్లికార్జున్‌లను జిల్లా ఎస్‌పి అభినందించారు.

## భూదాన జయంతి వజ్రోత్సవాల వేడుకలకు ముఖ్యమంత్రి !

### పేదలకు భూదానం చేయాలన్న ఆలోచన రేకెత్తించింది వినోబాభావే

### ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం




ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : వచ్చే సంవత్సరం ఏప్రిల్ 18న యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 75 సంవత్సరాల భూదాన్ జయంతి వేడుకలలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొనేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిలు తెలిపారు. భూదాన ఉద్యమ పితామహుడు ఆచార్య వినోబాభావే 130వ జయంతి సందర్భంగా గురువారం పట్టణ కేంద్రంలోని టూరిజం పార్కులో ఏర్పాటు చేసిన సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ భూదానోద్యమ నేపథ్యాన్ని 100 ఎకరాలు భూమి దానం చేసిన భూదాత వెదిరే రామచంద్రారెడ్డి దానగుణాన్ని త్యాగాన్ని గుర్తుచేసుకొని వారి స్ఫూర్తితో ప్రజలకు చిత్తశుద్ధితో పనిచేయాలని ప్రజా ప్రతినిధులకు పిలుపునిస్తూ తనవంతుగా అదే చైతన్యంతో పని చేస్తానని అన్నారు. పేదలకు భూమి దానం చేయాలన్న ఆలోచన రేకెత్తించింది వినోబా భావే అని ఆయన ఆలోచనలకు అంకురార్పణ చేసిన ఘనత రామచంద్రారెడ్డిది అని కొనియాడారు. వినోబా భావే పాదయాత్రలో భాగంగా పోచంపల్లికి చేరుకున్న ఆయన ఆనాటి పేదలు బ్రతకడానికి భూములు కావాలని అడిగిన వెంటనే సంకల్పం పూని భూదాన్ ఉద్యమాన్ని పోచంపల్లి నుండి ప్రారంభించడం ఈ ప్రాంతం గొప్పతనం అని ఆ త్యాగదనులు ప్రపంచ చరిత్ర పుటల్లో నిలిచిపోయారని వారి ఆశయాలకు అనుగుణంగా పని చేయాలని పిలుపునిచ్చారు..

గాంధీజీ ప్రియ శిష్యుడు ఆచార్య వినోబాభావే తన భూదానోద్యమంతో ప్రపంచ చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉద్యమాన్ని చేపట్టి ప్రథమంగా 100 ఎకరాలు భూమి దానం చేసిన ప్రథమ భూదాతగా రామచంద్రారెడ్డి చిరస్మరణీయులుగా నిలిచారని భూదాన్ పోచంపల్లిగా ప్రపంచ దేశాల వేదికలపై చేనేత పట్టుచీరలతో సిల్క్ సిటీగా ప్రత్యేక గుర్తింపు సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి వైస్ ప్రెసిడెంట్ కళ్లెం రాఘవరెడ్డి, మండల అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్, జిల్లా సీనియర్ నాయకులు సామ మధుసూదన్ రెడ్డి, అంబరీష్ రెడ్డి, టై అండ్ డై పట్టణ అధ్యక్షులు భారత లవకుమార్ పోచంపల్లి అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్, పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షులు సీత శ్రీరాములు పాల్గొన్నారు.

## ప్రపంచ నైపుణ్యపోటీలకు 30లోపు రిజిస్ట్రేషన్

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : యువత వరల్డ్ స్కిల్ కాంపిటీషన్ లో పాల్గొనుటకు సెప్టెంబర్ 30 లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి నంద పద్మ తెలిపారు. వరల్డ్ స్కిల్ కాంపిటీషన్ 2025 నిర్వహించుటకు షెడ్యూల్ విడుదల చేయడం జరిగిందని. ఈ పోటీలు జిల్లా, రాష్ట్ర, నేషనల్, ఇంటర్ నేషనల్ స్థాయిలో నిర్వహించబడుతాయని, అర్హత కలిగిన అభ్యర్థులు దాదాపు 50 కి పైగా నైపుణ్యాలలో పోటీ పడొచ్చని,ఆటో బాడీ రిపేర్, ఆటో మొబైల్ టెక్నాలజీ, బేకరీ, బ్యూటీ థెరపీ, సిఎన్‌సి మిల్లింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, గ్రాఫిక్స్ డిజైన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, ఐటి సాఫ్ట్ వేర్ సొల్యూషన్ ఫర్ బిజినెస్ మొదలైన నైపుణ్యాలలో పోటీ నిర్వహించడం జరుగుతుందని. ఆసక్తి గల అభ్యర్థులు స్కిల్ ఇండియా డిజిటల్ హబ్ వెబ్ సైటు లో సెప్టెంబర్ 30 లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఓటర్ ఐడి వివాదంలో సోనియాకు ఊరట

న్యూఢిల్లీ:కాంగ్రెస్‌అగ్రనాయకురాలుసోనియాగాంధీకి ఢిల్లీ కోర్టులో ఊరట లభించింది. ఆమెపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలంటూ దాఖలైన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది.కాంగ్రెస్‌మాజీఅధ్యక్షురాలు సోనియా గాంధీ భారత పౌరసత్వం పొందడానికి మూడేళ్ల ముందే 1980లో ఓటర్‌గా రిజిస్టర్ చేసుకున్నారని ఆరోపిస్తూ ఢిల్లీ కోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆమె ఎన్నికల చట్టాన్ని ఉల్లంఘించారని, ఆ వ్యవహారంలో ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదు చేసేలాఆదేశాలు ఇవ్వాలని కోరారు. 1983లో సోనియాకు భారత పౌరసత్వం వచ్చింది. 1980 నాటి ఓటర్ జాబితా అంటూ గత నెల భాజపా నేత అమిత్‌మాలవీయ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. గాంధీ కుటుంబ సభ్యులైన ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, సంజయ్ గాంధీ, మేనకా గాంధీతో పాటు సోనియాపేరును చేర్చారని పేర్కొన్నారు. అప్పటికీ ఆమె ఇంకా ఇటలీ పౌరసత్వం కలిగి ఉన్నారని రాసుకొచ్చారు. అయితే దానిపై విమర్శలు రావడంతో 1982లో ఓటర్ జాబితా నుంచి ఆమె పేరు తొలగించారని, 1983లో మళ్లీ కనిపించిందని వెల్లడించారు. అప్పుడు కూడా పౌరసత్వం రావడానికన్నా ముందే మళ్లీ జాబితాలోకి పేరు వచ్చి చేరిందని విమర్శించారు.



### అసెంబ్లీలు ఆమోదించిన బిల్లుల గడువు విషయంలో రాష్ట్రపతి సూచనపై...

# 'సుప్రీంకోర్టు తీర్పు' రిజర్వ్

### 10రోజుల పాటు వాదనలు విన్న సిజెఐ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం

న్యూఢిల్లీ : రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులకు గవర్నర్లు, రాష్ట్రపతి ఆమోదం తెలిపేందుకు రాజ్యాంగ న్యాయస్థానం గడువులు విధించవచ్చా అని అడిగిన రాష్ట్రపతి సూచనపై 10రోజులపాటు వాదనలు విన్న సుప్రీంకోర్టు గురువారం తన తీర్పును రిజర్వ్ చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) బిఆర్.గవాయ్ నేతృత్వంలోని న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, విక్రమ్ నాథ్, పిఎస్.నర్సింహా, ఎఎస్.చందుర్కర్‌లతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఈ తీర్పును రిజర్వ్ చేసింది. అత్యున్నత న్యాయస్థానం రాష్ట్రపతి సూచనపై ఆగస్టు 19న విచారణ ప్రారంభించింది. దేశంలోని అత్యున్నత న్యాయ అధికారి, అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి వాదనలు ముగిసిన నేపథ్యంలో రాజ్యాంగ ధర్మాసనం ఈ అంశంపై తీర్పును రిజర్వ్ చేసింది. కేంద్రం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహ‌తా తన వాదనలను ముగించారు. ప్రతిపక్ష పాలిత తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ, కర్ణాటక, తెలంగాణ, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్‌ల సమర్పణలను సవాల్ చేస్తూ తన వాదనలను ముగించారు. సీనియర్ న్యాయవాదులు కె.కె.వేణుగోపాల్, కపిల్ సిబల్ కేరళ, తమిళనాడు ప్రభుత్వాల తరపున హాజరై ధర్మాసనం ముందు తమ వాదనలు వినిపిస్తూ రాష్ట్రపతి సూచనను వ్యతిరేకించారు. ఏప్రిల్ 8 తీర్పుతో సహా రాష్ట్రపతి లేవనెత్తిన అంశాలు సుప్రీంకోర్టు తీర్పుల శ్రేణిలో ఉన్నాయని సీనియర్ న్యాయవాదులు కె.కె.వేణుగోపాల్, కపిల్ సిబల్ రాజ్యాంగ ధర్మాసనం ముందు తమ వాదనలు వినిపించారు. రాష్ట్రపతి ఆమోదించిన బిల్లులకు గవర్నర్లు ఆమోదం తెలిపే గడువులను నిర్ణయించిన సుప్రీంకోర్టు ఏప్రిల్ 8న ఇచ్చిన తీర్పు తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లులకు అనుమతి ఇవ్వకుండా ఉండటంపై తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి మరియు ప్రభుత్వం మధ్య జరిగిన సుదీర్ఘ పోరాటంలో ఈ తీర్పు వెలువడింది.రాష్ట్రఅసెంబ్లీలు ఆమోదించిన బిల్లులపై చర్య తీసుకోవడానికి గవర్నర్లు, ఆమెపై నిర్ణీత కాలపరిమిధి విధించవచ్చా అనే దానిపై రాష్ట్రపతి స్వయంగా సూచనల ద్వారా అభిప్రాయం కోరితే తప్పేమిటని అత్యున్నత న్యాయస్థానంప్రశ్నించింది.రాష్ట్రపతి ఆమె స్వయంగా సూచన కోరితే సమస్య ఏమిటి ?. మీరు దీనిపై పోటీ చేయడం గురించి నిజంగా సీరియస్‌గా ఉన్నారా?' అని ఈ సూచనపై కీలకమైన విచారణను ప్రారంభిస్తూ ధర్మాసనం అడిగింది. మన ం సలహా న్యాయవ్యవస్థ పరిధిలో ఉన్నామని చాలా స్పష్టం గా ఉంది' అని ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ అన్నారు.సుప్రీంకోర్టు అటార్నీ జనరల్, సొలిసిటర్ జనరల్, సీనియర్ న్యాయవాదులు కె.కె.వేణుగోపాల్, కపిల్ సిబల్, అభిషేక్ సింఘ్వీ, అర్వింద్ దాతర్, గోపాల్ సుబ్రమణియన్. మనీందర్ సింగ్, ఎ.కె.కౌల్, ఆనంద్‌శర్మ, పి.విల్సన్, గోపాల్ శంకర్ నారాయణన్‌లను రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 కింద సంక్రమించిన గవర్నర్ల అధికారాలపై 10రోజులపాటు అత్యున్నత న్యాయస్థానం విచారణ జరిపింది. బిజెపి పాలిత రాష్ట్రాలైన మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, ఒడిషా, గోఓవా, ఛత్తీస్‌గఢ్‌లు గవర్నర్ల క్రియాత్మక స్వయం ప్రతిపత్తిని, రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం తెలపడాన్ని సమర్థించాయి. ఆర్టికల్ 200 రాష్ట్ర శాసనసభ ద్వారా బిల్లు ఆమోదానికి సంబంధించి గర్నర్ అధికారాలను నియంత్రిస్తుంది, బిల్లు ఆమోదానికి వారు అంగీకరించడానికి పున: పరిశీలన కోసం తిరిగి ఇవ్వడానికి లేదా బిల్లును రాష్ట్రపతి పరిశీలనకు రిజర్వ్ చేయడానికి వీలు కల్పిస్తుంది.

### రాష్ట్రపతి14 ప్రశ్నలపై లోతైన విచారణ తదుపరి 'తీర్పు రిజర్వ్'

గవర్నర్లకు కాలపరిమితిని విధించడం, రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లులపై కోర్టులు చర్యలు తీసుకోవచ్చా అనే దానిపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంధించిన 14 ప్రశ్నలపై సుప్రీంకోర్టు విచారణ ఇప్పటి వరకూ కొనసాగింది. కాగాఈ పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం విచారణకు స్వీకరించి 10 రోజుల పాటు వాదనలు పూర్తిగా విన్న అనంతరం గురువారం తన తీర్పును రిజర్వ్ చేసింది.గవర్నర్ల అధికారాలు, విధులు, నిర్ణయాధికారాలపై కేంద్రం మరియు వివిధ రాష్ట్రాల వాదనలను ధర్మాసనం పరిగణనలోనికి తీసుకుంది. రాష్ట్రపతి సూచనపై అటార్నీ జనరల్ వ్యక్తిగత సామర్థ్యంపై వాదనలు విన్న ధర్మాసనం, వ్యక్తిగత కేసులను పరిశీలించడానికి ఇష్టపడటంలేదని, రాజ్యాంగాన్ని అర్థం చేసుకోవడానికి ఇష్టపడుతున్నామని ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ఏప్రిల్ 8న ఇచ్చిన తీర్పు రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లులపై చర్య తీసుకోవడానికి ఒక కాలపరిమితిని నిర్దేశించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 కింద సమర్పించబడిన ఏదైనాబిల్లుకు సంబంధించి విధులను నిర్వర్తించడంలో పాలక గవర్నర్లకు ఎటువంటి ఆటంకాలు ఉండవు. అయితే మంత్రి మండలి ఇచ్చే సలహాను తప్పనిసరిగా పాటించాలి.

# మోహన్ భాగవత్‌కు మోదీ 'అతినివాళి'

### ఆర్ఎస్ఎస్ చీఫ్‌పై వ్యాసం రాయడంపై కాంగ్రెస్ మండిపాటు



న్యూఢిల్లీ :ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్‌పై ప్రధాని నరేంద్రమోదీ వ్యాసం రాయడంపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా విమర్శించింది. మోహన్ భగవత్ 75వ పుట్టినరోజున ఆయనకు ఇచ్చిన 'అతి నివాళి' అని అభివర్ణించింది. సంఘ్ నాయకత్వంతో అనుకూలంగా ఉండటానికి తీవ్ర ప్రయత్నమేనని పేర్కొంది. భాగవత్ మేధోపరమైన సుదీర్ఘ, సానుభూతిగల నాయకత్వాన్ని ప్రశంసిస్తూ, 2009 నుండి ఆర్ఎస్ఎస్ అధిపతిగా ఆయన పదవీకాలం ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరాల ప్రయాణంలో అత్యంత పరివర్తన కాలంగా పరిగణించబడుతుందని ప్రధాని మోదీ అన్నారు. భాగవత్ 75వ పుట్టినరోజు సందర్భంగా గురువారం అనేక వార్తాపత్రికలలో ప్రచురితమైన వ్యాసంలో భాగవత్ 'వసుధైవ కుటుంబకం' సజీవ ఉదాహరణ అని, సామాజిక పరివర్తన, సామరస్యం, సోదరభావం స్ఫూర్తిని బలోపేతం చేయడానికి తన మొత్తం జీవితాన్ని అంకితం చేశారని మోదీ అన్నారు. మోదీ వ్యాసంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ స్పందించారు. ఆర్ఎస్ఎస్ నాయకత్వంతో అనుకూలంగా ఉండటానికి ప్రధానమంత్రి తీవ్రంగా కృషి చేస్తూ, మోహన్ భాగవత్ 75వ పుట్టినరోజున ఆయనకు అతి నివాళి అర్పించారని ఎద్దేవా చేశారు. 'సెప్టెంబర్ 11, 1893న స్వామి వివేకానంద చికాగోలో తన అమర ప్రసంగం చేశారని ప్రధానమంత్రి గుర్తు చేసుకున్నారు. అమెరికాలో అల్ ఖైదా ఉగ్రవాద దాడులు సెప్టెంబర్ 11, 2001న జరిగాయని కూడా ప్రధానమంత్రి గుర్తు చేసుకున్నారు' అని రమేష్ అన్నారు. ఆశ్చర్యమేమిటంటే మహాత్మా గాంధీ మొదట సెప్టెంబర్ 11, 1906న జోహన్నెస్‌బర్గ్‌లో సత్యాగ్రహానికి పిలుపునివ్వడాన్ని ప్రధాని ప్రస్తావించలేదన్నారు. అప్పుడే ప్రపంచం ఈ విప్లవాత్మక ఆలోచన గురించి మొదటిసారి విన్నదని కాంగ్రెస్ నాయకుడు ఎక్స్‌లో పేర్కొన్నారు. సత్య అనే పదం ఆయనకు పరాయిది కాబట్టి సత్యాగ్రహం మూలాన్ని ప్రధాని గుర్తుంచుకుంటారని ఆశించడం చాలా ఎక్కువ అని రమేష్ అన్నారు. భాగవత్ 75వ పుట్టినరోజు సందర్భంగా ప్రధానిపై ప్రతిపక్ష పార్టీ విమర్శనాత్మక వ్యాఖ్యలు చేసింది. లోక్‌సభలో కాంగ్రెస్ విప్ మాణికం ఠాగూర్ కూడా ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు.



# మణిపూర్‌కు మోదీ... కట్టుదిట్టమైన ఏర్పాట్లు

ఇంఫాల్ : ప్రధాని నరేంద్ర మోదీ శనివారం కల్లోలిత మణిపూర్‌లో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో ఇంఫాల్, చురచందాపూర్ జిల్లా హెడ్‌క్వార్టర్స్ పట్టణంలో భద్రతను కట్టుదిట్టం చేసినట్లు అధికారులు తెలిపారు. ఇంఫాల్‌లోని దాదాపు 237 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కాంగ్లా కోట, చురచంద్‌పూర్‌లోని పీస్ గ్రౌండ్‌లో, చుట్టు పక్కల రాష్ట్ర, కేంద్ర దళాల సిబ్బందిని పెద్ద సంఖ్యలో మోహరించారు. ప్రధాని కార్యక్రమం కోసం భారీ వేదికను నిర్మిస్తున్నారు. మోదీ మిజోరం నుండి మణిపూర్‌కు వచ్చే అవకాశం ఉంది. కానీ న్యూఢిల్లీ లేదా ఇంఫాల్ నుండి దీనికి సంబంధించి అధికారిక ప్రకటన వెలవడలేదు. ఈ పర్యటన దృష్ట్యా రాష్ట్రంలో అనేక సన్నాహక సమావేశాలు జరిగాయి. మే 2023లో కుకిస్, మెయితీల మధ్య జాతి హింస చెలరేగిన తర్వాత మోదీ మణిపూర్ పర్యటించనుండడం ఇదే తొలిసారి. హింస ఫలితంగా 250 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, వేలాది మంది నిరాశ్రయులయ్యారు. మోదీ రాక నేపథ్యంలో కాంగ్లా కోటకు దారితీసే సంజెంతోంగ్, మినుతోంగ్, మోయిరాంగ్‌ఖోమ్ ప్రాంతాలలో గాలింపు, తనిఖీలను ముమ్మరం చేశారు. రాష్ట్ర సిబ్బందితో కలిసి కేంద్ర భద్రతా బృందాలు కాంగ్లా కోటను 24 గంటలూ తనిఖీ చేస్తున్నాయి. కోట చుట్టూ ఉన్న కందకాలలో గస్తీ కోసం రాష్ట్ర విపత్తు నిర్వహణ దళం పడవలను నియమించారు. 1891లో రాచరిక రాజ్యం విలీనం కావడానికి ముందు కాంగ్లా కోట అప్పటిమణిపురిపాలకులకుపురాతన అధికార కేంద్రంగా పనిచేసింది. మూడు వైపులా కందకాలు, తూర్పు వైపున ఇంఫాల్ నదితో చుట్టుముట్టబడిన ఈ కోట, ఒక పెద్ద పోలో మైదానం,ఒక చిన్నఅడవి, దేవాలయాల శిథిలాలు, రాష్ట్ర పురావస్తు కార్యాలయాలను కలిగి ఉంది. ఏవైనా అవాంఛిత వస్తువులను గుర్తించడానికి స్నిఫర్ డాగ్‌లు, అధునాతన సాధనాలను ఉపయోగిస్తున్నారు. ఏవైనా అవాంఛిత సంకేతాల కోసం స్కాన్ చేయడానికి భద్రతా సిబ్బంది కోట అంచు, ప్రాంగణంలో కాలినడకన గస్తీ తిరుగుతున్నారు. కోటలోకి ప్రవేశించే వారందరినీ నమోదు చేసి తనిఖీ చేస్తున్నారు. కోటలోకి పర్యాటకుల ప్రవేశాన్ని పరిమితం చేశారు. భారీ హెచ్చరికలు జారీ చేశామని, ఉన్నత స్థాయి అధికారుల పర్యవేక్షణలో కసరత్తు జరుగుతున్నట్లు మరొక అధికారి తెలిపారు. పరిస్థితిని పర్యవేక్షించడానికి భద్రతా అధికారుల రోజువారీ సమావేశాలు కూడా జరుగుతున్నాయని అధికారి తెలిపారు. కాగా, కేంద్రభద్రతా అధికారుల ముందస్తు బృందం కూడా చురాచంద్‌పూర్‌లో దిగింది. ప్రధాని బహిరంగ సభలో ప్రసంగించనున్న పీస్ గ్రౌండ్‌కు వెళ్లే మార్గంలో పోలీసులు, పారామిలిటరీదళాలను మోహరించారు. వెదురు బారికేడ్లు నిర్మించారు. రాష్ట్రంలోని ఇత ర చోట్ల, భద్రతా దళాలుశోధనకార్యకలాపాలను,ప్రాంతఆధిపత్యాన్ని కూడాముమ్మరంచేశాయి.రాష్ట్రదళాలు,సిఆర్‌పిఎఫ్ కొండలు, లోయ జిల్లాల్లో సామాజిక వ్యతిరేక శక్తుల కదలికలను తనిఖీ చేయడానికి తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేశాయి.

## ఆ మూడు రోజులు గార్డుల మార్పు రద్దు

న్యూఢిల్లీ : రాష్ట్రపతి భవన్ ముందు ప్రాంగణంలో ఈనెల 13, 20, 27 తేదీల్లో గార్డుల మార్పు కార్యక్రమం ఉండదని రాష్ట్రపతి కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్రపతి బాడీగార్డుల కొత్త బృందం బాధ్యతలు స్వీకరించడానికి వీలుగా ప్రతి వారం సైనిక సంప్రదాయంగా గార్డుల మార్పు కార్యక్రమం నిర్వహిస్తారు. 1773లో స్థాపించిన ప్రెసిడెంట్స్ బాడీ గార్డ్ (పిబిజి) భారత సైన్యంలో అత్యంత సీనియర్ రెజిమెంట్. ఇది భారత రాష్ట్రపతికి ఉత్సవ విధులను నిర్వర్తించే రెజిమెంట్. పిబిజి సిబ్బందిలో అద్భుతమైన గుర్రపు సైనికులు, సమర్థవంతమైన ట్యాంక్ మెన్, పారాట్రూపర్లు ఉన్నారు. అయితే సెరిమోనియల్ బెటాలియన్ వజ్రోత్సవ సిల్వర్ ట్రంపెట్, ట్రంపెట్ బ్యానర్‌ను రాష్ట్రపతి బాడీగార్డుకు అందించడానికి రిహార్సల్స్‌లో నిమగ్నమై ఉంటున్నందున రాష్ట్రపతి భవన్ ముందు ప్రాంగణంలో ఈనెల 13, 20, 27 తేదీల్లో గార్డుల మార్పు కార్యక్రమం నిర్వహించబడదని రాష్ట్రపతి కార్యాలయం ప్రకటనలో తెలిపింది. 'ప్రెసిడెంట్స్ సిల్వర్ ట్రంపెట్ అండ్ ట్రంపెట్ బ్యానర్'ను మోసుకెళ్లే ఏకైక రెజిమెంట్‌గా ప్రెసిడెంట్స్ బాడీ గార్డ్ ప్రత్యేకతను కలిగి ఉంది. ప్రెసిడెంట్స్ సిల్వర్ ట్రంపెట్ అండ్ ట్రంపెట్ బ్యానర్‌ను మొదటిసారిగా 1953లో భారతదేశ మొదటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ 'బాడీగార్డ్స్'కు ప్రదానం చేశారు.

## బిహార్‌లో ఆర్‌జెడి నేత దారుణహత్య

పాట్నా : బిహార్‌లో ఓ రాజకీయ నేత దారుణ హత్యకు గురయ్యాడు. ఆర్‌జెడికి చెందిన రాజ్‌కుమార్ రాయ్ అలియాస్ అల్లా రాయ్‌ని గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి చంపారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ ఈ హత్య రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ఎస్‌పి పరిచయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చిత్రగుప్త నగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని మున్నా చక్ ప్రాంతంలో ఈ హత్య జరిగింది. బుధవారం రాత్రి బైక్‌పై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు రాయ్‌పై కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ దాడిలో రాయ్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. రాయ్‌ని ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధరించారు. హత్య జరిగిన ప్రదేశంలో ఆరు బుల్లెట్ షెల్స్ లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.భూ వివాదమే హత్యకు కారణమని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది.త్వరలోజరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పాట్నాలోని రాఘోపూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు రాజ్‌కుమార్ రాయ్ సిద్ధమయ్యారు.

## మరింత పారదర్శకంగా, సరళంగా 'ఎస్ఐఆర్'

### ఆర్‌జెడి ప్రతినిధులతో భేటీలో ఇసి

న్యూఢిల్లీ: రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్‌జేడీ) నాయకుల బృందం గురువారం కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) ఫుల్ బెంచ్‌తో భేటీ అయింది. బీహార్‌లో చేపట్టిన ఎస్ఐఆర్‌పై చర్చించింది. అనంతరం ఆర్‌జేడీ ఎంపీ మనోజ్ ఝా విలేకరులతో మాట్లాడుతూ 'ఎస్ఐఆర్‌పై సమగ్రంగా చర్చించాం. ఈ ప్రక్రియను సరళీకరిస్తామని, మరింత పారదర్శకంగా నిర్వహిస్తామని ఎన్నికల సంఘం హామీనిచ్చింది. ఎస్ఐఆర్‌కు సంబంధించిన అన్ని అంశాలు, ఓటర్ల పేర్లు తొలగించడం, అభ్యంతరాలు, పోస్టల్ బ్యాలెట్ తదితరాలపై రెండు గంటలకుపైగా చర్చ జరిగింది. అన్ని అంశాల్లోనూ ఎన్నికల సంఘం సానుకూలంగా ముందుకు వెళుతుందని నమ్ముతున్నాం' అని అన్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్, ఈసీలు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషితో జరిగిన చర్చల్లో ఆర్‌జేడీ నాయకులు సుధాకర్ సింగ్, చితరంజన్ గగన్ పాల్గొన్నారు. ఈ సమావేశం తర్వాత ఎన్నికల సంఘం ఒక ప్రకటన చేసింది. వివిధ జాతీయ, ప్రాంతీయ పార్టీలతో నిర్వహిస్తున్న సంప్రదింపుల్లో భాగంగానే తాజా భేటీ జరిగిందని తెలిపింది. గత ఆరు నెలల్లో 4,719 అఖిలపక్ష సమావేశాలు నిర్వహించినట్లు వెల్లడించింది. అందులో 40 సీఈఓలతో సమావేశాలు కాగా 800 డీఈఓలతో, 3,879 ఈఆర్ఓలతో భేటీలని పేర్కొంది. ఇప్పటివరకు 28వేల మందికిపైగా నాయకులతో సంప్రదింపులు జరిపినట్లు ఈసీ తెలిపింది.

### సానుకూల వాతావరణంలో

# పురోగమిస్తున్న భారత్—అమెరికా వాణిజ్య చర్చలు



### కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ప్రకటన

పాట్నా: భారత్—అమెరికా మధ్య ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంపై సంప్రదింపులు సానుకూల వాతావరణం మధ్య పురోగతి సాధిస్తున్నాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాకామంత్రి పీయూష్ గోయల్ గురువారం పాట్నాలో పాత్రికేయులకు చెప్పారు. రెండు దేశాల మధ్యా ఈ ఏడాది మార్చినెలలో చర్చలు ప్రారంభమయ్యాయి. రెండు దేశాలూ ఈ ప్రతిపాదిత ఒప్పందంపై జరుగుతున్న సంప్రదింపుల పురోగతిపట్ల సంతృప్తి వ్యక్తం చేశాయని చెప్పారు. ఈ ఏడాది నవంబరు ముగిసేనాటికి ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై మొదటిదశ చర్చలు ముగించాలని గడచిన ఫిబ్రవరినెలలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌వారి వారి వాణిజ్యశాఖామంత్రులకు ఆదేశించిన విషయాన్ని గోయల్ గుర్తుచేశారు. ఈ ఆదేశాల ప్రకారం గత మార్చినెల నుండీ చర్చలు సానుకూలమార్గంలో పురోగమిస్తున్నాయని చెప్పారు. రెండు దేశాల మధ్యా చర్చలు క్రియాశీలంగా కొనసాగుతున్నాయని గడచిన బుధవారం కూడా గోయల్ చెప్పారు. భారత్—అమెరికా దేశాలమధ్య వాణిజ్య సంప్రదింపుల్లో సమస్యలను, ఆటంకాలను తొలగించుకోవడం పెద్ద కష్టమైన పనేమీ కాదని ట్రంప్ బుధవారంనాడు తన సోషల్ మీడియా వేదికగా ప్రకటించిన తర్వాత ఈ సమస్య ఒక కొలిక్కి వచ్చినట్లయింది. రెండు దేశాలు చాలా విజయవంతంగా ఈ చర్చలను ముగించగలవని ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేయడంతో మోదీ కూడా ఎక్స్ వేదికగా స్పందిస్తూ, రెండు దేశాలు ఒప్పందాన్ని వీలైనంత త్వరగా పూర్తిచేసేంకు కలిసి కృషి చేస్తున్నాయన్నారు. ట్రంప్ తన సోషల్ మీడియా ద్వారా స్పందిస్తూ, మోదీని ''ప్రియమైన నేస్తం''గా అభివర్ణించారు. రాబోయేవారాల్లో భారత ప్రధానమంత్రిని కలుసుకుని మాట్లాడేందుకు తానెంతో ఆత్రంగా ఎదురుచూస్తున్నానని కూడా ట్రంప్ తన పోస్టింగ్‌లో రాశారు. ''భారత్—అమెరికా రెండు దేశాలు వాణిజ్య సంప్రతింపులను కొనసాగిస్తున్నాయని ప్రకటించడానికి నేనెంతో సంతోషిస్తున్నాను'' అని ట్రూత్ సోషల్ ద్వారా ట్రంప్ తెలియజేయడంతో కొంతమేరకు సానుకూల వాతావరణం నెలకున్నట్లయింది. రెండు దేశాల ప్రభుత్వాలూ మార్చి నెల నుండి ఇప్పటివరకూ ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై ఐదు విడతల సంప్రదింపులు పూర్తిచేశాయి. ఆరో విడత చర్చలు జరిపేందుకు గతనెలలో భారత్‌కు వచ్చిన అమెరికా వాణిజ్యమంత్రిత్వశాఖ ప్రతినిధుల బృందం తన పర్యటనను వాయిదా వేసుకుంది. రష్యా నుండి భారతదేశం ముడి చమురు కొనుగోలు చేస్తూ ఉక్రేన్‌లో యుద్ధం కొనసాగించడానికి పరోక్షంగా ఆజ్యం పోస్తోందని ట్రంప్ ఆరోపించారు. రష్యాతో వాణిజ్యం ఆపకుండా కొనసాగిస్తున్నందుకుగాను భారత్‌పై 25 శాతం పెనాల్టీ సుంకాలు విధించారు. దీంతో అమెరికా ప్రతినిధులబృందం పర్యటన వాయిదా పడింది. భారత్—అమెరికా మధ్య ప్రస్తుతం ఉన్న 500 బిలియన్ డాలర్ల వాణిజ్యాన్ని రెట్టింపు చేసి 2030 నాటికి 191 బిలియన్ డాలర్లకు తీసుకువెళ్ళాలన్న బృహత్ సంకల్పంతో ప్రతిపాదిత ఒప్పందంపై చర్చలు జరుగుతున్నాయి. కానీ భారత్‌పై అతిభారీగా 50 శాతం మేరకు సుంకాలు ట్రంప్ విధించడంతో రెండు దేశాలమధ్యా వాణిజ్య సంబంధాలు ఇటీవల తీవ్ర ఒత్తిళ్ళకు గురయ్యాయి. ఇక ఆరో దశ ద్వైపాక్షిక వాణిజ్య చర్చలు కొనసాగించడానికి మరో కొత్త తేదీని నిర్ణయించాల్సి ఉంది.

# హరితవిప్లవ పితామహుడు నార్మన్ బోర్లాగ్

### నేడు నార్మన్ బోర్లాగ్ వర్ధంతి



ప్రపంచ వ్యాప్తంగా వందలాది కోట్ల మందిని ఆకలి బాధలనుండి, పస్తుల నుండి రక్షించిన గొప్ప శాస్త్రవేత్త, హరిత విప్లవ పితామహుడు, నోబెల్ బహుమతి గ్రహీత నార్మన్ ఎర్నెస్ట్ బోర్లాగ్. బోర్లాగ్ 1914, మార్చి 25న అమెరికాలోనిఅయోవాలోఒక వ్యవసాయ కుటుంబములో జన్మించాడు. బోర్లాగ్ నార్వే దేశము నుండి 1854 లో అమెరికాకు వలస వెళ్ళిన కుటుంబములో మూడవ తరము వాడు.తండ్రి హెన్రీ ఆలివర్ బోర్లాగ్. తల్లి క్లారా.106 ఎకరముల పొలముపై ఏడేళ్ళ నుంచి పందొమ్మిదేళ్ళ వయసు వరకూ పొలం పని, చేపలు పట్టడం, వేటాడ్డం,కోళ్ళు,పశువులతో కాలక్షేపం,ఆటపాటలతో గడిపాడు.తాత ప్రోత్సాహము వల్ల మిన్నిసోటా విశ్వవిద్యాలయంలో చేరి అటవీశాస్త్రంలో పట్టాపొంది ఉద్యోగంలో చేరినాడు. తిరిగి అదే విశ్వవిద్యాలయం నుంచి ప్లాంట్ పాథాలజీ, జన్యు శాస్త్రంలో పీహెచ్‌డీ చేశాడు.పరిశోధనల్లో ఆయన దృష్టి గోధుమ పంట మీద పడడం ప్రపంచానికి గొప్ప మేలు చేసింది. చీడపీడలను తట్టుకుంటూ అధిక దిగుబడినిచ్చే పొట్టిరకం గోధుమ వంగడాలను కనిపెట్టడం ద్వారా సంచలనం సృష్టించాడు.1960 ప్రాంతంలో కరువుకాటకాలతో అల్లాడుతున్న ఇండియా, పాకిస్థాన్ దేశాల్లో ఆ వంగడాలను పరిచయం చేశాడు. 1963లో ఆయన ఇండియా కూడా సందర్శించాడు.20వశతాబ్ది ద్వితీయార్థంలో ప్రపంచాన్ని తీవ్ర కరవునుంచి బయటపడేసి వంద కోట్ల మంది ప్రాణాలను కాపాడేందుకు ఆయన ఆవిష్కరణలు తోడ్పడ్డాయి. ఆయన ఆవిష్కరణల వల్ల 1960, 1990మధ్య కాలంలో వ్యవసాయ దిగుబడులురెండింతలకు మిం చి జరిగాయి. అది హరిత విప్లవంగా మారింది. ఆసియా, ఆఫ్రికా ప్రాంతాల్లో సైతం కోట్లాదిమంది రైతులు లబ్ధి పొందారు. ప్రస్తుతం ప్రపంచం మొత్తం మీద 18.7 కోట్ల ఎకరాల్లో బోర్లాగ్ కనిపెట్టిన గోధుమ వంగడాలను వాడుతున్నారు. బోర్లాగ్‌పై 2006లో 'ది మ్యాన్ హూ ఫెడ్ ద వరల్డ్ అనే పుస్తకం వచ్చింది.డాక్టర్ బోర్లాగ్ ఎల్లప్పుడూ తనను తాను ఒక ఉపాధ్యాయుడిగానే కాకుండా శాస్త్రవేత్తగా కూడా భావించుకునేవాడు. నేడు 50 కి పైగా దేశాల నుండి అనేక వేల మంది పురుష మరియుమహిళావ్యవసాయ శాస్త్రవేత్తలు తాము నార్మన్‌బోర్లాగ్ 'విద్యార్థులు'అని గర్వంగా చెప్పుకుంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా చిన్నకారు వ్యవసాయ అభివృద్ధిని ప్రోత్సహించడానికి బోర్లాగ్ తన కీర్తి, ప్రభావాన్ని ఉపయోగించాడు. 63 సంవత్సరాల కెరీర్‌లో, అతను 100 కి పైగా దేశాలకుఅవిశ్రాంతంగా ప్రయాణించాడు, రైతులను మరియు వ్యవసాయ శాస్త్రవేత్తలను వారి రంగాలలో సందర్శించాడు. తన జీవితకాలంలో అతను ఎందరో విద్యార్థులు మరియు సాధారణ పౌరులతో వ్యక్తిగతంగా మాట్లాడి, ప్రపంచ ఆహార ఉత్పత్తి యొక్క సవాళ్లు మరియు సంక్లిష్టతలను వివరించాడు. ఆహార పంటల కొరతను తీర్చినందుకు1970లో బోర్లాగ్‌కు నోబెల్ శాంతి బహుమతి లభించింది. బోర్లాగ్ 2009, సెప్టెంబరు 12న తన 95వ ఏట మరణించాడు.

# నేడు ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్ ప్రమాణస్వీకారం

### గవర్నర్ పదవి నుంచి వైదొలగిన బిజెపి నేత



న్యూఢిల్లీ : ఉపరాష్ట్రపతిగా సి.పి. రాధాకృష్ణన్ నేడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాధాకృష్ణన్‌తో ప్రమాణం చేయించనున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రపతి భవన్‌లో ఉదయం 10 గంటలకు జరగనున్న కార్యక్రమంలో మహారాష్ట్ర మాజీ గవర్నర్ రాధాకృష్ణన్ తదుపరి ఉపరాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేస్తారని వారు తెలిపారు. 67 ఏళ్ల రాధాకృష్ణన్ మంగళవారం జరిగిన ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఉమ్మడి ప్రతిపక్ష అభ్యర్థి బి. సుదర్శన్ రెడ్డిని 152 ఓట్ల తేడాతో ఓడించి విజయం సాధించారు. జులై 21న అప్పటి ఉపాధ్యక్షుడు జగదీప్ ధన్‌ఖడ్ ఆకస్మికంగా రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైంది. కాగా, మహారాష్ట్ర గవర్నర్ పదవి నుంచి సి.పి.రాధాకృష్ణన్ వైదొలిగారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ ప్రకటన విడుదల చేసింది. ఇటీవల నూతన ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన నేపథ్యంలో.. గవర్నర్ పదవికి ఆయన రాజీనామా చేశారు. ఈ క్రమంలోనే గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌కు మహారాష్ట్ర గవర్నర్‌గా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అదనపు బాధ్యతలు అప్పగించారు. మహారాష్ట్ర రాజ్‌భవన్‌లో బుధవారం సి.పి.రాధాకృష్ణన్‌కు సత్కారం నిర్వహించారు. ఆయన ప్రసంగిస్తూ.. తాను రాజీపడని జాతీయవాదినని చెప్పారు. గవర్నర్‌గా ఇక్కడ కొనసాగిన 13 నెలలు.. ప్రజాజీవితంలో సంతోషకరమైన సమయమని, పరిపాలన పరంగా, రాజకీయంగా నాకెంతో నేర్పిన రాష్ట్రమిది అని పేర్కొన్నారు. జగదీప్ ధన్‌ఖడ్ ఆకస్మిక రాజీనామాతో ఉపరాష్ట్రపతి ఎన్నిక అనివార్యమైంది. ఈ క్రమంలోనే ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో ఎన్‌డిఎ అభ్యర్థి సి.పి.రాధాకృష్ణన్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. విపక్ష ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిపై 152 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి బుధవారం నూతన ఉపరాష్ట్రపతిని కలిసి అభినందించారు.

# రాహుల్‌గాంధీ భద్రతా ప్రోటోకాల్ పాటించడం లేదు

న్యూఢిల్లీ : విదేశీ పర్యటనల సందర్భంగా భద్రతా ప్రోటోకాల్స్ ను ఉల్లంఘించారని ఆరోపిస్తూ లోక్‌సభ ప్రతిపక్ష నేత, ఎంపి రాహుల్ గాంధీకి సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ లేఖ రాసింది. అలాగే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకూ సిఆర్‌పిఎఫ్ లేఖ రాసింది. లేఖలో రాహుల్ గాంధీ తన భద్రతను సీరియస్‌గా తీసుకోవడం లేదని సిఆర్‌పిఎఫ్ వివిఐపి సెక్యూరిటీ చీఫ్ సునీల్ జూన్ ఆరోపించారు. ఎవరికీ సమాచారం ఇవ్వకుండా విదేశాలకు ప్రయాణిస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల రాహుల్ గాంధీ చేసిన విదేశీ పర్యటనల గురించీ సునీల్ జూన్ లేఖలో ప్రస్తావించారు. ఇటలీ (డిసెంబర్ 30 నుంచి జనవరి 9 వరకు), వియత్నాం (మార్చి 12నుంచి17వరకు),దుబాయ్(ఏప్రిల్17నుంచి 23 వరకు), ఖతార్ (జూన్ 11 నుంచి 18 వరకు), లండన్ (జూన్ 25 నుంచి జులై 6 వరకు), మలేషియా (సెప్టెంబర్ 4 నుంచి 8 వరకు)వంటి దేశాల్లో ప్రోటోకాల్‌కు విరుద్ధంగా ఆయన పర్యటించారని పేర్కొన్నారు. సిఆర్‌పిఎఫ్ బుక్కులోని ప్రోటోకాల్స్‌ను రాహుల్ ఉల్లంఘిస్తున్నారని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం రాహుల్ గాంధీకి అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ లైజన్ (ఎఎస్ఎల్)తో జెడ్+ కేటగిరీ భద్రతను కల్పిస్తున్నట్లు సిఆర్‌పిఎఫ్ అధికారి తెలిపారు. జెడ్+ ఎఎస్ఎల్ అనేది ఎక్కువ ప్రమాదం పొంచి ఉన్న వ్యక్తులకు అందించే అత్యున్నత స్థాయి రక్షణల్లో ఒకటిగా పేర్కొన్నారు. నేషనల్ సెక్యూరిటీ గార్డ్ కమాండోలతో సహాదాదాపు 55 మంది భద్రతా సిబ్బందిని రాహుల్ గాంధీ కలిగి ఉన్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఎఎస్ఎల్ కింద భద్రతా సిబ్బంది, స్థానిక పోలీసులు, నిఘా అధికారుల సమన్వయంతో వీఐపీలు సందర్శించే ప్రదేశాల్లో ముందస్తు నిఘా నిర్వహిస్తారని వెల్లడించారు.

# నేపాలీలకు ప్రజాస్వామ్యమే రక్ష

సోషల్ మీడియాపై నిషేధం విధింపునకు నిరసనగా రాజధాని ఖఠ్మండూలో రోడ్డెక్కిన నేపాల్ జెన్ జెడ్ (1997 నుంచి 2012 మధ్య జన్మించిన తరం) యువతపై పోలీసుల కాల్పుల్లో 19 మంది అకాల మరణంతో ఆ దేశం ఒక్కసారిగా భగ్గుమంది. యువతరం ఆగ్రహజ్వాలలకు పార్లమెంటు, సుప్రీం కోర్టు భవనాలు, పత్రికా కార్యాలయాలు, ప్రభుత్వాధినేతల అధికార నివాసాలు ఆహుతయ్యాయి. ప్రధానమంత్రి కె.పి.ఓలీ రాజీనామా చేసినా శాంతించక మంత్రులు, మాజీ ప్రధానులు, ఎంపిల ఇళ్ళపై బడి ప్రత్యక్ష దాడులకు పాల్పడడం ఆందోళన అరాచక శక్తుల చేతిలోకి వెళ్లినట్లు విదితం చేసింది. కేంద్ర మంత్రులను రోడ్లపై చితక్కొట్టడం, మాజీ ప్రధాని జాలానాథ్ ఖనాల్ సతీమణి రాజ్యలక్ష్మి చిత్రకార్ దాడులలో ప్రాణాలు కోల్పోవడంతో పరిస్థితులు చేయి దాటాయి. భీతిల్లిన పాలకపక్ష నాయక గణం హెలికాప్టర్‌లలో సైనిక స్థావరాలకు పారిపోయిన దృశ్యాలు రాజధాని ఖఠ్మంటూ గగన తలంలో మంగళవారం కనిపించాయి. నేపాల్ దేశాధ్యక్షుడు రామచంద్ర పౌదెల్ సైన్యం హింసను నిలిపివేయాలని, ప్రభుత్వం చర్చలకు సిద్ధమని చేసిన విజ్ఞప్తితో యువత కాస్త చల్లబడింది.

యువత ఆగ్రహానికి భావప్రకటనా స్వేచ్ఛను కాలరాస్తూ సోషల్ మీడియాపై నిషేధం ప్రకటించడమే కారణమా? అది ఒక కారణం తప్ప అదే కారణం కాదు. అది గత కొన్నేళ్లుగా ప్రభుత్వ పెద్దల అవినీతి, అక్రమాలు, అక్రమ సంపాదనపై కడుపు మండిన యువత తిరుగుబాటు. నిరుద్యోగం, ఎదుగుబొదుగు లేకపోవడం, చదువులు చదివినా ఉద్యోగాలు రాకపోవడంతో నేపాల్ యువతలో తీవ్ర అసహనం పెరిగింది. మరో వైపు రాచరికాన్ని కూలదోసి 2005లో ప్రజాస్వామ్య వ్యవస్థలోకి వచ్చిన తరువాత కూడా తమ జీవితాలలో ఎదుగుబొదుగు లేదని సగటు నేపాలీలు భావిస్తున్నారు. ఈ రెండు దశాబ్దాలలో ప్రభుత్వం, ప్రధాన మంత్రి పదవి మ్యూజికల్ చెయిర్ లాగా కె.పి.ఓలి, షేర్ బహదూర్ దేవ్‌బా, ప్రచండల మధ్యే మారుతుండడం, కొత్త వారిని రాకుండా వారే పరస్పరం రాజీపడుతూ పదవులు ఉండేలా జాగ్రత్తపడుతున్నారు. వరుస ప్రభుత్వాలు, ప్రధానమంత్రులు, మంత్రుల సంపద అమాంతం పెరిగి, వారి సంతానం భోగలాలసలో మునిగిపోవడంతో నేపాలీ యువతలో ఆగ్రహం గూడుకట్టుకున్నది. దీనినే సామాజిక మాధ్యమాలలో అభివ్యక్తీకరించారు. నెపోకిడ్స్ హ్యాష్‌ట్యాగ్‌తో నేపాల్ ప్రధానులు, వారి సతీమణులు, పిల్లల ఖరీదైన దుస్తులు, వాచ్‌లు, బడా హోటల్‌లలో పార్టీలు, ఆస్తుల ఫోటోలు సోషల్ మీడియాలో వైరలయ్యా యి. దీనికి అడ్డుకట్ట వేసేందుకు ఓలి ప్రభుత్వం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు ప్రభుత్వం వద్ద రిజిస్టర్ చేయించుకోవాలని ఆదేశించింది. దీనిని పాటించని వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ సహా 29 యాప్‌లను నేపాల్ ప్రభుత్వం నిషేధిస్తున్నట్లు ప్రకటించింది. ఇది యువతలో గూడుకట్టుకున్న ఆగ్రహం బద్ధలయ్యేందుకు ట్రిగ్గర్ పాయింట్‌గా మారింది.

ప్రజాపక్షం
12-09-2025, శుక్రవారం

అయితే, పాలకుల అవినీతి, అక్రమాలు, అధికార లాలసపై వ్యతిరేకత ఏకంగా రాజకీయ, ప్రజాస్వామ్య వ్యవస్థలపైనే అపనమ్మకాన్ని కలగచేయడం ఆందోళన కలిగించే అంశం. ఎంతో కష్టపడి రాచరిక వ్యవస్థపై పోరాడి, కూలదోసి ప్రజాస్వామ్యం తెచ్చుకొని, లౌకిక ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని రూపొందించుకున్న నేపాలీల విశ్వాసం వమ్ముకావడం దురదృష్టకరం. కమ్యూనిస్టులలో చీలికలు కూడా సంక్షోభానికి ఇందుకు ఒక కారణం అని చెప్పవచ్చు. పలు మార్లు కమ్యూనిస్టులకు అనుకూలంగా ప్రజలు తీర్పునిచ్చినప్పటికీ, సద్వినియోగం చేసుకోకుండా సంకుచిత ఎజెండాతో అధికారం కోసం రాజీపడడం ప్రజలకు నచ్చలేదని విశ్లేషణలు వస్తున్నాయి.

యువత ఆక్రోశం న్యాయమైనదే. అయితే, వారు ఎంచుకున్న హింసా మార్గం, వ్యవస్థల విధ్వంస నినాదం అపరిపక్వతను చాటుతున్నాయి. ఇది మితవాద శక్తులకు గ్రాసంగా మారి పూర్వపు రోజులకు నెట్టేసే ప్రమాదం ఉన్నది. రెండు రోజుల క్రితం రణరంగంగా మారిన ఖఠ్మండూ వీధులను గురువారం యువత శుభ్రం చేయడానికి పూనుకోవడం, ప్రభుత్వంతో చర్చలకు సంసిద్ధమవడం సుపరిణామం. తమ ఆగ్రహావేదనలను నిర్మాణాత్మక రూపంలోకి మార్చుకొని, ప్రజాస్వామ్య పరిధిలోనే ప్రత్యామ్నాయ పరిష్కారాలు వెతకడంపైనే నేపాల్ భవిష్యత్తు ఆధారపడి ఉంది. నేపాల్‌లో అస్థిర పరిస్థితుల వెనుక సామ్రాజ్యవాద దేశాల హస్తాన్ని కొట్టిపారేయలేమనే విశ్లేషణలు వస్తున్నాయి. ఇప్పటికే పొరుగుదేశం బంగ్లాదేశ్‌తో ఉద్రిక్తత దౌత్య సంబంధాలను ఎదుర్కొంటున్న భారతదేశానికి నేపాల్ తాజా సంక్షోభం కూడా ఆందోళన కలిగించేదే. అక్కడ జరుగుతున్న పరిణామాలపై మన పౌరులు ఇష్టానుసారం సోషల్ మీడియాలో చేస్తున్న వ్యాఖ్యలు సంబంధాలను మసకబార్చే అవకాశం లేకపోలేదు. సున్నితమైన అంశాలపై సంయమనం పాటించడం ఉభయకుశలోపరి.

దక్షిణాసియా దేశాలలో స్థాపిత ఆశ్రిత పక్షపాత రాజకీయ వ్యవస్థపై యువత ఆగ్రహావేశాలు చూసిన మూడవ దేశం నేపాల్. అంతకు ముందు శ్రీలంక, బంగ్లాదేశ్‌లో ఇలాంటి సంఘటనలే కనిపించాయి. శ్రీలంకలో అతివాద పార్టీగా పుట్టిన జనతా విముక్త పెరుమాను (జెవిపి) పార్టీ అధినేత అనురకుమార దిస్సానాయకే ప్రజాస్వామ్య బాటలో బాలెట్ ద్వారా పాతుకుపోయిన పార్టీలను పెకలించి రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. ఆ దేశానికి నూతన దిశను చూపేందుకు శతథా ప్రయత్నిస్తున్నారు. మరోదేశం బంగ్లాదేశ్ మితవాద శక్తుల చేతుల్లో విలవిలలాడుతున్నది. పదే పదే ఎన్నికలను వాయిదా వేసుకుంటూ పోతూ అగమ్యగోచరిగా మారింది. ఈ రెండింట్లో సరైన మార్గం ఎంచుకోవడంలో నేపాల్ పౌరులు విజ్ఞత ప్రదర్శించాలి. బర్మాలో సైనిక పాలన. పాకిస్థాన్‌లో సైనిక పెత్తనం. దక్షిణాసియా తీవ్రమైన రాజకీయ సంక్షోభంలో ఉన్నట్లు ఈ పరిస్థితులు సూచిస్తున్నాయి. అతి పెద్ద దేశమైన భారత్ ఈ దేశాలపై ప్రభావం చూపగల స్థితిలో లేకపోవటం విచారకరం.

సాయుధ పోరాట

# చరిత్రను వక్రీకరిస్తే సూర్యుడిపై ఉమ్మి వేసినట్లే

## బిజెపి పాలకులారా 'చరిత్ర క్షమించదు' ఖబడ్దార్...



చాడ వెంకట్ రెడ్డి
సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు

తెలంగాణలో నిజాం పరిపాలన పూర్తిగా రాచరిక పద్ధతిలో జరిగేది. ఆ రోజుల్లో తెలంగాణ సంస్థానం అంటే 8 జిల్లాలు తెలంగాణ, ఐదు జిల్లాలు మహారాష్ట్ర, మూడు జిల్లాలు కర్ణాటక కలుపుకొని మొత్తం 16 జిల్లాలుగా ఉండేది. నిజాంకు ప్రత్యేక సిక్కా ఉండేది. సిక్కా అంటే ప్రత్యేకమైన నాణాలు, చట్టాలు లాంటివి. పోలీసులు, న్యాయవ్యవస్థ తదితర విభాగాలు నిజాం ప్రభువు ఏర్పరచుకున్నాడు. దేశవ్యాప్తంగా బ్రిటిష్ పరిపాలన సాగుతున్నా 550 సంస్థానాలలో పరిపాలన చిన్న చిన్న రాజులు, సామంతుల ఆధీనంలో ఉండేది. సంస్థానాధీసులు వారివారి ప్రాంతాలను స్వతంత్రంగా పాలించుకున్నారు. నిజాం రాచరిక పాలనలో గ్రామాలలో సామాజిక అణిచివేతలు బాగా ఉండేవి. ఎస్సీలను ఊరి బయట అంటరాని వారిగా ఉంచేవారు. బిసిలని వారికి సంబంధించిన కులవృత్తి పనులను తమ ఇంట్లో వెట్టి చాకిరి చేయించుకునేవారు. బాంచన్ జమీందార్లు జాగీర్దారులు క్రూరంగా ప్రజలను చిత్రహింసలకు గురిచేసేవారు. ఎవరిని పిలిచినా అయ్యా కాల్మొక్త బాంచన్ దొర అని పిలిచే రోజులవి. ప్రజలను అణచివేయడమే దొరల లక్ష్యంగా ఉండేది.

స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కావాలి అని మార్క్సిజం, లెనినిజం పునాదుల మీద ప్రపంచవ్యాప్తంగా స్వాతంత్ర్యంకోసం ఉద్యమాలకై పోరాటాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా రష్యాలో 1917లో అక్కడ తొలి కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడడం, దాని వెలుతురులోనే అనేక దేశాలలో స్వాతంత్ర్య ఉద్యమాలు ఉద్భవించాయి. ఆ ప్రభావం భారతదేశం మీద కూడా పడింది. మహాత్మా గాంధీ, సుభాష్ చంద్రబోస్, జవహర్ లాల్ నెహ్రూ, వల్లభాయ్ పటేల్ తదితరులు పెద్ద ఎత్తున స్వాతంత్ర్యోద్యమాలు చేస్తున్న తరుణంలో 1930లో మహాత్మాగాంధీ కాకినాడలో చేపట్టిన ఉప్పు సత్యాగ్రహంకు తెలంగాణ నుండి కూడా బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డి, మగ్దమ్ మొహియుద్దీన్ పాల్గొని స్వాతంత్ర్య ఉద్యమంలో పాలుపంచుకున్నారు.

### దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా తెలంగాణకు ఏదీ?

దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చింది. అయితే నిజాం రాచరిక పాలనలో ఉన్న తెలంగాణలో స్వాతంత్ర్యం రాలేదు. అప్పటికే ఈ ప్రాంతంలో అణచివేతలు విపరీతంగా ఉన్నాయి. వెట్టిచాకిరి బానిసత్వం తో పాటు ఉర్దూ భాష అధికార భాషగా అమలు చేశారు. భాష మీద, మనుషుల మీద పెత్తనం చేశారు. ఇలాంటి తప్పనిసరి పరిస్థితులలో తిరుగుబాటు ఆరంభమైంది. 1935లో జోగిపేటలో ఆంధ్ర మహాసభ ప్రారంభమై ఆ తరువాత 1945లో భువనగిరిలో ఆంధ్ర మహాసభ లో దున్నేవాడికే భూమి కావాలి, వెట్టిచాకిరీ రద్దు కావాలని పోరాటాలకు పిలుపునివ్వడం జరిగింది. బండెనక బండి గట్టీ 16 బండ్లు కట్టి అని పాటలు పాడుకుంటూ పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తూ పల్లె పల్లెకు సంఘాలు పెట్టాలని నిర్ణయించుకున్నారు. ఆ నేపథ్యంలోనే పల్లెలలో ప్రజలు సంఘాలు పెట్టుకుని దొరలను ఎదిరించారు. 1946 జూలై 4న కడివెండిలో విసునూరి రామచంద్రారెడ్డి ఆగడాలను ఎదిరించిన దొడ్డి కొమరయ్య తొలి అమరుడయ్యారు. షేక్ బందగి లాంటి అనేకమందిని పొట్టన పెట్టుకున్నారు. తెలంగాణ వ్యాప్తంగా నైజాం రాజుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళనలు పెల్లుబికాయి. ఇప్పుడు ఉన్న ఆంధ్రప్రదేశ్ తమిళనాడు రాష్ట్రంలో ఉండేది. వారు కూడా తెలుగు ప్రజలు కాబట్టి తెలంగాణలో జరుగుతున్న సాయుధ పోరాటానికి పూర్తి సహకారం అందించారు.

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించినా అప్పటికి తెలంగాణలో నిజాం రాచరిక పాలనలో ఉండడం మూలంగా యువకులు, నాయకులు, స్వాతంత్ర్య సమరయోధులు జాతీయ జెండాను ఎగురవేస్తే కేసులు పెట్టి జైళ్లలో నిర్బంధించారు. చిత్రహింసలకు గురిచేశారు. ఈ నేపథ్యంలో నైజాంను ఎదిరించడానికి బందూకులు పట్టాలనే నిర్ణయానికి వచ్చారు. నాగపూర్ లోని చాందాలో క్యాంపు ఏర్పాటు చేసి శిక్షణను ఇచ్చారు. పూర్తిస్థాయిలో కాకున్నా కాంగ్రెస్ పార్టీ కూడా తెలంగాణ పోరాటంలో పాల్గొన్నది. సెప్టెంబర్ 11, 1947లో రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారు.

ఆ పిలుపు ఉధృతమై ఊరు వాడ ఉప్పెనై కత్తులు, ఒడిశలు, కారం పొడి, రోకలి బండలతో దొరల మెడలు ఉంచడానికి పెద్ద ఎత్తున ఉద్యమాలు జరిగాయి. దొరల పెత్తనంలో ఉన్న 3000 గ్రామాలు విముక్తి చేయబడ్డాయి. వేలాదిమంది ప్రాణాలు కోల్పోయారు. తెలంగాణ సాయుధ పోరాటానికి తలొగ్గిన జాగిర్దారులు, జమీందారులు, దొరలు నిజాం కు మొరపెట్టుకోవడంతో ఆయన కేంద్రంతో ఒడంబడిక చేసుకొని 1948 సెప్టెంబర్ 13న యూనియన్ సైన్యాలు హైదరాబాద్‌కు రావడం జరిగింది. 1948 సెప్టెంబర్ 17న నిజాం రాజు తన సొంత రేడియోలో దేశంలో తెలంగాణ ప్రాంతాన్ని విలీనం చేస్తామని ప్రకటించాడు. కమ్యూనిస్టులకు పేరు రాకుండా కేంద్రం సైన్యాలను పిలిపించుకొని తెలంగాణలో ఉన్న తమ ఆస్తులను కాపాడుకుంటూ విలీన ప్రక్రియ ప్రారంభించారు. పోరాటాలు కమ్యూనిస్టులు చేస్తే భోగాలు మాత్రం బూర్జువా పార్టీలవి అనేది అర్థమవుతుంది.

### సాయుధ పోరాటం నాటికి పుట్టని బిజెపి

ప్రస్తుతం దేశంలో అధికారంలో ఉన్న బిజెపి, ప్రధాని నరేంద్ర మోడీ విమోచన దినోత్సవం పేరుతో హిందూ ముస్లింల మధ్యన జరిగిన పోరాటంగా చిత్రీకరించి చరిత్రను వక్రీకరిస్తున్నారు. నిజంగా చెప్పాలంటే నిజాం వ్యతిరేక పోరాటంలో కూడా అనేకమంది ముస్లింలు పాల్గొన్న విషయం అందరికీ విదితమే. కానీ బిజెపి తన మతతత్వ రాజకీయాలు చేస్తూ చరిత్రను వక్రీకరిస్తున్నది. ఎలాంటి సంబంధం లేని బిజెపి నేడు తెలంగాణ సాయుధ పోరాటాన్ని వక్రీకస్తున్నది. అంటే చరిత్రను తప్పుదోవ పట్టించడమే అవుతుంది. భావితరాలకు వాస్తవిక చరిత్రను కనుమరుగు చేసే కుట్ర బిజెపి పన్నుతుంది. ఇది బిజెపి అరాచకానికి నిలువుటద్దం. అయితే గత టిఆర్ఎస్ ప్రభుత్వంలో 2021లో 'సమైక్య దినం' పేరుతో ఉత్సవాలు జరిపినా, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం 'ప్రజా పాలన' పేరుతో సెప్టెంబర్ 17న ఉత్సవాలు జరిపినా అది కమ్యూనిస్టుల త్యాగఫలితం వలనే తెలంగాణ రాష్ట్రానికి ఆనాడు స్వాతంత్రం సిద్ధించిన ఫలితమే. ఎవరు ఏ పేరు చెప్పినా విలీనం జరిగిన మాట వాస్తవం, కమ్యూనిస్టుల పోరాటం, త్యాగాలు చరిత్రాత్మకం. కొన్ని సందర్భాలలో ముఖ్యమంత్రి సాయుధ పోరాటం భూమి చుట్టే జరిగిందని, కమ్యూనిస్టుల వలన వచ్చిందని చెప్పడం మంచి పరిణామం. ఆనాటి సాయుధ పోరాట చిహ్నాలు, స్మృతులు ఇప్పటికీ పోరాట కేంద్రాలలో కనిపిస్తూనే ఉన్నాయి. ఎక్కడ ఏ పుట్టని అడిగినా చెట్టుని అడిగినా ఆనాటి రక్త తర్పణం కనిపిస్తూనే ఉన్నది. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి వల్లాలనే గ్రామంలో పది మంది విద్యార్థులు త్రివర్ణ పతాకాన్ని ఎగరవేస్తే రజాకార్లు గుర్రాలతో తొక్కించిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. ఆ ప్రాంతంలో స్థూపా న్ని కూడా సెప్టెంబర్ 12వ తేదీన ఆవిష్కరించబోతున్నారు. సాయుధ పోరాటం చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగినది. అలాంటి పోరాటాన్ని దురుద్దేశంతో తొక్కి పట్టారు. బిజెపి చేస్తున్న దుష్ప్రచారం విడ్డూరంగా ఉన్నది. ఇది వారి ఆత్మహత్యాసదృశమే. బిజెపి వక్రబుద్ధిని ఖండిస్తున్నాం. కమ్యూనిస్టుల త్యాగ ఫలితం వలనే భారతదేశంలో తెలంగాణ విలీనమైనందున విలీన దినం అధికారికంగా జరపాలని కోరుతున్నాం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారు సాయుధ పోరాటాన్ని గుర్తించి ఆనాటి పోరాట స్మృతులను ఈనాటి తరానికి తెలియజేయడానికి గొప్ప ప్రయత్నం చేయాలి. ఎందుకంటే ఆ పోరాటం తెలంగాణ వారసత్వ సంపద.

# యాగాలతో 'అధికార యోగం' సంభవమా?



ఎస్.కె. జకీర్

మంత్రాలతో చింతకాయలు రాలవు. యజ్ఞాలు, యాగాలతో రాజ్యాధికారం రాదు. నలభై ఐదేండ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న కెసిఆర్ ఒక్క 'ఓటమి'తో చతికిలబడడం అనూహ్యం. ప్రజలకన్నా ఆయనకు దేవుళ్ళపైనే నమ్మకం అధికం. కాలం ఎప్పుడూ ఒకే విధంగా ఉండదు. చీకటి తర్వాత వెలుతురూ వస్తుంది. ఓటమి తర్వాత గెలుపు కూడా ఉంటుంది. అయితే ఇదంతా ప్రజలను నమ్మినప్పుడే. ప్రజాతీర్పును గౌరవించకుండా, ప్రజల్ని కాంగ్రెస్ పార్టీ మోసగించిందనో, ప్రజలు మోసపోయి తప్పు చేశారనో, తమ తప్పును ఇప్పుడు తెలుసుకొని బాధ పడుతున్నారనో.... వ్యాఖ్యానిస్తూ బిఆర్ఎస్ నాయకులు తమను తాము మోసగించుకుంటున్నారు.

ప్రజలు తమను ఎందుకు తిరస్కరించారో వాళ్ళు తెలుసుకోవాలనుకోవడం లేదు.ఆత్మ పరిశీలన చేసుకోవాలని అనుకోవడం లేదు.తప్పులు దిద్దుకొని ముందుకు వెళ్లాలని అనుకోవడం లేదు. 'అసలు మేము ఎలాంటి తప్పు చేయలేదు' అని కెసిఆర్, కెటిఆర్, హరీశ్ రావు బల్లగుద్ది వాదిస్తున్నారు. ప్రజలతో డిస్కనెక్టు కావడాన్ని సమర్థించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజలకేమి కావాలో తామే నెరవేర్చినందున, ఇక ప్రజలతో తమకేమి సంబంధమని ఆ పార్టీ నాయకులు ప్రశ్నించడం విచిత్రంగా ఉంది. ''సామాన్య ప్రజలతో ముఖ్యమంత్రి కలవవలసిన అవసరం ఏమిటి?'' అని ఒక సందర్భంలో కెటిఆర్ అన్నారు. కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నవేళ సెక్రెటేరియట్‌కు రాకపోయినా, ఎమ్మెల్యేలను కూడా కలవకపోయినా, ప్రజల్ని కలుసుకోవడం అవసరం లేదని భావించినా అధికారం ఉన్నప్పుడు చెల్లుబాటు అయ్యింది. ఆ అధికారం నీడలో చాలా విమర్శలు కనుమరుగయిపోయాయి.

కెసిఆర్ కు భక్తి ఎక్కువ. భయమూ ఎక్కువే. ఆయన ముఖ్యమంత్రి అయిన తర్వాత అనేక హిందూ దేవాలయాలకు మొక్కులు తీర్చుకున్నా రు. కొరివి వీరభద్రుని దగ్గర నుంచి తిరుమల వేంకటేశ్వరుని వరకూ ఖరీదైన ఆభరణాలు ఇచ్చారు. తెలంగాణ వచ్చినందుకు మొక్కు తీర్చుకుంటున్నానని కెసిఆర్ తెలిపారు. అజ్మీరు దర్గాకు కూడా కానుకలు పంపారు. లౌకిక ప్రభుత్వం కదా, ప్రజాధనంతో మొక్కులు ఎలా చెల్లిస్తారని ఎవరూ ఆయన్ను ప్రశ్నించలేదు. తెలంగాణ ఏర్పడ్డాక 2014–2018 మధ్య ఒక్క రోజు కూడా సచివాలయంలో కెసిఆర్ అడుగు పెట్టలేదు. రెండోసారి గెలిచి ముఖ్యమంత్రి అయిన తరువాత, హుస్సేన్ సాగర్ తీరంలో దాదాపు 25 ఎకరాల్లో ఉన్న సచివాలయాన్ని కూల్చివేశారు. ఆ భవనాలేమీ శిథిలావస్థకు చేరుకున్నవి కాదు. కానీ, వాటిని కూల్చి వాటి స్థానంలో కొత్త సచివాలయం కట్టారు. అందుకు కారణం అది కెసిఆర్‌కు నచ్చకపోవడమే. ఆయన సచివాల యం కూల్చడం పరిపాలన సౌలభ్యం మాత్రమే కాదనీ, ఒక ఐకానిక్ భవనం కావాలనే ఆకాంక్ష అని, అలాగే వాస్తు నమ్మకం అనేవి బహిరంగ రహస్యం.

తరచూ వందల మంది పండితులతో భారీ యాగాలు చేసే కెసిఆర్ కు నమ్మకాలు కూడా ఎక్కువ. గతంలో తన ఫామ్ హౌస్‌లో రాజశ్యామల యాగం చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత గుజరాత్‌లో నిర్మించిన సోమ్‌నాథ్ ఆలయం నుంచి, తాజాగా అయోధ్యలో నిర్మించిన రామాలయం వరకూ ఏదీ ప్రభుత్వ ఖర్చుతో చేయలేదు. విరాళాలతోనే చేశారు. కానీ కెసిఆర్ మాత్రం ప్రభుత్వ డబ్బుతో మొక్కులు తీర్చడం, గుళ్లు కట్టడం చేశారు. తెలంగాణలోని హైదరాబాద్ శివార్లలో యాదగిరి గుట్ట దేవాలయాన్ని ప్రభుత్వ సొమ్ముతో పునరుద్ధరించారు. అందుకు వెయ్యి కోట్ల రూపాయలతో గుడి కట్టేశారు. ప్రభుత్వ సొమ్ముతో ఇలా చేయడం సబబేనా అని కెసిఆర్‌ను ఎవరూ ప్రశ్నించలేదు. కెసిఆర్ వ్యక్తిగత వ్యవహార శైలి, ప్రభుత్వాన్ని, పార్టీని ఆయన నడిపే విధానం, తన నమ్మకాలను బట్టి, అభిరుచులను బట్టి వివిధ ప్రభుత్వ విధాన నిర్ణయాలను తీసుకునే పద్ధతి మిగతా ప్రాంతీయ పార్టీల అధినేతలకు భిన్నమైనది.

కెసిఆర్ ప్రభుత్వంలో కుటుంబ సభ్యుల పాత్ర 2023 అసెంబ్లీ ఎన్నికల్లోనే కాదు, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లోనూ ప్రత్యర్థి పార్టీలకు ప్రధాన అస్త్రాలుగా మారనున్నవి. పైగా గడచిన కొన్ని నెలలుగా పార్టీలో, కుటుంబంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలు గమనిస్తున్నారు. ఇందుకోసమేనా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని కోరుకున్నదని ఏవగించుకుంటున్నారు. బిఆర్ఎస్ పార్టీ తాము చేశామని చెబుతున్న 'అద్భుతాల్లో' కాళేశ్వరం ప్రాజెక్ట్ ఒకటి.ఈ ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బరాజ్ లో వారి హయాంలోనే పిల్లర్లు దెబ్బతిన్నాయి. బరాజ్ కూడా కుంగింది.ఈ ప్రాజెక్టు దెబ్బతినడంపై చర్చ అంతా ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కేంద్రంగానే నడిచింది. ఇప్పటికీ నడుస్తున్నది. జస్టిస్ పిసి. ఘోష్ కమిషన్ నివేదికలోనూ కెసిఆర్ ను 'ప్రధాన బాధ్యుని'గా పేర్కొన్నారు. ఆ నివేదిక బహిర్గతం చేయకుండా చూడాలని, బహిర్గతం చేసి అసెంబ్లీలో పెట్టి చర్చించినా తదుపరి చర్యలకు పూనుకోరాదని,ఘోష్ నివేదిక ఆధారంగా సిబిఐ విచారణ జరగకుండా చూడాలని కెసిఆర్, హరీశ్ రావు హైకోర్టులో వరుస పిటిషన్లు వేసి ఊరట లభించకపోవడంతో తమ పరువు తామే పోగొట్టుకున్నట్లయ్యింది.

కాళేశ్వరం ప్రాజెక్టు ఒక ఒడువని ముచ్చట. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో కెసిఆర్ స్వయంగా జోక్యం చేసుకుని పెద్ద పెద్ద ఇంజినీర్లకే సలహాలిచ్చారని బిఆర్ఎస్ నాయకులు గతంలో ఎంతో గొప్పగా చెప్పుకున్నారు. కొందరు ఇంజినీర్లతోనూ అలాగే ప్రచారం చేయించారు. లిటరేచర్ చదువుకున్న కెసిఆర్ ఇరిగేషన్ ప్రాజెక్టును రీడిజైన్ ఎలా చేస్తారు? సివిల్ ఇంజినీర్లకు సలహాలు ఇవ్వడం ఎలా సాధ్యం? అని ఎవరూ ప్రశ్నించకపోవడం విశేషం. కెసిఆర్ కు సలహా ఇవ్వడానికే వణికిపోయే అధికారులు, పార్టీ నాయకులు ఇక 'ప్రశ్నించడం' అనేది ఊహించని సన్నివేశం.

కాగా బిటి బ్యాచ్, యూటీ బ్యాచ్ అంశం బిఆర్ఎస్ ను ఇంటా, బయటా వెంటాడుతూనే ఉన్నది. ఇది 11 ఏండ్లుగా రగులుతున్న సమస్య. కెటిఆర్ కంటే తెలంగాణ ఉద్యమంలో ఎక్కువగా పోరాడిన నాయిని నరసింహారెడ్డికి రెండోసారి మంత్రి పదవి ఇవ్వలేదు. మరొక ఉద్యమకారుడు ఈటల రాజేందర్‌ను పార్టీ నుంచి అవమానకరంగా తరిమేశారు. మాట వినడం లేదని మాజీ ఎంపి. ఎపి.జితేందర్ రెడ్డి, వివేక్ వంటి వారికి ఎంపి టికెట్ ఇవ్వలేదు. ఉపముఖ్యమంత్రి, దళితుడు, డాక్టర్ రాజయ్యను ఆ పదవి నుంచి ఎందుకు తొలగించారో ఇప్పటికీ సస్పెన్స్. తనను ఎందుకు తొలగించారని ఆయన ప్రశ్నించలేరు. ఫలానా కారణంగా తాము ఉద్వాసన పలికినట్టు కెసిఆర్ చెప్పరు. అదొక మిస్టరీ. తెలంగాణ కోసం కృషి చేసిన వారికి పదవులు కాకుండా కుటుంబసభ్యులకు పదవులివ్వడానికి కెసిఆర్ ప్రాధాన్యం ఇచ్చి విమర్శలపాలయ్యారు.

''కెసిఆర్ అవినీతి, కుటుంబ పాలన అంటూ విమర్శిస్తుంటారు. కెటిఆర్, హరీశ్ రాజకీయాల్లో తమ ప్రతిభను నిరూపించుకున్నారు. కవిత తెలంగాణ సాంస్కృతిక ఉద్యమానికి చేసిన సేవను అందరూ చూశారు. కుటుంబ పాలన ఏమీ లేదు. ఒక రాజకీయ పార్టీగా బిఆర్ఎస్ పార్టీ ఒక వ్యూహం ప్రకారం ఉద్యమంలో లేని వారికి కూడా పదవులు ఇవ్వాల్సి వస్తుంది. అదేమీ తప్పు కాదు'' అని కెసిఆర్ 'భక్తమండలి' సభ్యులు ఇంతకుముందు వాదిస్తూ ఉండేవారు. కవిత 'తిరుగుబాటు', సస్పెన్షన్, ఆమె పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా వంటి ఘటనలతో కవితను విచ్ఛిన్నకర' శక్తిగా కెసిఆర్, కెటిఆర్ 'భక్త మండలి' సభ్యులు అభివర్ణిస్తున్నారు. తెలంగాణ ద్రోహులు, కెసిఆర్ వ్యతిరేకులతో 'ఆమె' చేతులు కలిపినట్లుగా ఆరోపిస్తున్నారు. కవిత ఇమేజ్ దెబ్బతీయడానికి సోషల్ మీడియా వేదికల ద్వారా 'భక్తమండలి' గట్టిగా ప్రయత్నిస్తోంది. ఆమె వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు అంశాలను తెరపైకి తీసుకు వచ్చి ఆమె 'వ్యక్తిత్వ హననాని'కి పాల్పడుతున్నా కెసిఆర్, కెటిఆర్ ఎందుకు మౌనంగా ఉన్నారో, ఇదేమి రాజనీతో ఎవరికీ అర్థం కావడం లేదు. రాజకీయ కుటుంబాల్లో కలహాలు సహజం. బిఆర్ఎస్ అధినేత క్రూరమైన రాజకీయ క్రీడకు కవిత బలయినట్టు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

సాధారణంగా దైవభక్తి ఉన్నవాళ్లకు పాపభీతి కూడా మెండుగా ఉంటుందన్న నానుడి ఉన్నది.తన కూతురు వ్యవహారంలో కేసీఆర్ ఇలా ప్రవర్తించడం వెనుక 'పురుషాధిక్య' భావజాలం ఎంత బలంగా పనిచేస్తున్నదో అర్థం చేసుకోవచ్చు. ఒక రాజకీయ పార్టీ అధ్యక్షునిగా డిస్టింక్షన్ మార్కులు సంపాదించినా, కుటుంబం విషయంలో ఆయన ఫెయిలు అయినట్లుగానే పరిశీలకులు భావిస్తున్నారు.

చలో చండీఘడ్



భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)
25వ కాంగ్రెస్
21–25 సెప్టెంబర్, 2025
చండీఘడ్ (పంజాబ్)

## చైర్మన్ పదవి పునరుద్ధరణ

# మలి చైర్మన్ ఎస్.ఎ.డాంగే

పార్టీ సంస్థాపక మహాసభ (1925 కాన్పూర్)లో ఎం.సింగారవేలు చెట్టియార్ పార్టీ నిబంధనావళి ప్రకారం సిపిఐ తొలి చైర్మన్‌గా పరిగణించబడగా, 1962లో జాతీయ సమితి సమావేశం చైర్మన్ పదవిని నిబంధనావళిలో చేర్చి ఆ పదవిలోకి సీనియర్ నాయకుడు శ్రీపాద అమృత్ డాంగేను, ప్రధాన కార్యదర్శిగా ఇ.ఎం.ఎస్.నంబూద్రిపాద్‌ను ఎన్నుకుంది. అది పార్టీ ఐక్యతను పరిరక్షించే ప్రయత్నం. పార్టీ లోపల చర్చనీయాంశాలుగా ఉన్న రెండు భిన్నమైన రాజకీయ పంథాలకు వారు ప్రతినిధులు.

### డాంగే జీవిత సంగ్రహం



డాంగే 1899 అక్టోబర్ 10న మహారాష్ట్రలోని నాసిక్‌లో జన్మించారు. 1917లో బొంబాయిలోని విల్సన్ కాలేజీలో చేరారు. జాతీయోద్యమనాయకులు బాలగంగాధర్ తిలక్, మహాత్మాగాంధీ ప్రభావంలోకి వచ్చారు. చివరకు మార్క్సిస్టు సిద్ధాంతాన్ని విశ్వసించారు. భారతదేశంలో తొలి మార్క్సిస్టు గ్రంథం ''గాంధీ VS లెనిన్'' రచించారు; తొలి మార్క్సిస్టు పత్రిక 'సోషలిస్టు' (1922) ఎడిట్ చేశారు. 1925 నుంచి సిపిఐ కేంద్ర కార్యవర్గ కమిటీలో ఉన్నారు. కాన్పూర్ కుట్ర కేసు (1924–28)లో అరెస్టు అయినారు. 1928లో గిర్ని కాంగార్ యూనియన్ నాయకునిగా జౌళి కార్మికుల సుదీర్ఘ సమ్మెకు నాయకత్వం వహించారు. మీరట్ కుట్ర కేసు (1929–33)లో మళ్లీ అరెస్టు చేశారు. 1940–42లో బ్రిటీష్ సామ్రాజ్యవాద పోలీసులు దియోలీ నిర్బంధ శిబిరంలో బంధించారు. సిపిఐ రాజకీయ పంథాను సరిదిద్దటానికి 1950లో అజ్ఞాతం నుంచి ముగ్గురు రాసిన ప్రసిద్ధ '3–పి' లేఖకుల్లో డాంగే ఒకరు. మిగతా ఇద్దరు అజయ్ ఘోష్, ఘాటే. 1950లో మాస్కోలో స్టాలిన్‌ను కలుసుకున్న నలుగురు సభ్యుల్లో డాంగే ఒకరు. మిగతా ముగ్గురు అజయ్‌ఘోష్, చంద్ర రాజేశ్వరరావు, మాకినేని బసవపున్నయ్య. ఆ తర్వాత తెలంగాణ సాయుధ పోరాట ఉపసంహరణ నిర్ణయం జరిగింది. ఎఐటియుసి ప్రధాన కార్యదర్శిగా డాంగే చాలాకాలం పనిచేశారు. 1963 సెప్టెంబర్ 13న సిపిఐ పార్లమెంటుకు నిర్వహించిన తొలి గ్రేట్ మార్చ్‌కి సూత్రధారి ఆయన. బంద్, ఘెరావో వంటి నూతన పోరాట రూపాలను రూపొందించారు. 1962 నుంచి 1982 దాకా పార్టీ చైర్మన్.

డాంగే 1946లో బొంబాయి ప్రావిన్షియల్ అసెంబ్లీ సభ్యునిగా ఎన్నికైనారు. 1957, 1967లలో లోక్‌సభకు ఎన్నికైనారు. గోవా విముక్తి పోరాటం, సంయుక్త మహారాష్ట్ర ఉద్యమాల్లో ప్రముఖ వ్యక్తి. పార్టీతో విభేదాలతో పార్టీకి దూరమై,ఆయన కుమార్తె రోజా దేశ్ పాండే ఏర్పాటు చేసిన ఎఐసిపిలో చేరారు. తర్వాత యుసిపిఐగా అది కొంతకాలం పని చేసి అంతర్ధానమైంది. 'ఆదిమ కమ్యూనిజం నుంచి బానిస వ్యవస్థ వరకు' డాంగే ప్రసిద్ధ రచన. ఆయన 1991 మే 22న మరణించారు.



### కేరళలో తొలి కమ్యూనిస్టు ముఖ్యమంత్రి

## ఇ.ఎం.ఎస్.నంబూద్రిపాద్

ఈలంకుళం మనక్కళ్ శంకర్ (ఇఎంఎస్) నంబూద్రిపాద్ 1909 జూన్ 13న ఎర్నాకుళంలో ఒక సనాతనవాద కుటుంబంలో నాల్గవ సంతానంగా జన్మించారు. ఇ.ఎం.ఎస్ సంస్కరణవాద ప్రభావంలోకి వచ్చారు. 1925లో స్కూలులో చేరారు. 1929లో ఎస్ఎస్‌సి పాసైనారు. సంస్కృతం, ఇంగ్లీషులో నిష్ణాతుడు; 1927లో మద్రాసులో ఎఐసిసి సమావేశాలకు హాజరైనారు. 1931 నవంబర్ 1న ప్రారంభమైన గురువయ్యూర్ ఆలయ ప్రవేశ సత్యాగ్రహంలో చురుకుగా పాల్గొన్నారు. 1932 జనవరి 4న కాలేజీ విద్యకు స్వస్తి చెప్పి పౌర శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్నారు. అరెస్టు చేసి కాలికట్, కన్ననూర్, వెల్లూరు తదితర జైళ్లు తిప్పారు. కృష్ణ పిళ్లయ్, ఎ.కె.గోపాలన్, కిరణ్‌దాస్, ఆర్‌సి ఆచార్య, ఎన్‌జి రంగా తదితరులను కలుసుకున్నారు. త్వరలోనే కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో చేరారు. 1934 మే నెలలో పట్నాలో సిఎస్‌సి తొలి అఖిలభారత సదస్సులో ఇఎంఎస్ పాల్గొన్నారు. 1955లో మద్రాసులో కృష్ణ పిళ్లయ్, ఎస్.వి.ఘాటే, పుచ్చలపల్లి సుందరయ్యను కలుసుకున్నారు.1936 జనవరిలో సిపిఐ సభ్యత్వం తీసుకున్నారు.


మలబార్ నుంచి 1939 ఫిబ్రవరిలో ఇఎంఎస్ మద్రాసు అసెంబ్లీకి ఏకగ్రీవంగా ఎన్నికైనారు.1942లో సిపిఐపై నిషేధం ఎత్తివేయబడింది. సిపిఐ తొలి కాంగ్రెస్‌లో (బొంబాయి 1943) ఇఎంఎస్ పార్టీ కేంద్ర కమిటీలోకి తీసుకోబడ్డారు.1951లో పోలిట్ బ్యూరో సభ్యుడైనారు. మధురై (1953), పాల్ఘాట్ ( (1956), అమృతసర్ (1958), విజయవాడ (1961) పార్టీ మహాసభల్లో పోలిట్‌బ్యూరోలో కొనసాగారు.

1957 సార్వత్రిక ఎన్నికల్లో కేరళ అసెంబ్లీలో కమ్యూనిస్టుపార్టీ మెజారిటీ సాధించి చరిత్ర సృష్టించగా, పార్టీ ఇఎంఎస్‌ను ముఖ్యమంత్రిగా నిర్ణయించింది. ఆ ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ, విద్యా సంస్కరణల బిల్లులకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు వ్యతిరేకులంతా ఏకమై 'విముక్తి ఉద్యమం' లేవదీయటంతో ఆ ప్రభుత్వాన్ని 1959లో కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బర్తరఫ్ చేసి రాష్ట్రపతి పాలన విధించింది.

1962లో అజయ్ ఘోష్ మరణించాక పార్టీ చైర్మన్‌గా ఎస్.ఎ.డాంగే, ప్రధాన కార్యదర్శిగా ఇఎంఎస్ నంబూద్రిపాద్ ఎన్నికైనారు. 1964లో, పార్టీలో చీలికకు సంకేతంగా పార్టీ జాతీయసమితి నుంచి వాకౌట్ చేసిన 32 మందిలో నంబూద్రిపాద్ ఒకరు. అటు తర్వాత వారు ఏర్పరుచుకున్న సిపిఐ(ఎం)లో పోలిట్‌బ్యూరో సభ్యునిగా ఉన్నారు. 1967 నుంచి 1969 వరకు మరో పర్యాయం 7 పార్టీల సంకీర్ణ ప్రభుత్వానికి ముఖ్యమంత్రిగా పనిచేశారు. 1977లో పి.సుందరయ్య పార్టీ ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేశాక ఆ పదవిలోకి ఇఎంఎస్ ఎన్నుకోబడ్డారు. 1992 వరకు ఆ పదవిలో ఉన్నారు. ఇఎంఎస్ 1998 మార్చి 19న కన్నుమూశారు.

## చంద్ర రాజేశ్వరరావు

### సుదీర్ఘకాలం ప్రధాన కార్యదర్శి



చంద్ర రాజేశ్వరరావు ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లా మంగళాపురంలో 1914 జూన్ 6వ తేదీన సంపన్న రైతు కుటుంబంలో జన్మించారు. 'సిఆర్'గా ఆయన ప్రసిద్ధులు. బెనారస్ హిందూ యూనివర్శిటీలో, ఆ తర్వాత విశాఖ పట్నం మెడికల్ కాలేజీలో విద్యనభ్యసించారు. 1934లో బిహెచ్‌యులో ఉండగానే సిపిఐ సభ్యత్వం స్వీకరించారు. అక్కడ సోషలిస్టు స్టడీ సర్కిల్‌లో మార్క్సిజం అధ్యయనం చేశారు.

ఆంధ్రా యూనివర్శిటీలో ఉండగా, సిఆర్ కార్మికులను, ట్రేడ్ యూనియన్‌లను ఆర్గనైజ్ చేశారు. 1937 జులై 3న ఇచ్ఛాపురం నుంచి మద్రాసుకు ప్రారంభమైన రైతు రక్షణ యాత్రలో సిఆర్ చురుకుగా పాల్గొన్నారు. 1500 మైళ్లు కాలినడకన, 525 మైళ్లు బస్సు ప్రయాణంతో సాగిన ఆ చరిత్రాత్మక రైతు యాత్ర 1938 మార్చి 27న రాష్ట్ర రాజధాని మద్రాసులో ముగిసింది. 1940 ప్రారంభంలో చల్లపల్లి రాజాకు వ్యతిరేకంగా పోరాటంలో సిఆర్ అరెస్టు అయినారు. సిపిఐ ఆంధ్ర రాష్ట్ర రెండవ మహాసభ (1938)లో ఏడుగురు సభ్యులతో కూడిన రాష్ట్ర కమిటీకి ఎన్నికైనారు. 1943లో ఆంధ్ర రాష్ట్ర సిపిఐ కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు. 1948 బుద్ధవరం, 1956 రేవేంద్రపాడు మహాసభలో తిరిగి కార్యదర్శి అయినారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ అనంతరం 1956 జులై 2న హైదరాబాద్‌లో ఆంధ్ర, తెలంగాణ సిపిఐ రాష్ట్ర కమిటీల విలీనంతో జరిగిన ఐక్య మహాసభలో రాజేశ్వరరావు కార్యదర్శిగా ఎన్నికైనారు.

1939లో కృష్ణాజిల్లా తునికిపాడులో రాజేశ్వరరావు నిర్వహించిన రాజకీయ పాఠశాలకు రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి హాజరైనారు. 1940ల్లో ఎ.గురవారెడ్డి సహాయంతో రామిరెడ్డి అనే మారుపేరుతో రెడ్డి హాస్టల్‌లో చేరిన సిఆర్ తెలంగాణాలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి పునాదులు వేశారు. 1952 తర్వాత మద్రాసు రాష్ట్ర శాసనమండలికి ఎన్నికైనా, ఇది మనకు సరిపడేదికాదని కొద్దికాలంలోనే రాజీనామా చేశారు. 1946–50 తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నిర్వాహకుల్లో ఒకరిగా ముఖ్యభూమిక వహించారు.

రాజేశ్వరరావు 1950లో తొలిసారి సిపిఐ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనారు. బిటిఆర్‌ను తొలగించిన పార్టీ నాయకత్వం రాజేశ్వరరావును తాత్కాలికంగా ఎన్నుకుంది. అయితే బిటిఆర్ 'సాయుధ తిరుగుబాటు' బదులు 'గెరిల్లా సాయుధ పోరాటం' పంథా ముందుకు తెచ్చారు. 'ఆంధ్రా లైన్' అని దానికి పేరు. తెలంగాణ పోరాటంపై స్టాలిన్‌ను కలిసిన నలుగురులో ఆయన ఒకరు. 1958 నుంచి 1964 వరకు పార్టీ కేంద్ర కమిటీలో ఉన్నారు. పార్టీ చీలిక అనంతరం 1964లో 7వ మహాసభలో ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై 1990 వరకు ఆ బాధ్యతల్లో కొనసాగారు. చైనా, పాకిస్థాన్ దురాక్రమణ యుద్ధాలను ఖండించారు. అనేక ప్రజా ఉద్యమాలు నిర్మించారు. ఆర్డర్ ఆఫ్ లెనిన్ సహా అనేక అవార్డులు పొందారు. 1994 ఏప్రిల్ 9న హైదరాబాద్‌లో అస్తమించారు.



# స్థానికం REGIONAL NEWS

ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## ఇందిరమ్మ ఇళ్ల ను శర వేగంగా పూర్తి చేయాలి
### ఎంపిడిఒ యం.యర్రయ్య

**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** కొంగర, కట్టుకాచారం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల ను పరిశీలించారు. లబ్దిదారులకు పలు సూచనలు చేశారు. అనంతరం వన మహోత్సవం కార్యక్రమం ను విజయవంతంగా పూర్తి చేయాలని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య సూచించారు. మండలం లోని బుద్దారంరాయగూడెం రహదారి వెంట వన మహోత్సవంలో భాగంగా నాటుతున్న మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల ను శర వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యం ను నెరవేర్చేందుకు లబ్దిదారులు వేగవంతంగా చేపట్టాలని అన్నారు. గ్రామాలలో రహదారికి ఇరువైపులా మొక్కలను నాటాలని సూచించారు. నాటిన ప్రతీ మొక్కకు కంచెను ఏర్పాటు చేయాలని సూచించారు. వాటి సంరక్షణ విషయంలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. పారిశుద్ధం పనులు యుద్ధప్రాతిపధిక ను చేపట్టాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ టీఏ.గోపి, క్షేత్ర సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సునందకు తెలుగు యూనివర్సిటీ కీర్తి పురస్కారం



**ప్రజాపక్షం/ ఖమ్మం అ ర్బన్ :** ప్రముఖ రచయిత్రి, కవయిత్రి, ఉత్తమ ఉ పాధ్యాయురాలు పూరి మ ళ్ల సునందకు 2024 సం వత్సరానికి గాను తెలుగు యూనివర్సిటీ కీర్తి పురస్కారం ప్రకటించింది. వివిధ రంగాల్లో విశేషమైన కృషి చేస్తున్న వారికి ఈ పురస్కారం అందజేస్తారు. పూరిమళ్ల సునంద ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూనే సాహిత్యంలో రాణిస్తున్నారు. కవయిత్రిగా, రచయిత్రిగా, బాల సాహితివేత్తగా విశేష కృషి చేస్తున్నారు. తాను పనిచేసే ప్రతి పాఠశాలలో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీస్తూ సాహిత్యంలో రాణించేలా ప్రోత్సహిస్తున్నారు. ప్రతి యేటా తన సోదరి పూరిమళ్ల పద్మజ పేరుతో ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేస్తున్నారు. పూరిమళ్ల ఫౌండేషన్‌లో 2019లో స్థాపించి లబ్ద ప్రతిష్టులైన సాహితీవేత్తలకు భోగోజు సముద్రమ్మ పురుషోత్తం స్మారక నగదు పురస్కారాన్ని అందజేస్తున్నారు. ఇటు ఉపాధ్యాయ రంగంలోనూ, అటు సాహి త్య రం గంలోనూ విశేష కృషి గావిస్తున్న పూరిమళ్ల సునందకు తెలుగు పురస్కారం లభించింది. 23, 24 తేదీల్లో జరిగే ఉత్సవంలో కీర్తి పురస్కారాన్ని సునంద అందుకోనున్నారు. కీర్తి పురస్కారం ప్రకటించడం పట్ల జిల్లాలోని ఉపాధ్యాయులు, కవులు, రచయితలు సునందకు శుభాకాంక్షలు తెలిపారు.

## అక్షరాస్యులుగా మార్చేందుకు వివోఏలకు శిక్షణ

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిరక్షరాశులను అక్షరాసులుగా మార్చేందుకు శిక్షణ కార్యక్రమాన్ని మండల విద్యా శాఖ అధికారి నివేదిత ప్రారంభించారు. మండల పరిధిలోని 23 గ్రామ సమాఖ్యలు లో గ్రామపంచాయతీలలో గ్రామ సమాఖ్య అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం శిక్షకులు సుధాకర్, మౌలాలిలు నిర్వహించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 2027 సంవత్సరం వరకు పూర్తిస్థాయిలో అక్షరాసులుగా మార్చేందుకు నూరు శాతం అక్షరాస్యత సాధనే లక్ష్యంగా ప్రాథమిక విద్య వరకు జీవన నైపుణ్యాలు 15 సంవత్సరాలు దాటిన వారికి ప్రాథమిక విద్యను పూర్తి చేయాలని లక్ష్యంతో అనుకూలమైన సమయంలో విద్య నేర్చుకోవాలని ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ సమాఖ్యలు, వివోఏలు పాల్గొన్నారు.

## ఘనంగా అటవీ అమరవీరుల దినోత్సవం




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణంలోని అటవీ శాఖ కార్యాలయంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో అటవీ అమరవీరుల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యురాలు డా. మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా. మట్టా దయానంద్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, కల్లూరు ఏసీపీ రఘులు పాల్గొని అటవీ శాఖ ఉద్యోగులకు అటవీ అమరవీరుల స్తూపం వద్ద ఘన నివాళులర్పించారు. అనంతరం అటవీ అధికారులకు అటవీ శాఖ ఆధ్వర్యంలో రెయిన్ కోట్, టార్చ్ లైట్, వాటర్ బాటిల్ అందించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, ఎఫ్.ఎడి.ఓ మంజుల, సత్తుపల్లి రేంజ్ ఎఫ్ ఆర్ ఓ స్నేహలత, తల్లాడ రేంజ్ ఎఫ్ఆర్ఓ ఉమా, డిఆర్ఓ పిచ్చేశ్వరరావు, డిఆర్ఓ రామ్ సింగ్, డిఆర్ఓ శ్రీను, సెక్షన్ అదికార్లు నాగరాజు, అరుణ్, నరసింహారావు, బీట్ ఆఫీసర్స్, క్యాంప్ ఆఫీసర్స్, ప్రైవేట్ వాచ్ మెన్, సత్తుపల్లి పట్ట ణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలా రాణి,మాజీ కౌన్సిలర్స్ నాగుల్ మీరా, సీనియర్ నాయకులు చల్లగుల్ల నరసింహారావు, కమల్ పాషా, చల్లగుళ్ల కృష్ణయ్య, పింగిలి సామెలు, గఫార్, భాస్కర్, సత్తుపల్లి పట్టణ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు బట్టీలగుంపు ప్రజల కృతజ్ఞతలు



**ప్రజాపక్షం/అశ్వాపురం:** రాంనగర్ నుండి బట్టీల గుంపు వరకు గల రోడ్డుకు ఒక కోటి యాభై లక్షలు పినపాక ఎంఎల్ఏ పా యం వెంకటేశ్వర్లు మం జూరి చేశారు. ఇరు గ్రా మాల ప్రజలు ఎంఎల్ఏ పాయంకు కృతజ్ఞతలు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో తీవ్ర ఇబ్బందులు పడినప్పటికీ గత ప్రభుత్వ హయాంలో పట్టించుకోలేదన్నారు. గతంలో మిట్టగూడెం నుండి కుమ్మరిగూడెం వరకు బీటీ రోడ్డుకు సుమారు 6 కోట్ల రూపాయలు మంజూరి చేసిన ఘనత ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లుకే దక్కుతుందన్నారు. రాంనగర్ నుండి రాయిగూడెం వరకు మెటల్ రోడ్డు కూడా పాయం వెంకటేశ్వర్లు కృషితోనే జరిగిన విషయం గుర్తు చేసుకున్నారు. ఈ రోడ్డు కుమ్మరిగూడెం, బట్టీలగుంపు, రాంనగర్, జానకిరామయ్య గుంపు, పాములపల్లి, కాకర్ల, సుందరయ్య గుంపు, కొత్త గుంపు ప్రజలకు మణుగూరు రాకపోకలకు సౌకర్యంగా ఉంటుందని ఈసందర్భంగా ఈ రోడ్డుకి కూడా నిధులు కేటాయించి బీటీ రోడ్డు మంజూరి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈసందర్భంగా బట్టీలగుంపు పంచాయితీ మాజీ సర్పంచ్ బట్ట సత్యనారాయణ, కొమరం భాస్కరరావు, కలివేటి సాంబశివరావు, కనితి కృష్ణవేణి, కలివేటి సమ్మక్క, కోరం దేవమ్మ, కలివేటి వెంకటేశ్వర్లు, ఇరు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన దమ్మపేట మండల ఉపాధ్యాయులు



**ప్రజాపక్షం/దమ్మపేట:** ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్ 202526 కు దమ్మపేట మండలం లోని ఉపాధ్యాయులు బి. వినోద్ కుమార్ జడ్పిహెచ్ఎస్ ప ట్వారిగూడెం పాఠశాల నుండి, అదే విధంగా నాగుపల్లి పాఠశాల నుండి సిహెచ్. రాము, సోషల్ ఉపాధ్యాయులు దమ్మపేట మండలం నుండి ఆల్ ఇండియన్ సివిల్ సర్వీస్ టోర్నమెంట్ లో భాగంగా జిల్లా స్థాయిలో ఓపెన్ క్యాటగిరీలో సిహెచ్. రాము బ్యాడ్మింటన్ క్రీడాలో ఎంపిక కావడం జరిగింది. అలాగే 45 ప్లస్ ఏజ్ విభాగంలో బి. వినోద్ కుమార్ జిల్లా స్థాయిలో బ్యాడ్మింటన్ క్రీడలో మొదటి స్థానాలు సాధించడం జరిగింది. బ్యాడ్మింటన్ క్రీడా విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం జరిగింది. ఈ నెల 9, 10 తేదీలలో రాష్ట్రస్థాయిలో బ్యాడ్మింటన్ క్రీడా విభాగంలో ఆడి జిల్లా ప్రథమ స్థానం సాధించారు. వీరు ఇరువురు రాష్ట్రస్థాయిలో ఆడి అక్కడ కూడా మొదటి స్థానాలలో నిలవడం జరిగింది. తరువాత జాతీయస్థాయి బ్యాడ్మింటన్ క్రీడా విభాగంలో కూడా ఎంపిక కావడం విశేషం. అలానే జెడ్పిహెచ్ఎస్ మల్కారం నుండి 45 ప్లస్ విభాగంలో రన్నింగ్ ద్వితీయ శ్రేణిలో నిలిచిన ఎం.నాగచారి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగింది.

# అడవుల సంరక్షణే నిజమైన నివాళి

### అటవీ సంపదను కాపాడుకోవాలి
### అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో కలెక్టర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అడవుల సంరక్షణ అటవీ అమరులకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయం నందు అటవీ అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా అటవీ సిబ్బంది త్యాగాలను స్మరించుకుంటూ గురువారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, డిఎఫ్ వో సిద్దార్థ్ విక్రం సింగ్ లతో కలిసి పాల్గొన్నారు. అటవీ అమరవీరుల స్తూపం వద్ద జిల్లా కలెక్టర్ పుష్పగుచ్చం ఉంచి నివాళులర్పించారు. అమరవీరుల సంస్మరణార్థం రెండు నిమిషాలు మౌనం పాటించి అటవీ వన్యప్రాణి రక్షణ ప్రమాణ స్వీకారం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2022లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌గా ఉన్న సమయంలో శ్రీనివాసరావు అనే అటవీ అధికారి అకాల మరణం చెందారని వారి మరణం తనను కలిచివేసిందన్నారు. అటవీ పరిరక్షణ మీద అనేక సమస్యలు పరిష్కరించినట్లు తెలిపారు. అడవుల సంరక్షణకు నిర్విరామంగా కృషి చేస్తున్న అటవీశాఖ సిబ్బందికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. అటవీశాఖ సిబ్బందిని సైలెంట్ హీరోస్‌గా కలెక్టర్ అభివర్ణించారు. రా త్రి పగలు అనే తేడా లేకుండా అటవీ పరిరక్షణ కోసం అటవీశాఖ సిబ్బంది వీరోచితంగా పని చేయడం జరుగుతుందన్నారు. అడవులను నరుక్కుంటూ పోతే మన మనుగడ కష్టమవుతుందని మానవ జీవన విధానంలో చెట్లు చాలా కీలకమన్నారు. జిల్లాలో వన సంపద కాపాడే బాధ్యత మనందరిపై ఉందన్నారు. పర్యావరణాన్ని కా పాడుతూ ఏకో టూరిజం అభివృద్ధికి కృషి చే యాలన్నారు. జిల్లాలో అనేక చోట్ల డిజిటల్ డి టాక్స్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. అటవీ అమరవీరుల స్ఫూర్తితో అడవుల సంరక్షణకు అధికారులంతా కృషి చేయాలన్నారు. జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రం సింగ్ మాట్లాడుతూ అటవీ అమరవీరుల త్యాగం మనందరికి స్ఫూర్తి అన్నారు. అటవీ సంరక్షణ ఒక బాధ్యత మాత్రమే కాదని ప్రతి పౌరుడి కర్తవ్యమన్నారు. అనంతరం అటవీ సిబ్బందికి సంరక్షణ పరికరాలు, రెయిన్ కోట్లు, స్టిక్ గార్డ్స్‌లను కలెక్టర్ పంపిణీ చేశారు. జిల్లా మానిటరింగ్, అటవీ రక్షణలో వినియోగించే కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను కలెక్టర్ సందర్శించారు. సిసి కెమెరా పని తీరు ప్రక్రియను పరిశీలించారు.



# ఆరోగ్యమే మహాభాగ్యం

### గిరిబిడ్డల ఆరోగ్యంపై ఐటిడిఏ పిఓ దృష్టి
### 115 విద్యాసంస్థల్లో రూ.13 లక్షలతో మెడికల్ కిట్లు ఏర్పాటు

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఆరోగ్యమే మహాభాగ్యం ఆరోగ్య వంతమైన సమాజం ఉన్న నాడు ఆరోగ్యవంతమైన ఎదుగుదల, అభివృద్ధి ఉంటుంది. గిరిజన విద్యాలయాల్లో చదువుకుంటున్న గిరిబిడ్డల ఆరోగ్య రక్షణకు ఐటిడిఓ పిఓ రాహుల్ పెద్దపీట వేస్తూ దూరదృష్టితో 115 విద్యాలయాల్లో మెడికల్ కిట్లు ఏర్పాటు చేశారు. ఇందు కోసం రూ.13 లక్షలను వెచ్చించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 115 గిరిజన విద్యాలయాలకు మెడికల్ కిట్లు కొనుగోలు చేసి అందజేశారు. ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లు, పోస్టుమెట్రిక్, ప్రీ మెట్రిక్ హాస్టళ్లకు సరఫరా చేశారు. ఇల్లెందు డివిజలో 13 ఆశ్రమ పాఠశాలలు, 10 హాస్టళ్లకు, దమ్మపేట డివిజన్‌లో 18 ఆశ్రమ పాఠశాలలకు, 12 హాస్టళ్లకు, భద్రాచలం డివిజన్‌లో 12 ఆశ్రమ పాఠశాలలకు, 10 హాస్టళ్లకు, 4 ప్రీ మెట్రిక్ హాస్టళ్లకు, ఖమ్మం జిల్లాలో 30 హాస్టళ్లకు, ఆశ్రమ పాఠశాలకు ఈ మెడికల్ కిట్లు అందించారు. మారుమూల అటవీ ప్రాంతంలో ఉన్న గిరిజన సంక్షేమశాఖ విద్యాలయాల్లో బాలికలు చెప్పుకోలేని సమస్యలతో సతమతం అవుతుంటారు. అలాంటి క్రమంలో ఐటిడిఏ నుండి అందించిన కిట్ల ద్వారా ఆ ఇబ్బంది తీరుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సుమారు 28 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి నాణ్యమైన విద్యతోపాటు మంచి పౌష్టికాహారం అందిస్తున్నారు. గిరిజన విద్యార్థులకు వరంగా మారాయి.

## రేపు ఖమ్మంలో సురవరం సంస్మరణ సభ

**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ సెప్టెంబర్ 13న ఖమ్మంలో జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు లు ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో ఈనెల 13 శనివారం సాయంత్రం నాలుగు గంటలకు సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ జరుగుతుందని ఈ సభకు రైతు సంఘం బాధ్యులు పెద్ద ఎత్తున తరలి రావాలని వారు పిలుపునిచ్చారు. ప్రజా ఉద్యమాలకే ఊపిరిగా నిలిచిన అమరజీవి కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి కి ఘనంగా నివాళులర్పించేందుకు రైతు సంఘం ఆఫీస్ బేరర్స్ కౌన్సిల్ సభ్యులు, మండల అధ్యక్ష, కార్యదర్శులు, గ్రామశాఖ అధ్యక్ష, కార్యదర్శులు ప్రత్యేక బాధ్యత తీసుకుని ఈ సంస్మరణ సభను జయప్రదం చేయాలని వారు కోరారు.

## బహుజన బతుకమ్మ వేడుకలకు భారీగా తరలిరండి

**ప్రజాపక్షం/పాల్వంచ :** ఈ నెల 20 నుండి అక్టోబర్ 30 వరకు నిర్వహించే బహుజన బతుకమ్మ కార్యక్రమంలో భాగంగా ఉల్వనూర్‌లో 25వ, తేదీన జరిగే బతుకమ్మ వేడుకలకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ పగిడేరు అరుణక్క, రైతు కూలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెల్తూరు సదానందలు పిలుపునిచ్చారు. మండల పరిధి ఉల్వనూర్‌లో బహుజన బతుకమ్మ కరపత్రాలను పాల్వంచలో గురువారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సహజ సంపదను దోపిడి చేసేందుకు ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలను హతమారుస్తున్నదని ఆరోపించారు.కార్పోరేట్ శక్తులకు పాలక వర్గాలు ఊడిగం చేస్తున్నాయని మండిపడ్డారు. పాలకుల నిరంకుశత్వానికి నేడు ఆదివాసీలు పరాయీకరణ చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు కూలి సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ మండల యుగంధర్, పిడబ్ల్యూ నాయకురాలు వాసం రుద్ర, టియుఎఫ్ రాష్ట్ర నాయకులు కొండన్న, ఆదివాసీ నాయకులు వాసం మంగయ్య పాల్గొన్నారు.



# బానిస సంకెళ్ళ విముక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటం



**ప్రజాపక్షం/ మధిర :** హింస, వెట్టిచాకిరి, అణిచివేత నుంచి పుట్టిన చైతన్యమే తెలంగాణ సాయుధ పోరాటమని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు అన్నారు. మధిర మండలంలోని తొండలగోపవరం గ్రామంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు తెలంగాణ సాయుధ పోరాట యోధుడు నల్లమల గిరి ప్రసాద్ స్మారక స్థూపం వద్ద గురువారం ప్రారంభమయ్యాయి. ముందుగా నల్లమల గిరిప్రసాద్ స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారోత్సవాలకు సూచికగా అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.ఎ.రహీం, మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు అధ్యక్షతన జరిగినన సభలో బెజవాడ రవిబాబు మాట్లాడుతూ రైతాంగ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టుల పాత్ర గొప్పదని, భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం తమ ప్రాణాలు అర్పించి పోరాటం కొనసాగించారని అన్నారు. ఆనాటి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గార్ల బయ్యారం, ఇల్లెందు ప్రాంతాల్లో నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా ఉద్యమాలు జరిగాయని, దీంతో రజాకార్ల తూటాలకు 50మంది దాకా బలయ్యారని, వారి మృతదేహాలను గ్రామాల్లో ఊరేగించి పైశాచికానందం పొందారని తెలిపారు. మధిర నియోజకవర్గంలో ప్రతి ఊరు నిజాంకు వ్యతిరేకంగా ఉద్యమంచేసిందని, మధిర పక్క నుండే అల్లీనగరం గ్రామస్తులు రజాకార్లను తరమి తరమి కొట్టారని, తర్వాత మరింత సేనలతో వచ్చి ఇళ్లు తగులబెట్టి గ్రామంలో విధ్వంసం సృష్టించారని తెలిపారు. మధిర ప్రాంతం నుండి నల్లమల గిరిప్రసాద్, వాసిరెడ్డి వెంకటపతి ఇంకా అనేక మంది నేతలు రజాకారులను తరిమి కొట్టారని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటం ఫలితంగానే 10లక్షల భూములను పేదవారికి పంచినట్లు గుర్తు చేశారు. రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పెరుమాళ్ళపల్లి ప్రకాశరావు, మంగళగిరి రామాంజనేయులు, చెరుకూరి వెంకటేశ్వర్లు, మడుపల్లి లక్ష్మ ణ్, తలారి రమేష్, కొండూరి నాగేశ్వరరావు, రంగు నాగకృష్ణ, పరుచూరి రాము, జిల్లా బ్రహ్మం, గోపి తదితరులు పాల్గొన్నారు.

# తాటిపూడి గ్రామంలో పర్యటించిన ఎంపిడివో

### నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్ పరిశీలన
### లోతట్టు ప్రాంతాలకు నీటి సరఫరాపై కలెక్టర్‌కు నివేదిక



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండల తాటిపూడిలో గ్రామంలో నిరుపయోగంగా ఉన్న నూతన వాటర్ ట్యాంక్‌ను మండల పరిషత్ అధికారి సక్రియ, ఎంపివో రాజేశ్వరి మిషన్ భగీరథ అధికారులు, గ్రామపంచాయతీ సెక్రటరీతో కలిసి నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను పరిశీలించారు. ట్యాంకుకు నీళ్లు ఎందుకు ఎక్కడం లేదు అనేదానిపై ఎంపిడివో పూర్తిస్థాయిలో పర్యవేక్షణ జరిపి పైప్‌లైన్ హెవీ వాహనాలు తిరగడంతో పగిలిపోవడం జరుగుతూ తరచుగా లీక్ అవుతున్నాయని దానివలన నీటి సరఫరాకు అంతరాయం జరుగుతుందని తెలిపారు. లోతట్టు ప్రాంతాల వరకే ఈ నూతన ట్యాంక్ నుంచి వాటర్ పోవడం జరుగుతుందని ట్యాంక్ ఎగువ ప్రాంతానికి నీటి సరఫరా జరగడం లేదని, దానికి సంబంధించిన ఎయిర్ వాల్స్‌కు సంబంధించి ఎస్టిమేషన్ తయారు చేయడం జరిగిందని, త యారు చేసిన నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపిస్తున్నామని త్రాగునీటికి ఎలాంటి ఇబ్బంది రాకుండా ప్రస్తుతం గ్రామంలోని పాత ట్యాంక్ ద్వారా నీటి సరఫరా జరుగుతుంది. నూతన ట్యాంకును పూర్తిస్థాయిలో వాడుకలోకి తీసుకొస్తాం. ప్రస్తుతానికి నూతన ట్యాంక్‌లోకి నీటిని ఎక్కించడం జరిగింది. ఈ ట్యాంక్‌లోకి ఎక్కిన నీరు లోతట్టు ప్రాంతాల వరకే సరఫరా జరుగుతుంది. జిల్లా కలెక్టర్‌కు పంపిన నివేదికకు సంబంధించి అనుమతి రాగానే నూతన ఎయిర్ వాల్స్ ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో గ్రామ ప్రజలకు త్రాగునీటి అందించడం జరుగుతుందని ఎంపిడివో సక్రియ తెలిపారు. గ్రామంలో ఎంపిడివో సక్రియ, ఎంపివో రాజేశ్వరి పర్యటించి పారిశుధ్యం ఎక్కడ తలెత్తకుండా ఉండేవిధంగా చర్యలు చేపట్టాలని పంచాయతీ సెక్రటరీని ఆదేశించారు.

ప్రజాపక్షం ఎఫెక్ట్

# పేదలందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలి

### తహశీల్దార్ కార్యాలయం ముందు సిపిఎం ధర్నా
### రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య

**ప్రజాపక్షం/మణుగూరు:** పేదలందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. గురువారం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాలు లేని పేదలు సిపిఎం కార్యాలయం నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రంలో ప్రజలందరికీ ఇంటి స్థలాలు ఇండ్లు నిర్మించిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం పేదలందరికీ ఇంటి స్థలం ఇవ్వడం మరిచిందని విమర్శించారు. పేదలందరికీ ఒకే సారి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మండలంలో గుర్తించిన ప్రభుత్వ స్థలాలను కాపాడాలని వాటిని నిరుపేదలకు కేటాయించాలని ఆయన కోరారు. అదే విధంగా రాష్ట్రప్రభుత్వం పేదలందరికీ 18 రకాల వస్తువులు రేషన్ షాపుల ద్వారా సరఫరా చేయాలని కోరారు. పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వక పోతే సిపిఎం ఆధ్వర్యంలో దశలవారి ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ పోరాటం ఉధృతం కాకముందే ప్రభుత్వ స్థలాలను ప్రజలకు పంచే కార్యక్రమం ప్రారంభించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రేపాకుల శ్రీనివాస్, మండల కార్యదర్శి సత్ర పల్లి సాంబశివరావు, సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్య లు పిట్టల నాగమణి, మాచారపు లక్ష్మ ణరావు, పల్లె చంద్రయ్య, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి



### అభివృద్ధి పనులపై జిల్లా కలెక్టర్ సమీక్ష

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వివిధ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని నిర్మాణం ఆలస్యమైతే ఖర్చులు పెరిగి ప్రభుత్వంపై భారం పడుతుందన్నారు. జిల్లాకు మంజూరైన 41 అంగన్‌వాడీ కేంద్రాల్లో 40,101 గ్రామ పంచాయతీ భవనాల్లో 70 నిర్మాణంలో ఉన్నాయన్నారు. 30 జిపి భవనాలు, ఒక అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణం పూర్తయిందన్నారు. పెండింగ్ పనులు వేగవంతంగా పూర్తి చేసి డిసెంబర్ చివరి నాటికి జిపి భవనాలు, అంగన్‌వాడీ కేంద్ర నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. 11 కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లలో ఐదు పూర్తి చేశామని నాలుగు నిర్మాణాలు ప్రారంభం కాకపోవడానికి గల కారణాలు తెలుసుకున్నారు. . సత్తుపల్లి, మధిర, పాలేరు ప్రాంతాల్లో వర్కింగ్ ఉమెన్ హాస్టల్ ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించి ప్రతిపాదనలు అందించాలన్నారు. ఖమ్మం నగరంలో ఆర్అండ్‌బి రోడ్డు నిర్వహణ మరమ్మతు పనులు కార్పోరేషన్ చేపట్టాలన్నారు. 50 సబ్ సెంటర్ పనుల్లో 38 పూర్తి చేశామని మరో 12 సబ్ సెంటర్ పనులు పూర్తి చేసి వైద్యశాఖకు అప్పగించాలన్నారు. 50 శాతం పూర్తయిన అభివృద్ధి పనులపై దృష్టిపెట్టి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇరిగేషన్ శాఖకు సంబంధించి అక్టోబర్ తర్వాత చెక్‌డ్యాం పనులు ప్రారంభించాలన్నారు. భూసేకరణ సర్వే త్వరగా పూర్తి చేయాలన్నారు. సీతారామ పనులు ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో సిపివో ఎ. శ్రీనివాస్, డిఆర్‌డివో సన్యాసయ్య, డిడబ్ల్యూవో రాంగోపాల్ రెడ్డి, యాకోబు, వెంకటరెడ్డి, వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభాలపై పిచ్చి తీగలు తొలగింపు

ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని తెలగవరం వద్ద, దారుక బంజ రు వద్ద విద్యుత్ స్తంభాలపై పిచ్చి తీగలు అలుముకొని విద్యుత్ శాఖ నిర్లక్ష్యానికి నిలువుటద్దం అనే ప్రజాపక్షం వార్తకు విద్యుత్ శాఖ స్పందించి పిచ్చి తీగలను తొలగించా రు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందుగానే సవరించడం పట్ల పెద్ద కోరుకొండి విద్యుత్ శాఖ అధికారికి ప్రజలు ధన్యవాదములు తెలిపారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/ఏన్కూరు:** మండల పరిధిలోని తిమ్మరపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇస్సన్నపల్లి కృష్ణ చిత్రపటానికి గురువారం వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కృష్ణ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన విషయం ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి ధైర్యంగా ఉండాలని కోరారు. కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు స్వర్ణ నరేందర్, ఏ బ్లాక్ అధ్యక్షులు వేముల కృష్ణ ప్రసాద్, తిమ్మారావుపేట మాజీ ఎంపీటీసీ లచ్చిరాం నాయక్, నాయకులు వీరు నాయక్, దళపతి భువనేశ్వర్ రాజు, నన్నె ఖాన్, గోపి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు మౌళిక వసతులు కల్పించాలి

**ప్రజాపక్షం/గుండాల :** కొడవటంచ ప్రాథమికోన్నత పాఠశాలకు మౌళిక సౌకర్యాలు కల్పించాలని గ్రామస్తులు,ఉపాధ్యాయులు వేడుకొంటున్నారు. పాఠశాలలో డెబ్బైకి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని , ఆట స్థలము లేకపోగ పాఠశాలకు ఉన్న కొద్దిపాటిస్థలములో నర్సరి పెట్టడంతో విషసర్పాలు, క్రిమి కీటకాలు సంచరిస్తుండటంతో ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనని ఉపాద్యాయులు భయాందోళన చెందుతున్నారు.

దీనితో పాటు పాఠశాలకు చుట్టూ ప్రహారి గోడకూడ లేదని కుక్కల, పశువుల సంచారం ఉందని విద్యార్ధు లకు హాని జరగకుండా ముందస్తుగా అధికారులు స్పందించి పాఠశాలలో ఉన్న నర్సరీని తొలగించాలని , ప్రహారి గోడ నిర్మాణం కోసం ప్రత్యేక చొరవ చూపాలని ఉపాధ్యాయులు వేడుకొంటున్నారు.

## ఎంపిడిఒ కార్యాలయం చుట్టూ ప్రమాదకరంగా కరెంటు తీగలు



**ప్రజాపక్షం/ఎల్కతుర్తి :** ఎల్కతుర్తి ఎంపి కార్యాలయం చుట్టూత ప్రమాదకరంగా వేలాడుతున్న కరెంట్ తీగలు. సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రజలకు కరెంట్ తీగలు తగిలి, ప్రమాదానికి గురైతే బాధ్యులు ఎవరు అని ప్రజలు ఆవేదనకు గురవుతున్నారు. వేలాడుతున్న కరెంటు వైర్లను నిత్యం చూస్తున్న, ఎంపిడిఒ, మిగతా హోదాలో ఉన్న అధికారులు. చూస్తూ పట్టించుకోకపోవడం చాలా బాధాకరమని, అంతేకాకుండా గ్రామాల్లో చెత్తా, చెదారం, డ్రైనేజ్ సమస్యలు ఉండకుండా చూడాలి అని చెప్పే మండల పరిషత్ కార్యాలయంలో చెత్తా, చెదారం, కరెంట్ తీగల సమస్యలు ఉన్నాయి. తక్షణమే సంబంధిత జిల్లా అధికారులు చొరవ తీసుకొని కార్యాలయం కు వచ్చే వారికి ఎలాంటి ప్రమాదం జరగకముందే కరెంటు సమస్యను పరిష్కరించాలని గ్రామాల నుండి వచ్చే ప్రజలు కోరుకుంటున్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా గురువారం 10 వ డివిజన్ కాపువాడ, 11 వ డివిజన్ లలో రూ.60 లక్షలతో అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూప్రాధాన్యత పరంగా అన్ని డివిజన్ లలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు.శంకుస్థాపన చేసిన ప్రతి పనిని సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంతిన్నామని తెలిపారు.ఈ కార్యక్రమాల్లో ఆయా డివిజన్ కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు,దేవరకొండ విజయ సురేందర్,డివిజన్ అధ్యక్షులు కుమార్ యాదవ్,సంగీత్, ముఖ్య నాయకులు,అధికారులు పాల్గొన్నారు.

## ఇవిఎం గోదాంలను తనిఖీ చేసిన కలెక్టర్ స్నేహ శబరీష్



**ప్రజాపక్షం/హనుమకొండ:** వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లోని ఇవిఎం గోదాంలను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ గురువారం తనిఖీ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలమేరకు మూడు నెలలకోసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ హనుమకొండ జిల్లాకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్ లలో భద్రపర్చిన ఇవిఎంలను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ తనిఖీ చేశారు. ఇవిఎం లకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఈవీఎం గోదాంల ఉన్న భద్రతా చర్యలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకుని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ నారాయణ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, హనుమకొండ, పరకాల తహసీల్దార్లు రవీందర్ రెడ్డి, విజయ లక్ష్మి, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇవిశ్రీనివాస రావు, శ్యామ్ సుందర్, రజనీకాంత్, సయ్యద్ ఫైజుల్లా, తదితరులు పాల్గొన్నారు.

## భగీరథ మహర్షి విగ్రహ ఏర్పాటుకు సహకరిస్తా:ఎమ్మెల్యే గండ్ర




**ప్రజాపక్షం/భూపాలపల్లి:** భూపాలపల్లి పట్టణంలో త్వరలోనే భగీరథ మహర్షి విగ్రహ ఏర్పాటుకు పూర్తిగా సహకరిస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం భూపాలపల్లి పట్టణంలో సగర (ఉప్పర) కులస్తుల సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సమావేశాన్నుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ భూపాలపల్లిలో భగీరథ మహర్షి విగ్రహ ఏర్పాటు చేయడానికి తాను పూర్తిస్థాయిలో సహకారం అందిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. భగీరథ మహర్షి గంగను భూమిపైకి తీసుకువచ్చి ప్రజలకు అందించిన మహనీయుడని ఎమ్మెల్యే అన్నారు. ఆయన విగ్రహం ఏర్పాటు చేయడం ద్వారా మన సమాజంలో నీటి ప్రాధాన్యతను, మహర్షి కీర్తిని భవిషత్తు యువతరానికి గుర్తు చేసే అవకాశం లభిస్తుందన్నారు. విగ్రహ నిర్మాణానికి అవసరమైన సహకారం అందించడానికి నేను ఎల్లప్పుడూ ముందుంటానని ఎమ్మెల్యే అన్నారు. ఆయన తపస్సు, కృషి, త్యాగం మనందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. భగీరథుడి స్ఫూర్తితో సగరులు అభివృద్ధి చెందాలని, ప్రతి ఒక్కరు సమాజ సేవలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం సగర కులస్తుల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సగర కుల పెద్దలు ఎమ్మెల్యేకు అందజేశారు.

## అత్తను హత్య చేసిన మేనల్లుడు



**ప్రజాపక్షం/నూగురు వెంకటాపురం:** మండల పరిధిలోని విఆర్‌కె పురం పంచాయతీ చొక్కాల గ్రామంలో గురువారం ఉదయం దారుణ హత్య జరిగింది. కొండగొర్ల విజయ్ అనే వ్యక్తి తన మేనత్త అయినటువంటి కొండ గొర్ల ఎల్లక్క (55) ను గొడ్డలితో దాడి చేసి దారుణంగా హత మార్చాడు. గ్రామస్తుల కథనం ప్రకారం, దుర్వేసనాలకు బానిసైన విజయ్ తరచూ కుటుంబ సభ్యులతో గొడవ పడుతూ ఉండేవాడని, తన అవసరాలకు డబ్బులు ఇవ్వలేదని దాంతో సహనం కోల్పోయిన విజయ్ మేనత్తను చంపినట్లు తెలుస్తుంది. సమాచారం అందుకున్న వెంకటాపురం సీఐ ముత్యం రమేష్, ఎస్సై కొప్పుల తిరుపతిరావు లు సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెంకటాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసును దర్యాప్తు చేస్తున్నారు.

## తేజస్వి హైస్కూల్‌లో విద్యార్థి మృతి

### విద్యార్థి సంఘాల ఆందోళన






**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** హన్మకొండ నయింనగర్ లోని తేజస్వి హైస్కూల్లో గురువారం ఉదయం 10వ తరగతి విద్యార్థి జయంత్ వర్ధన్ ఆ కస్మాత్తుగా మరణించాడు. వివరాలలోకి వెళితే నయీం నగర్ లోని మొదటి బ్రాంచ్ తేజస్వి హైస్కూల్లో పదవ తరగతి చదువుతున్న జయంత్ (15) రోజులాగే గురువారం కూడా స్కూల్ కి వెళ్లాడు. స్కూల్ పరిసర ప్రాంతంలో తోటి విద్యార్థులతో కలిసి గేమ్స్ ఆడుతున్న తరుణంలో విద్యా ర్థి జయంత్ ఆకస్మాత్తుగా కుప్పకూలి మరణించాడు. ఈ సంఘటనపై విద్యార్థి కుటుంబంలో విషాదఛాయలు కమ్ముకున్నాయి. ఈ ఆకస్మిక మరణంతో తోటి విద్యార్థుల, తల్లిదండ్రులు భయాందోళన గురవుతున్నారు. విద్యార్థి అకస్మాత్తుగా ఉదయం 11 గంటల సమయంలో మృతి చెందిన జిల్లా విద్యా శాఖ అధికారులు మాత్రం సాయంత్రం 4 గంటలకు తేజస్వి స్కూల్ కి రావడం పై విద్యార్థి తల్లిదండ్రులు, పలువురు ప్రజా సంఘ నాయకులు విద్యార్థి నాయకులు పలువిధాల అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థి జయంత్ తల్లిదండ్రులను జరిగిన ఘటన పై వివరాలు అడుగగా స్కూల్ స్కూల్ యాజమాన్యం విద్యార్థికి ఫిట్స్ వచ్చి పడిపోయాడు అని నిర్లక్ష్య సమాధానం చెప్పారని ఆవేధంగా వ్యక్తం చేస్తున్నారు. స్కూల్ సీసీటీవీ ఫుటేజీలో మాత్రం విద్యార్థి స్కూల్ గ్రౌండ్ హాట్ స్ట్రోక్ వచ్చి పడిపోయినట్లు కనబడుతుండగా స్కూల్ యాజమాన్యం మాత్రం ఫిట్స్ వచ్చి పడిపోయాడని అబద్ధం చెబుతున్నారని, స్ట్రోక్ వచ్చి పడిపోయిన సమయంలో వెంటనే పిసిఆర్ చేస్తే తమ బాబు బతికేవాడని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కాగా విద్యార్థులను స్కూల్ గ్రౌండ్ లో కఠినం గా రన్నింగ్ లాంటి వామ్ అప్ చేయడం వల్లనే జయంత్ చనిపోయాడని, తొలుత గుండె పోటు గా గుర్తించి సిపిఆర్ చేస్తే బతికేవాడని, విద్యార్థి మృ తిలో పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యము ఉందని విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు.విద్యార్థి కుటుంబానికి రూ.50లక్షలు చెల్లించివారి కుటుంబాన్ని దుకోవాలని డిమాండ్ చేశారు.

# కాజీపేట రైల్వే స్టేషన్ వద్ద బస్టాండ్ నిర్మాణం

### వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య



**ప్రజాపక్షం/హనుమకొండ :** హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న రైల్వే ప్రాజెక్టుల పురోగతిని.. పర్యవేక్షించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన కీలక సమీక్షా సమావేశంలో వరంగల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టుల పైన జరిగిన సమీక్ష సమావేశంలో భాగంగా వరంగల్ కు సంబంధించి రైల్వే సమస్యలపై ఎంపి డాక్టర్ కడియం కావ్య ప్రస్తావించారు. ప్రధానంగా కాజీపేట రైల్వేస్టేషన్ ముందు బస్టాండ్ నిర్మాణం చేపట్టాలన్నారు. రైల్వేకు సంబంధించిన స్థలం బస్టాండ్ నిర్మాణానికి కే టాయిస్తే.. దానికి బదులుగా మరో చోట రైల్వేకు స్థలా న్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందని ఎంపీ తెలియజేశారు. అందుకు సిఎం రేవంత్‌రెడ్డి కూడా సానుకూలంగా స్పం దిస్తూ మరో ప్రాంతంలో స్థలం ఇవ్వడానికి రాష్ట్ర ప్రభు త్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రజలు, రైల్వే ప్రయాణికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని మల్టీ మోడల్ బస్టాండ్ నిర్మాణానికి సహకరించాలని ఎంపీ కోరారు. రైల్వే శాఖ మంత్రి దీనికి సంబంధించి ఆదేశాలను కూడా సంబంధిత జోనల్ అధికారులకు అందజేస్తామని వెల్లడించారు.అలాగే భూపాలపల్లికి కొత్త రైల్వే స్టేషన్, రైల్వే లైన్‌ను మంజూరుపై ఎంపి ప్రస్తావించారు. భూపాలపల్లి సింగరేణి కాలరీస్, టిజి జెన్ కో నుండి బొగ్గును రవాణా చేయడానికి ట్రక్కులపై ఆధారపడుతుందన్నారు. రైల్వే లైన్ మంజూరు అయితే రోడ్డు ప్ర మాదాలు, కాలుష్యం, సరుకు రవాణా ఖర్చులను తగ్గిస్తుందని, ప్రయాణీకుల ప్రయాణంతో పాటు ఆర్థిక కా ర్యకలాపాలను పెంచుతుందని తెలిపారు. అదేవిధంగా కాజీపేటను రైల్వే డివిజన్ చేస్తే రాష్ట్రంలోని రెండో అతిపెద్ద నగరం వరంగల్ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ ప్రాజెక్టులు ప్రయాణం, వాణిజ్యా రంగాన్ని మరింత అభివృద్ధి చేస్తాయని ఎంపి డాక్టర్ కడియం కా వ్య అన్నారు. ఉద్యోగ కల్పన, వ్యాపార వృద్ధి, వరంగల్ కీలకమైన కనెక్టివిటీ హబ్‌గా ఉంటుందని స్పష్టం చేశారు. కాజీపేట డివిజన్ ఏర్పాటుతో రైల్వేకు అత్యధిక రెవెన్యూ అందించబడుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు నూతన బైపాస్ లైన్ ల విషయాన్నీ కూడా ఎంపి ప్రస్తావించారు. నష్కల్ నుండి వరంగల్ నగరానికి రెండు రైల్వే బైపాస్ లై న్లు, ఒకటి నష్కల్ నుండి చింతపల్లి వరకు, నష్కల్ నుండి హసన్ పర్తి వరకు రైల్వే డిపార్ట్మెంట్ ప్రతిపాదనలు చేయడం జరిగిందన్నారు. ఓఆర్ఆర్ నిర్మాణం కారణంగా ఇప్ప టికే రైతులు నష్టపోయారని అన్నారు. మరోసారి ఈ రైల్వే లైన్ల కారణంగా రైతులు మరిన్ని భూముల కోల్పోయి వ్యవసాయ రంగం చిన్నా భిన్నం కానుందన్నారు. ట్రయాంగిల్ రైల్వే విధానంతో వరంగల్ నగర అభివృద్ధికి ఆటంకం కలుగుతుందన్నారు. అక్కడి రైతులు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో అలైన్మెంట్ మార్చి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని వివరించారు. ఇప్పటికే పలుమార్లు ఈ సమస్యల పరిష్కారం కొరకు కేంద్ర మంత్రులను అధికారులను కలిసిన ఎంపి డా.కడియం కావ్య మరోసారి రాష్ట్ర ప్రభుత్వం తరపున కేంద్ర ప్రభు త్వం దృష్టికి తీసుకు వెళ్తానని రైల్వే మంత్రిని కలిసి వినతిపత్రం అందజేస్తానని వెల్లడించారు.ఈ సమీక్ష సమావేశానికి సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ట్రాన్స్ పోర్ట్ అండ్ బిల్డింగ్స్ స్పెషల్ సెక్రటరీ వికాస్ రాజ్, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస రాజు, ఫైనాన్స్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవతో పాటు పలువిభాగాల ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.

## కర్ణాటక శాసనమండలికి హాజరైన ఎమ్మెల్యే, టిపిసిసి వైస్ చైర్మన్




**ప్రజాపక్షం/పాలకుర్తి/ దేవరుప్పుల:** కర్ణాటక మాజీ మంత్రి బేగనే రామయ్య కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు కర్ణాటక శాసనమండలిలో కొత్త సభ్యురాలిగా నామినేట్ అయిన ఎన్ఆర్ఐ ఫోరం వైస్ ప్రెసిడెంట్ ఆరతి కృష్ణ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, టిపిసిసి వైస్ ప్రెసిడెంట్, పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సి రాజేందర్‌రెడ్డి హాజరయ్యారు. గురువారం ఉదయం విధానసౌధలోని బాంకెట్ హాల్‌లో ఘనం గా జరిగింది. ఈ కార్యక్రమానికి జాతీయ, రాష్ట్ర స్థాయి కాంగ్రెస్ నేతలు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఆరతి కృష్ణకు అభినందనలు తెలిపారు.

## నిషేధిత గుట్కాలు నియంత్రించాలి

### సిపిఐ మరిపెడ మండలం కార్యదర్శి మారగాని బాలకృష్ణ



**ప్రజాపక్షం/మరిపెడ :** మరిపెడ మరిపెడ మండలంలో నిషేధిత అంబర్ గుట్కా లు నియంత్రించాలని కోరుతూ సిపిఐ మండలం కార్యదర్శి మారగాని బాలకృష్ణ స్థానిక ఎస్ఐకి వినతిపత్రం సమర్పించారు. మండలంలోని 49 గ్రామ పంచాయతీలు ఆవాస తండాలలో మరిపెడ మున్సిపాలిటీలో నల్ల బెల్లం వ్యాపారం గంజాయి నిషేధిత అంబర్ గుట్కా పలు అక్రమ వ్యాపారాలు జోరుగా కొనసాగుతున్నందువలన దీనిపై మరిపెడ ఎస్సై, పోలీస్ సిబ్బంది నిఘా ఉంచి పూర్తిగా అక్రమ వ్యాపారాలను నివారించాలని ఆయన కోరారు. అలాగే యువత ఉజ్వల భవిష్యత్తు చెడు వ్యసనాలకు బానిసై వారి యొక్క జీవితాలను మధ్యలోనే కోల్పోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నీలి కుర్తి గ్రామ పార్టీ కార్యదర్శి అనపర్తి సత్యం, మరిపెడ పట్టణ కార్యదర్శి మల్లెపాక యాకన్న, యుగేందర్, బ్రహ్మచారి, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తున్న బిజెపి

### సిపిఐ రాష్ట్ర పార్టీ సమితి మాజీ సభ్యుడు




**ప్రజాపక్షం/ తొర్రూరు :** రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 11 నుంచి 17వరకు తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని సిపిఐ పార్టీ రాష్ట్ర సమితి మాజీ సభ్యులు తమ్మెర విశ్వేశ్వర్‌రావు అన్నారు. గురువారం తొర్రూరు పట్టణ కేంద్రంలోని లయన్స్ భవన్‌లో సిపిఐ తొర్రూరు మండల సమితి సమావేశాన్ని సిపిఐ మండల సహాయ కార్యదర్శి గణపురం లక్ష్మ ణ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర సమితి మాజీ సభ్యులు తమ్మెర విశ్వేశ్వర్‌రావు పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో నైజాంకు వ్యతిరేకంగా సాగిన సాయుధ పోరాటం భారతదేశ చరిత్రలో స్వర్ణాక్షరాలతో లిఖించిదగినదన్నారు. నిజాం నిరంకుశ పరిపాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాన్ని బిజెపి ప్రభుత్వం హిందూ ముస్లింల మధ్య పోరాటంగా చిత్రీకరించడం విచారకరమన్నారు. ఈ పోరాటంలో నాలుగువేల అమరవీరుల రక్తతర్పణం చేయడం జరిగిందన్నారు. అదే విధంగా దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడి దున్నేవాడిదే భూమి అని లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీకే దక్కిందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మహోత్తరమైన పోరాటాన్ని అవమానపర్చి సాయుధ పోరాట యోధులకు రావాల్సిన పింఛన్లను ఎత్తివేసిన హీనమైన చరిత్ర ఉందన్నారు. సెప్టెంబర్ 17పేరుతో బిజెపి అమరవీరులను స్మరించుకోవడం సిగ్గుచేటని దీనిని తీవ్రంగా ఖండించాలన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను ఈ నెల 11 నుంచి 17వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న సందర్భంలో మండలంలో ఘనంగా వేడుకలను నిర్వహించేందుకు సమాయత్తం కావాలన్నారు. ప్రజల కోసమే తమ జీవితాలను అంకితం చేసిన నాటి తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల జీవిత చరిత్రను నేటి తరానికి తెలియజేస్తూ ఆ పోరాట కుటుంబాలను స్మరించుకుంటూ, వారి కుటుంబ సభ్యులను సత్కరించాలన్నారు. ఈ సమావేశంలో ఏఐటియుసి గౌరవ అధ్యక్షులు ఓమ భిక్షపతి, సిపిఐ పార్టీ మండల కార్యదర్శి బందు మహేందర్, సహాయ కార్యదర్శి పేరబోయిన కిరణ్, డిహెచ్‌పిఎస్ నాయకులు గూడెల్లి ఎల్లయ్య, గ్రామ శాఖ కార్యదర్శులు బూరుగు యాదగిరి, పేరబోయిన శ్యామ్, వెంకన్న, మంగళంపల్లి మల్లయ్య, దొనక యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

# 17ను విలీన దినోత్సవంగా నిర్వహించాలి

### సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా




**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :** వరంగల్ లోని అబ్బుస్ ఫంక్షన్ హాల్ తెలంగాణ రైతాంగ సాయుధ పోరట వార్షికోత్సవ సభ ఉంటుంది. ఈ సభకు ముఖ్య అతిథిగా కామ్రేడ్ తక్కలపల్లి శ్రీనివాస్ రావు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి హాజరౌతారని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికపిలుపునిచ్చారు పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని సెప్టెంబర్ 17ను విలీన దినోత్సవం గా నిర్వహించాలని, నిజాం ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఫ్యూడల్ ప్రభువుల అణచివేత దోపిడీలకు వ్యతిరేకంగా జరిపిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, మాతృ భాష కోసం, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి, మట్టి మనుషులు చేసిన తిరుబాటు ధిక్కార స్వరం బాంచన్ దొర కాల్మొక్త అన్న వెట్టి మనిషి దొర ఏందిరో నీ దొరతనం ఏందిరో అంటూ బందూకులు పట్టిన కమ్యూనిస్టు పోరాటమది. హైదరాబాద్ సంస్థాన రాజు ముస్లిం అయినప్పటికీ జమీందార్లు, జాగీర్దార్లు, భూస్వాములు దాదాపు 90 శాతం హిందువులే. నిజాం నవాబుకు గులాములుగా వ్యవహరించడమే గాక నిజాంను మించిన దౌర్జన్యాలతో అనేక మందిని ఊచకోత కోయడం, మహిళలను వివస్త్రలుగా చేసి ఊరేగింపులు చేయడం, బతుకమ్మలు ఆడించడం, మానభంగాలు చేయడం లాంటి క్రూరమైన నేరాలను చేసిన జమీందార్లు, జాగీర్దార్లు, దేశముఖిలో హిందువులు ఉన్నారు. ముస్లిములు ఉన్నారు. అదే విధంగా నిజాం రాజు ముస్లిం అయినప్పటికీ పేద ముస్లిముల జీవితాలలో ఎటువంటి మార్పులేదు. తెలంగాణలో భూస్వామ్య ముస్లింలు కేవలం 2000 కుటుంబాలే కాగా పేద ముస్లింలు లక్షలాది మంది ఉన్నారు. అందులో 20 లక్షల మంది హైదరాబాద్ నగరంలో కడుపేదరికంలో ఉండేవారు. ముస్లింలలో తలారి, షేక్ సిందులు, గ్రామసేవకులు లాంటి అతి స్వల్ప ఆదాయాలతో కూడిన అట్టడుగున ఉన్నటువంటి పనులు, ఇతర మెకానిక్, హోటల్లో పనిచేయడం, పంక్షర్స్ వేయడం, టైలర్లుగా, కూరగాయాలు, పండ్లు అమ్ముకొనే వారిగా అతి తక్కువ ఆదాయాలతో కూడిన ముస్లింలు లక్షలాది మంది ఉండేవారు. గ్రామాలలో సెంట్ భూమి కూడా లేని వారు కూడా ఉన్నారు. విసునూరు రాంచంద్రారెడ్డి, జన్నారెడ్డి ప్రతాప రెడ్డి ఇంకా అనేక సంస్థానాధిపతులు హిందువులే, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అనేకమంది ముస్లింలు కూడా చిత్రహింసలకు గురికాబడ్డారు. షేక్ బందగీ ని విసునూరు రాంచంద్రారెడ్డికి చెందిన గుండాలు చంపివేశారు. ప్రఖ్యాత జర్నలిస్టు షోయబుల్లా ఖాన్ న్ను హైదరాబాద్ నడిబజారులో రజాకార్లు క్రూరంగా చంపారు. ఈనాటి ఖమ్మం జిల్లా ఆనాటి వరంగల్ జిల్లాలో రజబ్ ఆలి లాంటి యోధులు నిజాం రాచరికానికి వ్యతిరేకంగా పోరాటం చేశారని 4000 మంది ప్రాణాలను కోల్పోయి 3000 గ్రామాలను విముక్తి చేసారని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈరోజు నుండి సెప్టెంబర్ 17 వరకు తెలంగాణ రైతంగ సాయుధ పోరాట సభలను జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో గ్రామాల్లో నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గన్నారపు రమేష్,గుండె బద్రి సంఘీ ఏలేంధర్ ఓర్సు రాజు యాకామ్రాచారి రాజేందర్ తదితరులు పాల్గొన్నరు.

## విధుల్లో అలసత్వం వహిస్తే జీతాల్లో కోత

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/మహాదేవపూర్:** విధుల్లో అలసత్వం వహిస్తున్న వారి జీతాల్లో కోత విధించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చే రోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్రం,జనరల్ వార్డు,బ్లడ్ స్టోరేజి యూనిట్ లను పరిశీలించి రోగులకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు.కొంతమంది వైద్యులు విధులకు హాజరు కాకుండా జీత భత్యాలు తీసుకుంటుంన్నట్లు గుర్తించిన కలెక్టర్ వారి జీతాలలో కోత విధించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ ను ఆదేశించారు.బ్లడ్ స్టోరేజి భవననిర్మాణం పూర్తి అయ్యిందని సిబ్బందిని నియమించి పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్,మండల ప్రత్యేక అధికారి కిరణ్ కుమార్,ఎంపిడిఓ రవీంద్రనాథ్, సుపత్రి సూపరింటెండెంట్ విద్యావతి, ఆర్ ఎంఒ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జనగామలో కుండపోతగా వర్షం

### లోతట్టు ప్రాంతాలు జలమయం




**ప్రజాపక్షం/జనగామ:** గురువారం సాయంత్రం జనగామలో కుండపోతగా భారీ వర్షం కురిసింది. సాయంత్రం 5 గంటల నుండి 6.30 నిమిషాల వరకు సుమారు గంటన్నర ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. సంజయ్ నగర్ చమాన్ వరదలో మునిగింది. ఇళ్ల దర్వాజలకు పైగా నీరు వచ్చింది. రోడ్డుకు రెండు పీట్ల ఎత్తులో వర్షం నీరు ప్రవహించింది. ఇక జనగామలోని హైదరాబాద్ రోడ్డు బాలాజీ నగర్ అతలాకుతలం అయ్యింది. హైదరాబాద్ రోడ్డులో వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది, సేయింట్ మేరీస్, కుర్మవాడ ప్రాంతం నుండి వరద నీరు రావడంతో బాలాజీ నగర్‌లో పూర్తిగా నీరు చేరింది. వర్షం నీరు వెల్లెందుకు కాలువలు లేకపోవడంతో జనం ఇబ్బందులు పడ్డారు. సరిగ్గా పాఠశాలు వదిలే సమయం కావడంతో విద్యార్థులు సైతం అనేక ఇబ్బందులు పడిన పరిస్థితి. సెయింట్ మేరీస్, సాన్ మారియా పాఠశాల నుండి ఇంటికి వెళ్లాల్సిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సుమారు, రెండు మూడు గంటల వరకు వరద ఉద్రుతి తగ్గకపోవడంతో ఇళ్లలోకి వెళ్లాల్సిన వారు సైతం అనేక ఇబ్బందులు పడిన పరిస్థితి. భారీ వర్షంతో ఒక్కసారిగా జనగామ ప్రాంతం ఉక్కిరిబిక్కిరైంది. జనగామ పట్టణంలోనే కాకుండా రఘునాథపల్లి, లింగాలఘనపురం, స్టేషన్ ఘనపూర్, దేవరుప్పుల ఇలా అనేక మండలాల్లో భారీ వర్షం కురిసింది.

# ప్రతీ డివిజన్‌లో త్వరితగతిన అభివృద్ధి పనులు

### వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపిఎస్ అధికారి నాగరాజు



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ స్మశాన వాటికలో కనీస మౌలిక వసతుల కోసం 17 లక్షల రూపాయల నిధులతో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపిఎస్ అధికారి కెఆర్ నాగరాజు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ "ప్రజలకు అవసరమైన ప్రతి చోట మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, స్మశాన వాటికలు కూడా ప్రజా జీవనంలో ఒక ముఖ్యమైన భాగం అని, ఇక్కడికి వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నీరు, విద్యుత్, కూర్చునే సదుపాయం, షెడ్లు, టాయిలెట్లు వంటి అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేస్తామన్నారు. గురువారం 17 లక్షల రూపాయల నిధులతో ప్రారంభించిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని, ప్రజల సమస్యలు విని పరిష్కరించడం తన బాధ్యత అని, అందరి ఆశీర్వాదాలతో మరింత అభివృద్ధి సాధించడానికి కృషి చేస్తాను" అని అన్నారు. 14వ డివిజన్ పరిధిలోని చాలా వరకు ప్రజలు నిత్యం కూలినాలి చేసుకొని బ్రతికే వారు ఉంటారని,వారి కోసం సుందరయ్య నగర్‌లో బస్తీ దవాఖాన కోసం త్వరలోనే శంకుస్థాపన చేసి చేసి ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకోనీ వస్తానని,ఇటీవల ఎస్ఆర్ నగర్ గ్రామానికి 50 లక్షల రూపాయలు నిధులు




మంజూరు చేయించి డ్రైనేజీ పనులు జరుగుతున్నాయన్నారు. ముంపుకు గురికాకుండా శాశ్వత పరిష్కార డిపిఆర్ తయారు చేయించి సిఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి శాశ్వత పరిష్కార దిశగా కృషి చేస్తున్నానని, అలాగే డివిజన్ పరిధిలోని ఎవరైనా కబ్జాలకు పాల్పడితే ఊరుకొనేదే లేదు నేను కాని, తన కొడుకు, కార్పొరేటర్, డివిజన్ అధ్యక్షుడు ఎవరు ఎవరిని ప్రోత్సహించడం లేదని, తప్పుడు ప్రచారాలు చేస్తే వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని పోలీసువారికి విజ్ఞప్తి చేశారు.తాను ఎమ్మెల్యేగా గెలిచినాటి నుంచి విద్యా, వైద్యం, రైతుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించి నా ఎమ్మెల్యే జీతం నుంచి పలు చిన్న చిన్న కార్యక్రమాలు చేస్తూ ముందుకు వెళ్తున్నామని అన్నారు. రైతులెవ్వరు యూరియా విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కేంద్ర ప్రభుత్వం సరైన సమయంలో ఇతర దేశాలనుండి కేంద్ర ప్రభుత్వం దిగుమతి చేసుకునే సమయానికి చేయకపోవడం వల్ల యూరియా దొరకక రైతులు ఇబ్బందులు పడ్డారని అన్నారు. సిఎంరేవంత్ రెడ్డి సరైన సమయంలో స్పందించి యూరియను రైతులకు అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ తూర్పాటి సులోచన సారయ్య డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్, నాయకులు ఈర్ల రాజేందర్, మచ్చర్ల స్టాలిన్, గొలుసుల సంతోష్, కడెం కుమార్, భరత్, పిట్ట సుధీర్, మహిళలు సైజాజి, ఉపేంద్ర,తో పాటు డివిజన్, గ్రామ స్థాయి నాయకులు కార్యకర్తలు,అధికారులు పాల్గొన్నారు.

# క్రీడ



## టాస్ గెలిచిన బంగ్లా

ఆసియా కప్ మూడో మ్యాచ్‌లో బంగ్లాదేశ్, హాంకాంగ్ తలపడుతున్నాయి. తొలి మ్యాచ్‌లో అఫ్ఘనిస్థాన్ చేతిలో చిత్తైన హాంకాంగ్‌కు ఇది రెండో మ్యాచ్ కాగా.. బంగ్లాకు ఇదే ఫస్ట్ గేమ్. అబూదాబీలోని షేక్ జయద్ స్టేడియంలో జరుగుతున్న ఈ పోరులో టాస్ గెలిచిన బంగ్లా సారథి లిటన్ దాస్ బౌలింగ్ ఎంచుకున్నాడు. విజయంతో టోర్నీని ఆరంభించాలని ముగ్గురు పేసర్లు, ఇద్దరు స్పిన్నర్లతో ఆడుతున్నామని లిటన్ తెలిపాడు. తొలి పోరులో కాబూలీలకు సరెండర్ అయిన హాంకాంగ్ ఈసారి మెరుగైన ప్రదర్శన చేయాలనుకుంటోంది. అఫ్గన్ చేతిలో 94 పరుగుల తేడాతో ఓడిన ఈ జట్టు.. ఈ మ్యాచ్‌లోనూ విఫలమైతే సూపర్ 4 దశకు చేరడం అసాధ్యమే.

**బంగ్లాదేశ్ తుది జట్టు :** పర్వేజ్ హొసేన్ ఎమాన్, తంజిద్ హసన్ తమీమ్, లిటన్ దాస్(కెప్టెన్, వికెట్ కీపర్), తౌహిద్ హ్రిదయ్, షమీమ్ హొసేన్, జకీర్ అలీ, మెహదీ హసన్, రిషద్ హొసేన్, తంజిమ్ హసన్ షకీబ్, తస్కిన్ అహ్మద్, ముస్తాఫిజుర్.

**హాంకాంగ్ తుది జట్టు :** జీషన్ అలీ(వికెట్ కీపర్), అన్షుమన్ రథ్, బాబర్ హయత్, నిజకత్ ఖాన్, కల్హన్ చల్లు, కించిత్ షా, యాస్మిన్ ముర్తాజా(కెప్టెన్), ఇజజ్ ఖాన్, ఎషాన్ ఖాన్, ఆయుశ్ శుక్లా, అతీక్ ఇక్బాల్.

## జైపూర్‌లో కబడ్డీ కూత..

### సొంతగడ్డపై చెలరేగనున్న పాంథర్స్..!

ఐపిఎల్ తరహా క్రేజ్‌తో అభిమానులను అలరిస్తున్న ప్రో కబడ్డీ లీగ్ జైపూర్‌కు తరలివెళ్లింది. పన్నెండో సీజన్ తొలి దశ మ్యాచ్‌లకు వైజాగ్ ఆతిథ్యమివ్వగా రెండో దశ మ్యాచ్‌లు 'పింక్ సిటీ'లో జరగనున్నాయి. రెండుసార్లు ఛాంపియన్ జైపూర్ పింక్ పాంథర్స్‌కు ఇది హోమ్ గ్రౌండ్ సెప్టెంబర్ 12 నుంచి సెప్టెంబర్ 27వ తేదీ వరకూఅక్కడి కబడ్డీ ఫ్యాన్స్‌కు రైడర్లు, డిఫెండర్లు పూనకాలు తెప్పించనున్నారు. కబడ్డీ అంటే పడిచచ్చే సొంత ప్రేక్షకుల సమక్షంలో చెలరేగి పోవాలని నితిన్ రావల్ సారథ్యంలోని జైపూర్ టీమ్ భావిస్తోంది. ప్రో కబడ్డీ లీగ్‌కు దేశవ్యాప్తంగా ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. అందుకే.. పలు నగరాల్లో మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు నిర్వాహకులు. పికెఎల్ 12వ సీజన్ ఆగస్టు 29న ప్రారంభమైంది. సెప్టెంబర్ 11 వరకూ మ్యాచ్‌లు జరిగాయి. ప్రస్తుతానికి నాలుగింటా రెండు విజయాలతో వెనుకబడిన జైపూర్ పింక్ పాంథర్స్ ఇక సొంతగడ్డపై చెలరేగిపోనుంది. నేడు జరుగబోయే తొలి మ్యాచ్‌లో జైపూర్ జట్టు సమఉజ్జీ అయిన బెంగళూరు బుల్స్‌తో ఆడనుంది. రెండో గేమ్‌లో తమిళ్ తలైవాస్‌ను బెంగాల్ వారియర్స్ ఢీకొట్టనుంది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో పుణెరి పల్టన్, దబాంగ్ ఢిల్లీ జట్లు నాలుగేసి విజయాలతో టాప్2లో నిలిచాయి. జైపూర్ విషయానికొస్తే ఆరంభ సీజన్‌లో.. ఆపై తొమ్మిదో సీజన్‌లో పికెఎల్ టైటిల్ కొల్లగొట్టిన విషయం తెలిసిందే. అనంతరం మూడో దశ మ్యాచ్‌లకు చెన్నై వేదిక కానుంది. నాలుగో దఫా కబడ్డీ కూత ఢిల్లీలోని త్యాగరాజ్ ఇండోర్ స్టేడియంలో వినిపించనుంది.



## ప్రపంచకప్‌లో మహిళలకు పట్టం..

### రిఫరీలు, అంపైర్ల బృందంలో అందరూ అతివలే..!

ఐసిసి మహిళల వన్డే వరల్డ్ కప్ టోర్నీ చరిత్రలోనే తొలిసారి పూర్తిస్థాయిలో మహిళలతో ఈ మెగా ఈవెంట్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గత మహిళల టీ20 వరల్డ్ కప్, 2022 కామన్వెల్త్ గేమ్స్‌లోనూ ఇలా మహిళా అంపైర్లు, రిఫరీలను ఐసిసి నియమించింది. అయితే వరల్డ్ కప్‌లో మాత్రం ఇదే మొదటి సారి. ఐసిసి మహిళల వన్డే వరల్డ్ కప్ సెప్టెంబర్ 30 నుంచి భారత్, శ్రీలంక ఉమ్మడి ఆతిథ్యంలో జరగనుంది. ప్యానల్లో 14 మంది అంపైర్లు, నలుగురు మ్యాచ్ రెఫరీలు తమ సేవలందించనున్నారు. మహిళా అంపైర్లలో.. చాలామంది క్రికెట్ అభిమానులకు సుపరిచతమైన వారే ఉన్నారు. క్లైర్ పోలోసాక్, జాక్వెలిన్ విలియమ్స్, స్యూ రెడ్‌ఫెర్న్‌కు ఇది మూడో మహిళల ప్రపంచ కప్. అలాగే.. లారెన్ అగెన్బాగ్, కిమ్ కాటన్‌కు ఇది రెండో టోర్నీ. మ్యాచ్ రెఫరీ ప్యానల్.. అనుభవజ్ఞులు, కొత్తవారితో సమతూకంగా ఉంది. ట్రూడీ ఆండర్సన్, షాండ్రే ఫ్రిట్జ్, జీఎస్ లక్ష్మి, మిచెల్ పెరీరా ఈ ప్యానల్లో సభ్యులుగా ఉన్నారు. పూర్తిగా మహిళా అంపైర్లు, మ్యాచ్ రెఫరీలతో మెగా టోర్నీ నిర్వహించనుండటాన్ని చరిత్రాత్మకమైన మార్పుగా ఐసిసి చైర్మన్ జైషా కొనియాడారు. ' ఇది మహిళల క్రికెట్ ప్రయాణంలో ఒక అద్భుత ఘట్టాన్ని సూచిస్తోంది. ఈ ముందడుగు కొత్త ఒరవడికి మార్గం సుగమం చేస్తుందని మేం ఆశిస్తున్నాం. పూర్తిగా మహిళలతో కూడిన ప్యానెల్ను ఏర్పాటు చేయడం కేవలం మైలురాయి మాత్రమే కాదు. క్రికెట్లో స్త్రీ పురుష సమానత్వాన్ని పెంపొందించడానికి ఐసీసీ చూపుతున్న నిబద్ధతకు ప్రతిబింబం' అని జైషా పేర్కొన్నారు.



# ఫోకస్

## చివరి దశ హక్కులు..



జీవితంలో అన్ని దశలను దాటుకొని, చివరిదైన వృద్ధాప్యంలోకి అడుగుపెట్టిన వారిలో అత్యధిక శాతం మంది ఆత్మనూన్యతతో, అభద్రాభావంతో బతుకుతున్నారన్నది చేదు నిజం. అందుకే, జీవితంలో చివరగా వచ్చే వృద్ధాప్యాన్ని అత్యంత సంక్లిష్టమైనదిగా పేర్కొంటారు. వృద్ధాప్యంలో శారీరక శక్తి, మానసిక స్థితి, ఆర్థిక స్థిరత్వం తగ్గిపోతాయి. ఈ పరిస్థితిలో వృద్ధులు సమాజం నుండి ఎక్కువ మద్దతు, గౌరవం, రక్షణ కోరుకుంటారు. దురదృష్టవశాత్తు ఆధునిక కాలంలో వృద్ధుల హక్కులు చాలా వరకు నిరక్ష్యానికి గురవుతున్నాయి. ఇది కేవలం భారతదేశ సమస్య కాదు. ప్రపంచవ్యాప్తంగా వృద్ధులు వివిధ రకాల ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అందుకే ఐక్యరాజ్యసమితి 1991లోనే వృద్ధుల హక్కులను ప్రత్యేకంగా గుర్తించింది. భారతదేశం కూడా చట్టపరంగా, పథకాల రూపంలో కొన్ని చర్యలు తీసుకుంటున్నా, వాస్తవ జీవితంలో అమలులో సమస్యలు చాలా ఉన్నాయి. భారతీయ సాంప్రదాయంలో వృద్ధులను గౌరవించడమే ముఖ్య ధర్మంగా పేర్కొంటారు. మాతృ దేవోభవ, పితృ దేవోభవ అనే వాక్యం వృద్ధుల స్థానం ఎంత ఉన్నతమో చూపుతుంది. సంస్కృత సాహిత్యంలో వృద్ధులను జ్ఞానభాండాగారంగా కీర్తించారు. కుటుంబ పెద్దల మాటలే ఆఖరి నిర్ణయమని భావించే సంస్కృతి మనకుంది. కానీ, వలసరాజ్యాల కాలంలో పట్టణీకరణ, ఆధునికీకరణ, అణుయుక్త కుటుంబ వ్యవస్థ కారణంగా వృద్ధుల స్థానం క్రమంగా క్షీణించింది. గ్రామీణ సంస్కృతిలో ఇప్పటికీ వృద్ధులకు గౌరవం ఉన్నప్పటికీ, పట్టణాల్లో వారిని భారంగా చూడటం పెరిగింది. కాగా, జనాభా గణాంకాలు: 2021 జనగణన అంచనాల ప్రకారం భారతదేశంలో 60 ఏళ్లు పైబడిన వారు 138 మిలియన్లు. 2050 నాటికి ఇది 300 మిలియన్లకు పైగా పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. ఆర్థికపరమైన అంశాలను పరిశీలిస్తే, వృద్ధులలో ఎక్కువ మందికి స్థిరమైన ఆదాయం లేదన్నది స్పష్టమవుతుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పెన్షన్ వ్యవస్థ సక్రమంగా పనిచేయడం లేదన్న విమర్శలున్నాయి. డబ్బు సమస్యకు జబ్బు సమస్య కూడా తోడుకావడంతో, వృద్ధుల పరిస్థితి మరింత దారుణంగా మారుతున్నది. షుగర్, రక్తపోటు, గుండె జబ్బులు, అల్జీమర్స్ వంటి వ్యాధులు వృద్ధులలో ఎక్కువ. వైద్య సదుపాయాలు, సౌకర్యాలు చాలా తక్కువ. సామాజిక సమస్యలు కూడా వృద్ధులను పీడిస్తుంటాయి. ముఖ్యంగా ఒంటరితనం, కుటుంబ నిర్లక్ష్యం, మానసిక వేధింపులు విస్తృతంగా కనిపిస్తున్నాయి. ఈ సమస్యల పట్ల సమాజమే స్పందించాలి. వృద్ధాప్యం అనేది జీవితంలో ఒక భాగమేనన్న విషయాన్ని అందరూ అర్థం చేసుకోవాలి. వారి పట్ల గౌరవమర్యాదలతో నడచుకోవాలి. ఆప్యాయతను ప్రదర్శించాలి. అయితే, సమాజంలో ఇలాంటి వాతావరణం ఎక్కువగా కనిపించడం లేదు కాబట్టే, వృద్ధులకు కొన్ని రకాల హక్కులను కల్పించారు. వాటిలో ప్రధానంగా ఆర్థిక హక్కులను పేర్కోవాలి. వృద్ధాప్యంలో జీవనాధారంగా ఉండేది ఆర్థిక భద్రత. ఇందుకోసం పెన్షన్, వృద్ధాప్య భృతి వంటి సౌకర్యాలు ఉన్నాయి. సామాజిక భద్రత కింద ప్రయాణం, వైద్య సేవల్లో వృద్ధులకు ప్రత్యేక రాయితీలు లభిస్తాయి. చాలా ప్రాంతాల్లో వృద్ధులకు ఉచిత లేదా తక్కువ ధరలో వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంటాయి. ప్రత్యేక జెరియాట్రిక్ వార్డుల సౌకర్యం లభిస్తుంది. వృద్ధులకు గౌరవంతో జీవించే హక్కు, కుటుంబ సభ్యుల నుండి గౌరవం పొందే హక్కు, ఆస్తి లేదా ఇతరత్రా అంశాలపై వేధింపులు లేకుండా జీవించే హక్కు, సమాజంలో భాగస్వామ్యమయ్యే హక్కు ఉంటాయి. అదే రీతిలో కొన్ని ప్రత్యేక చట్టపరమైన హక్కులు కూడా వృద్ధులకు ఉన్నాయి. ఉదాహరణకు వృద్ధులపై హింస, నిర్లక్ష్యం నివారణ చట్టం. వారసత్వ హక్కుల రక్షం చట్టం వారికి అన్ని విధాలా రక్షణ కల్పిస్తుంది. 'మెయింటెనెన్స్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ పేరెంట్స్ అండ్ సీనియర్ సిటిజన్స్ యాక్ట్, 2007' ప్రకారం తల్లిదండ్రులను పోషించాల్సిన బాధ్యత పిల్లలపై ఉంది. దీనిని నిర్లక్ష్యం చేసిన వారు శిక్షార్హులవుతారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 41 ప్రకారం వృద్ధులకు ప్రజా సహాయం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. పిల్లలు లేదా వారసులు వృద్ధులను పోషించాలి. వృద్ధుల కోసం ప్రభుత్వాలు వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేయాలి. 1999–2011 సంవత్సరాల్లో వృద్ధుల పట్ల వ్యవహరించాల్సిన తీరుపై జాతీయ విధానాలను ప్రకటించారు. ఏదిఏమైనా, జీవితాంతం ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని, వృద్ధాప్యంలోకి అడుగుపెట్టిన వారికి, చివరి పర్వం ప్రశాంతంగా ముగిస్తే, అదే సమాజం వారికి ఇచ్చే గౌరవం. ఆత్మీయ బహుమానం.



వృద్ధుల కోసం ప్రత్యేక జెరియాట్రిక్ హాస్పిటల్స్ ఏర్పాటు చేయాలి. పెన్షన్ పథకాలు మరింత విస్తృతంగా అమలు చేయాలి. వృద్ధులపై హింసకు కఠిన శిక్షలు ఉండాలి. వృద్ధుల పట్ల కుటుంబ అవగాహన పెరగాలి. వృద్ధుల అనుభవాన్ని సమాజానికి ఉపయోగపడేలా సామాజిక, విద్యా కార్యక్రమాలు చేపట్టాలి. వాస్తవానికి వృద్ధుల సమస్యలను వెలుగులోకి తేవడం మీడియా బాధ్యత. కానీ వాస్తవానికి మీడియా వృద్ధుల అంశాలను పెద్దగా ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నది అందరికీ తెలిసిన విషయమే. కేవలం వృద్ధాశ్రమాల ఫొటోలు చూపించడం సరిపోదు. వృద్ధుల హక్కుల కోసం చట్టాల అమలు, ప్రభుత్వ నిర్లక్ష్యం, కుటుంబాల బాధ్యతలను సవాలు చేయాలి. అంతేగాక భవిష్యత్ సవాళ్లను దృష్టిలో ఉంచుకొని, తగిన చర్యలు చేపట్టాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. వృద్ధుల హక్కులు కేవలం చట్టాల గాని, ప్రభుత్వ పథకాల గాని విషయమే కాదు. అది మానవీయతకు సంబంధించిన మూలప్రశ్న. ఒక సమాజం తన వృద్ధులను గౌరవించకపోతే, భవిష్యత్తులో ఆ సమాజం కూడా గౌరవం పొందదు. ప్రతి ఒక్కరూ ఒకరోజు వృద్ధులుగా మారతారు. కాబట్టి వృద్ధుల హక్కులను రక్షించడం అంటే మన భవిష్యత్తును రక్షించడం.



జెరియాట్రిక్ వార్డు

# ప్రజల హక్కులు, స్వేచ్ఛ కోసం పోరాడింది కమ్యూనిస్టులే

### గుండ్రాంపల్లిలో సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ సత్యం

### రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలు ప్రారంభం



చిట్యాల...

**ప్రజాపక్షం/చిట్యాల :** దొరలు, భూస్వాములు, నైజాం పాలనకు వ్యతిరేకంగా వెట్టి చాకిరి విముక్తి కోసం, ప్రజల హక్కులు, స్వేచ్ఛ కోసం పోరాడింది కమ్యూనిస్టులేనని సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలో గల అమరవీరుల స్మారక స్థూపం వద్ద గురువారం ప్రారంభించి అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్సీ సత్యం మాట్లాడారు. ప్రపంచ చరిత్రలో మహోజ్వల ఘట్టం రైతాంగ సాయుధ పోరాటమన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి బిజెపి మతం రంగు పూయాలని చూడడం శోచనీయమన్నారు. నైజాం పాలకుల నడ్డి విరిచి వారి నుండి ఈ ప్రాంత ప్రజలను కాపాడిన చరిత్ర కమ్యూనిస్టులదన్నారు. ఇలాంటి సాయుధ రైతాంగ పోరాట చరిత్రను రాష్ట్రంలో పాఠ్యపుస్తకాలలో చేర్చి భావి తరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు గురిజా రామచంద్రం, బొల్గూరి నర్సింహా, నల్ప రాజు రామలింగయ్య, ఎండి అక్బర్, చాపల శ్రీను, నల్పరాజు సతీష్, గీత పనివారల సంఘం జిల్లా కార్యదర్శి బొడిగె సైదులు, శాంతి సంఘం జిల్లా కార్యదర్శి జిల్లా యాదయ్య, జిల్లా సత్యం, కేతా రాజు అంజయ్య, సీమ అంజయ్య, బోడిగె బక్కశెట్టి, జిల్లా లక్ష్మయ్య, ముదిగొండ మురళి కృష్ణ, బరిగెల వెంకటేష్ సీమ వెంకటేష్, ఎర్పుల రాములు, రత్నం లింగస్వామి, బొడిగె వసంత, జిల్లా ఇందిరా, కేతారాజు అనసూయ, రెడపాక సంధ్య, సీమ సునీత, షేరిఫ్,నర్రా శేఖర్ రెడ్డి, దుది గామ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

**మహబూబాబాద్ :** కమ్యూనిస్టుల సాయిధ పోరాటంతోనే తెలంగాణలో రజాకార్ల నుండి ప్రజలకు విముక్తి కలిగిందని సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి విజయసారధి అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలలో భాగంగా పెరుమాళ్ళ సంకీస గ్రామంలో ఆనాడు రజాకార్ల దాడిలో 22 మంది సజీవ దహనమైన ప్రాంతంలో సిపిఐ ఆధ్వర్యంలో అరుణ పతాకాన్ని ఎగురవేసి వారికి జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్‌రెడ్డి, కట్టేబోయిన శ్రీనివాస్ నాయకులు నెల్లూరి నాగేశ్వర్ రావు, తురక రమేష్, కరణం రాజన్న, కే ప్రభేష్, బుడమ వెంకన్న, రామగోని రవి, రేపకుల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

### చరిత్రను వక్రీకరిస్తే జాతి క్షమించదు

**ఖమ్మం :** చరిత్రను వక్రీకరిస్తే తెలంగాణ జాతి క్షమించదని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తెలిపారు. తెలంగాణ పోరాటాన్ని మతపరమైన పోరాటంగా చిత్రీకరించేందుకు బిజెపి ప్రయత్నిస్తుందని, స్వాతంత్ర్య ఉద్యమంలోనూ, తెలంగాణ పోరాటంలో బిజెపికి ఎటువంటి పాత్ర లేదన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ప్రారంభ సందర్భంగా గురువారం పాత బస్టాండ్ సమీపంలోని సాయుధ పోరాటయోధుడు, సిపిఐ అగ్ర నాయకులు నల్లమల గిరిప్రసాద్ విగ్రహానికి పూలమాలలు వేసి వార్షికోత్సవాలను హేమంతరావు ప్రారంభించారు. పార్టీ పతాకాన్ని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. యర్రాబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాగం మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నిజాం స్వాతంత్ర రాజుగా ప్రకటించుకున్న తర్వాత రావి నారాయణరెడ్డి, ముగ్దుం మోహినుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి 1947 సెప్టెంబర్ 11న సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారని తెలిపారు. నిజాం రక్కసి పాలనకు వ్యతిరేకంగా సాగిన మహత్తర పోరాటంలో సామాన్యులు సాయుధులై పోరాడారన్నారు. నాలుగున్నర వేల మంది కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు అమరులయ్యారన్నారు. నాటి సాయుధ పోరాట ఘట్టాలను నేటి తరానికి తెలియజేసేందుకు వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు హేమంతరావు తెలిపారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, కొండపర్తి గోవిందరావు, కార్పొరేటర్ బిజి క్లెమెంట్, మహ్మద్ సలాం, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, రావి శివరామకృష్ణ, తోట రామాంజనేయులు, మిడికంటి వెంకటరెడ్డి, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, వరదా నర్సింహారావు, తాటి నిర్మల, బోడా వీరన్న, ఎస్‌కె సైదా, మోహన్‌రావు, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**సూర్యాపేట టౌన్ :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తూ మతోన్మాదులు రాజ్యమేలుతున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు విమర్శించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను గురువారం స్థానిక కామ్రేడ్ ధర్మబిక్షం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రారంభించారు. అనంతరం సిపిఐ జిల్లా నాయకులు చామల అశోక్ తల్లి దండ్రులు సీనియర్ కమ్యూనిస్టు నాయకులు చామల లచ్చయ్య (సిఎల్) విజయలక్ష్మి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించడంతో పాటు ఖమ్మంపాటి అంతయ్య సిపిఐ జెండా ఆవిష్కరింపజేశారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్లంల యాదగిరి, బొమ్మగాని శ్రీనివాస్, దంతాల రాంబాబు, చామల అశోక్‌కుమార్, సీనియర్ పాత్రికేయులు దేగల జనార్ధన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాతి సవీందర్, సిపిఎం జిల్లా నాయకులు బుర్రి శ్రీరాములు, చివ్వెంల మండల కార్యదర్శి ఖమ్మంపాటి రాము, జి.రాజారామ్, ఎడెల్లి శ్రీకాంత్, ధరావత్ శివరాం, తలమల్ల హస్సేన్, పెంద్ర కృష్ణ, గాలి కృష్ణ, దంతాల పద్మరేఖ, దేశగాని హేమలత, పొదిలి వెంకటమ్మ, చామల దమయంతి, వాడపల్లి వెంకన్న, ఐతరాజు లింగయ్య, రిక్షా యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

### సాయుధ పోరాటాన్ని బిజెపి వక్రీకరిస్తోంది

**మంచిర్యాల :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా సిపిఐ జిల్లా కార్యాలయంలో పార్టీ పతాకాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ ఆవిష్కరించగా ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ హాజరై మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటాన్ని బిజెపి వక్రీకరిస్తోందని విమర్శించారు. ఆనాటి పోరాటంలో ఎటువంటి పాత్ర లేని బిజెపి, ఆర్‌ఎస్ఎస్‌లు మతం రంగు రుద్దుతూ త్యాగాల చరిత్రను అవమానపరుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మేకల దాస్, రేగుంట చంద్రశేఖర్, జోగుల మల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు లింగం రవి, మిట్టపల్లి శ్రీనివాస్, మిట్టపల్లి పౌలు, మిర్యాల రాజేశ్వరరావు, దేవి పోచన్న, వనం సత్యనారాయణ, దొడ్డిపట్ల రవీందర్, పూజారి రామన్న, కొత్తపల్లి మహేష్, మామిడి గోపి, ఎగుడ మొండి, సాలిగామ సంతోష్, ప్రజా సంఘాల నాయకులు దొనికన సమ్మయ్య, మధ్యలో శంకర్, సిరికొండ రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

**శ్రీరాంపూర్ :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా శ్రీరాంపూర్‌లో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి, అనంతరం బస్టాండ్ వద్ద సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్, హిమ్మత్‌నగర్ సెంటర్ వద్ద సిపిఐ సీనియర్ నాయకులు నూకల రాజయ్య జెండా ఆవిష్కరించారు.

**భద్రాద్రి కొత్తగూడెం :** నైజాం నిరంకుశ పాలనను అంతం చేసేందుకు సాగిన తెలంగాణ సాయుధపోరాట స్ఫూర్తిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నయా దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలు పోరాటానికి సిద్ధం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా సుజాతనగర్ మండల పరిధిలోని నాయకులగూడెంలో సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన అమరుడు రావి నారాయణరెడ్డి స్థూపం వద్ద తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. సిపిఐ సుజాత నగర్ మండల కార్యదర్శి కొమారి హన్మంతరావు అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, చంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళీ, భూక్యా ధస్రు, కందుల భాస్కర్, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా సమితి సభ్యులు వి.పద్మజ, కె.రత్నకుమారి, జక్కుల రాములు, తాళ్లూరి పాపారావు, అజిత్, ఎస్.విజయలక్ష్మి, నాయకులు యూసుఫ్, బోయిన విజయ్‌కుమార్, సత్యనారాయణ చారి, గుత్తుల శ్రీనివాస్, మిరియాల రాము, మూడ్ గణేష్, దండు నాగేశ్వరరావు, కోమారి కృష్ణ, ఈర్ల రమేష్, తాళ్లూరి ధర్మారావు, బాలు రామయ్య, శ్రీను, రమేష్, నరేష్, మెదిని లక్ష్మి పాల్గొన్నారు.

**నిర్మల్ టౌన్ :** తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలను నిర్మల్ పట్టణంలోని మయూరి జంక్షన్‌లో వీరనారి ఐలమ్మ విగ్రహం వద్ద ప్రారంభించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్.విలాస్, జిల్లా కార్యదర్శి భూక్య రమేష్, కార్యవర్గసభ్యులు ఎస్.ఎన్,రెడ్డి, ఎస్.కె. సమీర్, కైలాస్ సపవాట్, జశ్వంత్, సాయి, దేవి లాల్, రమేష్, జాదవ్ శంకర్ పాల్గొన్నారు.

**కోరుట్ల :** భూమి కోసం, భుక్తి కోసం వెట్టి చాకిరీ విముక్తి కోసం మట్టి మనసులు నడిపిన పోరాటమే తెలంగాణ సాయుధ పోరాటమని సిపిఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు సుతారి రాములు తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా జగిత్యాల డివిజన్ కేంద్రంలోని భగత్‌సింగ్ నగర అల్లమయ్య గుట్టలో అరుణ పతాకాన్ని ఎగరవేశారు. అనంతరం సీనియర్ కమ్యూనిస్టు నాయకులు మచ్చ గరుడాద్రి, నల్ల భీమయ్య, పిన్నంశెట్టి బ్రహ్మానందం, ఎండి మౌలానా, బండ్ల కళావతి తదితర నేతలను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా మండల పట్టణ నేతలు ఎన్.ఎం రాధ, ఎండీ ముక్రం, మహ్మద్ అలీ, చెన్న శ్రీనివాస్, మేదర్ గణేష్, తిప్పర్తి రమేష్, పులగం గోపాల్, బాదం మోహన్, గుండేటి పోశెట్టి సుశీల పద్మ తదితరులు పాల్గొన్నారు



భద్రాద్రి కొత్తగూడెం...



మంచిర్యాల...




జగిత్యాల...



ఖమ్మం...



సూర్యాపేట...



నిర్మల్...



శ్రీరాంపూర్...




మహబూబాబాద్...



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## నిజాంసాగర్ ప్రాజెక్టుకు 7,441 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ ప్రాజెక్టు ఎగువప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రాజెక్టులోకి 7,441 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుందని ప్రాజెక్టు అధికారులు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405.00 అడుగులు, 17.802 టీఎంసీలకు గాను ప్రస్తుతం పూర్తిస్థాయి నీటిసామర్థ్యంతో కొనసాగుతుందని అధికారులు వెళ్ళడించారు. వర్షాలు భారీగా కురుస్తున్న నేపథ్యంలో 1 వరద గేటు ఎత్తివేసి 5497 క్యూసెక్కుల నీటిని మాంజీరాలోకి వదులుతున్నామని, మాంజీరా పరివాహక ప్రాంత ప్రజలు, రైతులు నీటి ప్రవాహంలోకి దిగరాదని హెచ్చరించారు.

## విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/హాజీపూర్:** ఇన్వెస్టిచర్ కార్యక్రమం విద్యా సంవత్సరంలో ఒక ముఖ్య ఘట్టమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం హాజీపూర్ మండలం గుడిపేటలోని కేంద్రీయ విద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకత్వం అధికారం కోసం కాకుండా సేవ కోసం కావాలని, విద్యార్థులు విద్యతో పాటు సాంస్కృతిక, క్రీడా రంగాల్లో రాణించాలని సూచించారు. పాఠశాల స్థాయి నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని, మానవ విలువలను కాపాడుతూ సమాజంపై ప్రభావం చూపేలా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్నికైన హెడ్ బాయ్, హెడ్ గర్ల్, హౌస్ కెప్టెన్లు, వైస్ కెప్టెన్లు ప్రమాణ స్వీకారం చేశారు. కలెక్టర్ యువ నాయకులను అభినందిస్తూ క్రమశిక్షణ, సేవాభావం, నైతికతతో ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ జి. దిలీప్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## యూరియా కొరతను తీర్చాలి

సిపిఐ సంగారెడ్డి జిల్లా సమితి డిమాండ్

**ప్రజాపక్షం/సంగారెడ్డి:** సంగారెడ్డి జిల్లా వ్యవసాయ ఆధారిత జిల్లా సంగారెడ్డి జిల్లాలో దాదాపు 50 శాతం వ్యవసాయంపై ఆదారపడి వారి జీవవాన్ని కొనసాగిస్తారు . అలాంటి మన జిల్లాలో యూరియా కొరత వల్ల రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుంది. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు యూరియా కొరతను తీర్చకుండా మేము మా వంతు యూరియాను సరఫరా చేస్తున్నామని ప్రలోభాలు పలుకుతున్నారు. వచ్చిన కాస్త కూస్తో యూరియాలో అర్హులైన రైతులకు ఇవ్వకుండా మధ్య దళారి వ్యవస్థ సిండికేట్ గా ఏర్పడి రైతులకు ఇవ్వకుండా పక్కదారి పట్టించి బ్లాక్లో విక్రయిస్తున్నారన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి బ్లాక్‌లో అమ్ముతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. చర్యలు తీసుకొని పక్షంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామని సిపిఐ పార్టీ సంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి హెచ్చరించారు.

## ఇందిరమ్మ లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు ఆదేశానుసారం నిజాంసాగర్ మండలంలోని మాగి, అచ్చంపేట్ గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు గురువారం నాడు పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ చీకోటిమనోజ్‌కుమార్, నిజాంసాగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్‌లు సంయుక్తంగా ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. ఆయనమ ఆట్లాడుతూ లబ్దిదారులు ఇంటి నిర్మాణాలు త్వరగా చేపట్టుకుని త్వరితగతిన నిర్మాణాలు పూర్తిచేసుకున్న వారికి ప్రభుత్వం వెను వెంటనే బిల్లులు అందించబడుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ, గ్రామ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

## ఆర్‌టిఎఫ్ ఫీజు బకాయిలను విడుదల చేయాలి



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** గత నాలుగు సంవత్సరాలుగా మా ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో చదువుతున్న బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ విద్యార్థులకు రావాల్సిన ఆర్.టి.ఎఫ్ ఫీజు బకాయిలను విడుదల చేయాలని డిగ్రీ కళాశాలల యజమాన్య సంఘ సభ్యులు కోరారు.ఈ మేరకు గురువారం నిర్మల్ పర్యటనకు వచ్చిన మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మేము స్థాపించిన కళాశాలలో ఎటువంటి ఫీజులు వసూలు చేయకుండా కేవలం ప్రభుత్వమే ఇస్తున్నటువంటి ఆర్టిఎఫ్ ఆధారంగా విద్యార్థులు కళాశాలలో చదువుతున్నారన్నారు.అలాంటిది గత నాలుగు సంవత్సరాలుగ స్కాలర్షిప్ బకాయిలు విడుదల కాకపోవడంతో కళాశాలలపై తీవ్రమైన ఆర్థిక ఒత్తిడ ఏర్పడుతుందని వివరించారు. ఇప్పటికైనా ఫీజు బకాయిలను చెల్లించి ఆదుకోవాలని కోరారు. ఇందులో ప్రైవేట్ డిగ్రీ కళాశాల యజమాన్య సంఘం సభ్యులు సాయిలు, సిహెచ్ వెంకట్ రెడ్డి, ప్రమోద్ రావు,అఖిలేష్ సింగ్, సతీష్‌రెడ్డి, శ్రీధర్, నర్సారెడ్డి తదితరులు ఉన్నారు.

## ఇంటి నుండి వెళ్లి... మంజీరాలో శవమై తేలాడు



**ప్రజాపక్షం/పాపన్నపేట:** ఇంటి నుండి వెళ్లి మంజీరా నదిలో శవమై తేలిన సంఘటన ఏడుపాయల వద్ద గురువారం చోటు చేసుకుంది. ఏఎస్సై దేవీ దాస్ కథనం ప్రకారం మెదక్ పట్టణానికి చెందిన దొంతుల మహేష్ కుమార్ (42) వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 6న ద్విచక్రవాహనంపై ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఏడుపాయల వద్దకు వచ్చి అక్కడ మంజీరా నదిలో కొట్టుకుపోయాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు చుట్టూ పక్కల వెతికిన ఆచూకీ లభించలేదు. గురువారం ఆలయ సమీపంలో నదిపాయ వద్ద నీటిలో కొట్టుకువచ్చి పొదల్లో తట్టుకుని కుళ్లిన స్థితిలో ఉన్న ఓ వ్యక్తి మృతదేహం స్థానికులకు కనిపించింది. పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కుటుంబీకులు ఆనవాళ్లను బట్టి మృతి చెందింది. సంతోష్ కుమార్ గా గుర్తించారు. పంచనామా నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తన తమ్ముడి మృతిపై అనుమానం ఉందని మృతుడి అన్న అశ్వనీకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

## భారీ వర్షాలదృష్ట్యా ప్రజలందరూ.. అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ రాహుల్ రాజ్





**ప్రజాపక్షం/మెదక్ :** రెండు రోజులు భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక మేరకు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రం లోని షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ బాయ్స్ హాస్టల్ లో ప్రభుత్వ జూనియర్ కళాశాల, గర్ల్స్ పాలిటెక్నిక్ కాలేజ్ ను భారీ వర్షం కారణంగా వరద నీరు చేరిన పరిసరాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెండు రోజులపాటు జిల్లాలో భారీ వర్షపాతం నమోదు అవుతుందని వాతావరణ శాఖ హెచ్చరిక మేరకు మూడు రోజులపాటు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలందరూ స్వీయ రక్షణ పాటించాలన్నారు. గతంలో కట్టిన వసతి గృహం, కళాశాలలో లోతట్టులో ఉండటం వల్ల అధికంగా వర్షపు నీరు చేరుతుందని దీనికి శాశ్వత పరిష్కారం ఆలోచించి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా వ్యవహరిస్తూ లో లైన్ కాజ్వేలు, బ్రిడ్జిలు, వరద ప్రవాహ ఉత్తిరితో ప్రవహించేటప్పుడు వాటిని దాటే ప్రయత్నం చేయవద్దని, విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ పోలీస్ పంచాయతీరాజ్ సమన్వయంతో ప్రజలందరినీ అప్రమత్తం చేస్తారన్నారు. గతంలో జిల్లాలకు కురిసిన భారీ వర్షాలు వరదల వలన దెబ్బతిన్న చెరువులు, కాజ్వే, బ్రిడ్జిలను తాత్కాలిక మరమ్మతుల ద్వారా పునరుద్ధరించడం జరిగిందన్నారు. మున్సిపాలిటీలలో లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా చర్యలు చేపట్టామన్నారు. ప్రకృతి విపత్తు ఆకస్మికంగా జరిగిందని అధికారులందరూ క్షేత్రస్థాయిలో ప్రజలను రక్షించడానికి సమర్ధవంతంగా పనిచేశారన్నారు. ఎటువంటి విపత్తులు వచ్చిన ఎదుర్కొనే విధంగా శాశ్వత పరిష్కారానికి శాశ్వత పనుల పై ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి అందించడం జరిగింది అన్నారు. కలెక్టర్ వెంట ఇంటర్మీడియట్ అధికారి మాధవి, షెడ్యూలు కులాల అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, సంబంధిత ఇతర అధికారులు తదితరులు ఉన్నారు.

**శిథిలావస్థలో ఉన్న ప్రతిపాదనలు సిద్ధం చేయాలి..**

వర్షం కారణంగా ప్రభావితమై శిథిలావస్థలో ఉన్న అన్ని సంక్షేమ పాఠశాలలు, వసతిగృహాల, కళాశాలల భవనాలకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసి అందజేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయం నుండి జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్, ఇరిగేషన్, పంచాయతీరాజ్ ఈఈటీజీడబ్ల్యూఐడిసి, (రాష్ట్ర విద్య, సంక్షేమ మౌలి కసదుపాయాల అభివృద్ధి సంస్థ) ఏఈ, డిఇలు అన్ని సంక్షేమ పాఠశాలల అధికారులు, ఆర్‌సిఓలతో గూగుల్ మీట్ ఏర్పాటు చేసి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రెసిడెన్షియల్ ఇన్స్టిట్యూషన్స్, కళాశాలలు పాఠశాలలు జిల్లాలో108 ఉన్నాయని వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని పురాతన పాఠశాలలు వసతిగృహాలు శిథిలావస్థకు చేరుకుని కూలిపోయే ప్రమాదం ఉన్న వాటిని క్షేత్రస్థాయిలో ఇరిగేషన్, పంచాయతీరాజ్, పరిశీలించి మరమ్మత్తులకు గురి అయిన వాటిని వెంటనే గుర్తించి నివేదికలు తయారు చేసి. అందజేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో నివేదికలు తయారు చేసేటప్పుడు పారదర్శకత పాటిస్తూ, గడువు తేదీలోగా తయారు చేయాలని అధికారులకు సూచించారు. అలాగే పాఠశాలలకు వసతిగృహాలకు అవసరమగు మౌలిక వసతులపై ఆరా తీశారు. అన్ని సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు ఇరిగేషన్ పంచాయతీరాజ్, ఈఈ టిడబ్ల్యూఐడిసి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 11 నుండి 17 వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం

సిపిఐ కార్యదర్శి శివలింగ కృష్ణ

**ప్రజాపక్షం/గజ్వేల్:** సెప్టెంబర్ 11 వ తేదీ నుండి 17 వరకు జరిగే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని సిపిఐ పార్టీ గజ్వేల్ నియోజకవర్గం ర్యదర్శి శివలింగ కృష్ణ, గజ్వేల్ పట్టణ కార్యదర్శి స్వర్గం రాజేశం, సహాయ కార్యదర్శి కానుగుల రమణాకర్ స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే జగదేవపూర్ మండలం దౌలాపూర్ గామంలో 14వ తేదీన కామ్రేడ్ కుమ్మరి భీమయ్య సంస్మరణ సభ ఏర్పాటు చేయనుండగా, ముఖ్య అతిథిగా సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, భద్రాద్రి కొత్తగూడెం ఎమ్మెల్యే కామ్రేడ్ కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు చెప్పారు. అలాగే జిల్లా సిపిఐ పార్టీ కార్యదర్శి మంద పవన్, మాజీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బట్టు దయానంద రెడ్డితో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కౌన్సిల్ సభ్యులు, పార్టీ సీనియర్ నాయకులు హాజరు కానున్నట్లు తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని కార్మికులు, కర్షకులు, మేధావులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం కోరారు.

## ఎండిఎం కార్మికులకు ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించాలి

ఎఐటియుసి రాష్ట్రకార్యదర్శి వై.ఓమయ్య



**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్:** గత కొన్ని సంవత్సరాలుగా ఏఐటియుసి ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం ఇన్సురెన్సు సౌకర్యం కల్పించాలని, ప్రమాద నష్టపరిహార బీమాను అమలు చేయాలని పోరాడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని, నేడు వారి ప్రాణాలను పణంగా పెట్టి విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని వండి పెడుతు ప్రమాదానికి గురైన సంఘటన మాక్లూర్ మండలం అమృత్ గ్రామంలోని ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రమాదవశాత్తు కుక్కల్ పేలి లలిత అనే కార్మికురాలు తీవ్ర గాయాలకు గురయ్యారని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి వై. ఓమయ్య అన్నారు. గురువారం స్తానిక ప్రగతి ఆసుపత్రిలో మాక్లూర్ మండలం అమృత్ గ్రామం ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికురాలు లలితకు ప్రమాదవశాత్తు పప్పు ఉడకబెడుతుండగా కుక్కల్ పేలి తీవ్ర గాయాలై ప్రాణాపాయ స్తితిలో ఉన్నారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి సుధాకర్, ఏఐటియుసి కార్యదర్శి వై.ఓమయ్య, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రపాణిలు ఆసుపత్రిని సందర్శించి కార్మికురాలిని పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలో వంట చేస్తున్న సందర్భంలో కుక్కర్ పేలి ప్రాణాల మీదకు వచ్చినా విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఆమె వైద్యానికి అయ్యే ఖర్చులన్ని విద్యాశాఖ భరించాలని, ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఈమధ్యకాలంలో చాలా మంది కార్మికులు ప్రమాదాలకు గురై ప్రాణాలు వదులుతున్నా ప్రభుత్వానికి కనీసం పట్టింపులేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కార్మికులకు ఇన్సురెన్సు, ప్రమాద నష్ట పరిహారం, ఈఎస్ఐ సౌకర్యాలను కల్పించాలని లేనియెడల ఏఐటియుసి ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

## డ్రగ్స్ నిర్మూలనలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి



ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి లింగం రవి

**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్:** భగత్ సింగ్ స్పూర్తితో డ్రగ్స్, గంజాయి, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడాలని ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి లింగం రవి అన్నారు. గురువారం బెల్లంపల్లి చౌరస్తాలో ప్లకార్డులతో నిర్వహించిన నిరసనలో మాట్లాడుతూ డ్రగ్స్ యువతను నిర్వీర్యం చేసి సమాజాన్ని సంక్షోభానికి గురిచేస్తున్నాయని, వాటిని అరికట్టడం ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. చర్లపల్లి వాగ్దేవి ల్యాబ్ యాజమాన్యం సహా ప్రధాన నిందితులు శ్రీనివాస్, విజయ్ ఓలేటి, తానాజి పట్వారీపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అనుమతి లేని కెమికల్, ఫార్మా కంపెనీలపై ప్రత్యేక దృష్టి సారించాలని, వాటి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రగ్స్ నియంత్రణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఈగల్, నార్కోటిక్ ఎన్ఫోర్స్మెంట్ వింగ్, ఎలైట్ యాక్షన్ గ్రూప్, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులను సస్పెండ్ చేయాలని కోరారు. చర్లపల్లి ప్రాంతంలో మహారాష్ట్ర పోలీసులు పట్టుకున్న మెఫెడ్రోన్ డ్రగ్స్ విలువపై విభిన్న ప్రకటనలు వస్తున్నందున నిజమైన వివరాలను సమాజానికి వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కొంకుల రాజేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ మొగిలి లక్ష్మణ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## చదువుతో ఆలోచనా శక్తి, చైతన్యస్ఫూర్తి అధికం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్



**ప్రజాపక్షం/మంచిర్యాల:** పుస్తకాలతో జ్ఞానం పెరుగుతుందని, చదువుతో మనలో ఆలోచనా శక్తి, చైతన్యం పెంపొందుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ తెలిపారు. గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తా వద్ద నవచేతన విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన మొబైల్ పుస్తక ప్రదర్శన అమ్మకాల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాలు సమాజానికి మార్గదర్శకాలు అవుతాయని, పుస్తకాలతో వ్యక్తి తన ఆలోచనలను విస్తరించుకోవచ్చని, కొత్త విలువలను అలవర్చుకోవచ్చని అన్నారు. ప్రదర్శనలో తాను భారత రాజ్యాంగ పుస్తకాన్ని కొనుగోలు చేసి ప్రారంభించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ మాట్లాడుతూ పుస్తకాల ద్వారా సమాజంపై అవగాహన పెరుగుతుందని, యువత ఎక్కువగా చదువును అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు మాట్లాడుతూ పుస్తకాలు మన జీవితాన్ని స్ఫూర్తిదాయకంగా మార్చగలవని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు, మండల కార్యదర్శులు పాల్గొన్నారు.

## బంగారు తెలంగాణ పేరిట కెసిఆర్ దోపిడీ

ఎంపి రఘునందన్ రావు



**ప్రజాపక్షం/పాపన్నపేట:** పదేళ్లపాటు బంగారు తెలంగాణ పేరుతో కుటుంబం దోచుకొని ఆస్తుల కోసం కుటుంబ తగాదాలు మొదలయ్యాయని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. గురువారం మండల పరిధిలోని కొత్తపల్లిలో సేవాపక్షం మండల స్థాయి కార్యశాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. సమావేశ అనంతరం ప్రజల నుండి అర్జీలు తీసుకొని అధికారులతో మాట్లాడి అప్పటికప్పుడే సమస్యలను పరిష్కరించారు. మరికొన్నిటిని తన బడ్జెట్ తో పరిష్కరిస్తానని హామీ ఇచ్చాడు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి అంటే డబ్బుతో కాదు ప్రజ లో ఉండి ప్రేమతో గెలవాలని సూచించారు. జనం గుండెల్లో చోటు సంపాదించిన వాడే నిజమైన నాయకుడు అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో తనను ఓడించేందుకు ప్రత్యర్థులు కోట్లు ఖర్చు చేసి ఓటమి పాలయ్యారని విషయాన్ని గుర్తు చేశారు. ప్రపంచంలో ఎన్నో దేశాల్లో నాయకుడు సరిగా లేక దేశాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. నరేంద్ర మోదీ 11 ఏళ్లపాలనలో దేశంలో 25కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయట పడ్డారని పేర్కొన్నారు. మండలంలో తొమ్మిది గ్రామాల్లో సీసీ రోడ్లు, 15 గ్రామాలలో సోలార్ లైట్లు ఏర్పాటు చేశామన్నారు. మరిన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. యువ నాయకులు ప్రజలకు తెలిసేలా కేంద్ర పథకాలు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అధ్యక్షులు మల్లేశం గౌడ్, మాజీ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ, మండల అధ్యక్షుడు సంతోష్ చారి, నాయకులు బి కొండ రాములు, లక్ష్మణ్, నాగభూషణం తో పాటు వివిధ మండలాల అధ్యక్షులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## పంట నష్టం సర్వేలో ఉండకూడదు



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** జిల్లాలో పంట నష్టం సర్వే, యూరియా పంపిణీ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో వ్యవసాయ, సహకార శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా దాదాపు 15 వేల ఎకరాల్లో పంట దెబ్బతింది. క్షేత్రస్థాయిలో ఎలాంటి పొరపాట్లు లేకుండా నష్టపోయిన రైతుల పేర్లు మాత్రమే నమోదు చేయాలి. అనర్హుల పేర్లు జాబితాలో ఉండకూడదు అని స్పష్టం చేశారు. త్వరలో జిల్లాకు వచ్చే యూరియా పంపిణీ చిన్న రైతులకు ప్రాధాన్యత ఇవ్వాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రావు, సహకార శాఖ అధికారి బిక్కు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు వెంకటి, మనోహర్, మిలింద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**టిఎజిఎస్ సంచికను ఆవిష్కరించిన కలెక్టర్**

తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం (టిఎజిఎస్) సంచికను జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే గురువారం కలెక్టరేట్‌లో తన చాంబర్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంచిక బాగుందని, కవర్ పేజీలో గుస్సాడి ఆకర్షణీయంగా ఉందని ఆయన అభినందించారు.

టిఎజిఎస్ జిల్లా కార్యదర్శి నెర్పల్లి అశోక్ మాట్లాడుతూ సంఘం పోరాటాలతో పాటు ఆదివాసీలకు చట్టాలు, హక్కులు, ప్రభుత్వ విధానాలపై చైతన్యం కల్పించేందుకు ప్రతి సంవత్సరం వ్యాసాలతో కూడిన సంచికను ముద్రిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎజిఎస్ జిల్లా అధ్యక్షురాలు కొరెంగ మాలశ్రీ, ఉపాధ్యక్షులు కోట శ్రీనివాస్, సహాయ కార్యదర్శి మడావి గణపతి తదితరులు పాల్గొన్నారు.

## తగ్గిన మంజీరా ప్రవాహం..దర్శనమిచ్చిన వనదుర్గమ్మ

27 రోజుల తర్వాత అమ్మను దర్శించుకుంటున్న భక్తులు



**ప్రజాపక్షం/పాపన్నపేట:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గామాత ఆలయానికి జలదిగ్బంధం చెరను వీడింది. 27 రోజులుగా అమ్మవారి ఆలయం జలదిగ్బంధంలోనే ఉన్న సంగతి విధితమే. భారీ వర్షాల నేపథ్యంలో సింగూరు ప్రాజెక్టు నుంచి దిగువకు నీటిని వదలడంతో వనదుర్గామాత ఆలయం సమీపంలో ఉన్న 30 శతకోటి ఘనపుటడుగుల వనదుర్గా ప్రాజెక్టు పూర్తిగా నిండి పొంగిపొర్లింది. ప్రాజెక్టు పైనుంచి గంగమ్మ పరవళ్ళు తొక్కుతూ ఉధృతంగా దిగువకు ప్రవహించిన సంగతి తెలిసిందే. వనదుర్గామాత ఆలయం ముందున్న ఏడు పాయల్లో ఒకటైన నదీపాయ ఉధృతంగా ప్రవహించడంతో అమ్మవారి ఆలయానికి భక్తుల రాకపోకలు స్తంభించాయి. దీంతో గత నెల ఆగస్టు 14న అమ్మవారి ఆలయాన్ని తాత్కాలికంగా మూసివేసిన విషయం విధితమే. వనదుర్గమ్మ ఉత్సవ విగ్రహాన్ని రాజగోపురంలో ప్రతిష్ఠించి భక్తులకు అమ్మ దర్శనం కల్పించారు. 27 రోజుల తర్వాత గురువారం నీటి ప్రవాహం పూర్తిగా తగ్గడంతో ఆలయంలోని చెత్తా చెదారాన్ని శుభ్రం చేసి వేకువ జామునే అమ్మవారికి అభిషేకం, అలంకరణ, అర్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారి దర్శనాన్ని పునః ప్రారంభించారు. భక్తులు, సందర్శకులు నదీ పాయల్లో తనివితీరా పుణ్యస్నానాలు ఆచరించి వనదుర్గామాత దర్శనానికి బారులు తీరారు.



# స్థానికం

REGIONAL NEWS

కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## జమ్మికుంటలో సేల్‌టాక్స్ అధికారుల తనిఖీలు



**ప్రజాపక్షం/జమ్మికుంట:** ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టాలని చూస్తే ఎవరి నీ వదిలిపెట్టేదిలేదని సేల్ టాక్స్ అధికారులు హెచ్చరించారు. గురువారం జ మ్మికుంట పట్టణంలోని గణేష్ ఫ్యాన్సీ స్టోర్, లక్ష్మి వెంకటరమణ ట్రేడర్స్ షా పుల్లో కరీంనగర్ ఉమ్మడి జిల్లా సేల్ ట్యా, విసిటిఓ మాదయ్య, ఏసిటివో భి క్షపతి బృందం ఆక స్మిక తనిఖీలు నిర్వహించారు. షాపుల్లో నిబంధనలకు విరుద్దంగా ఉన్న గుట్కా, పాన్‌మసాలా తదితర వస్తువు లను క్షుణ్ణంగా పరిశీలించారు. నిబంధనలు అతిక్ర మించి విక్రయాలు చేస్తున్న వాటిని సీజ్ చేసి తీసుకెళ్ల న్నట్లు, షాప్ టర్నోవర్ తదితర వివరాలు సేకరించినట్లు తెలిపారు. ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. సేల్ టాక్స్ అధికారులు తనిఖీలు చేస్తున్నారనే సమాచారం తెలుసుకున్న పలువురు షాపులు బంద్ చేసుకున్నారు.

## ఆగని రైతుల ఆందోళనలు



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** మండలంలోని తిమ్మాపూర్ గ్రామరైతులు యూరియా కొరతతో కామారెడ్డి సిరిసిల్లా ప్రధాన రహదారిపై నిరసిస్తూ రోడ్డెక్కరు.గురువారం రోడ్డుపై కూర్చుని నిరసన తెలిపుతూ ఆందోళనకు దిగారు.రోజురోజుకు యూరియా సరఫరా సరిగా లేకపోవడంతో రైతులు మ ండిపడుతున్నారు.సరిపడ యూరియా అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.విపక్షాలు వారికి మద్దతుగా నిలిచారు.పోలీసులు రంగప్రవేశం చేసి వారిని చెదరగొట్టారు.రైతుల పట్ల మేం అండగా ఉంటామని మాజి ఎఎంసి అందెసుభాష్‌అన్నారు.మాయమాటలతో అధికారంలోకి వచ్చారని,యూరి యా అందించక పోతే రైతులతో కలిసి ఆందోళనలు తీవ్రతరం చేస్తామని వి పక్షాలు హెచ్చరించారు.యూరియా ఇబ్బందులు లేకుండా చేస్తామని అధి కారులు హామీఇవ్వడంతో గంటసేపు ధర్నాను నిర్వహించి విరమించారు .కొంతమంది ప్రతినిధులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## సిద్దిపేటలో జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

మాజీ మంత్రి హరీష్‌రావు



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** సిద్దిపేట నియోజకవర్గ నిరుద్యోగ యువతి, యువకులకు ఈ నెల 13న జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని మాజీ మంత్రి హరీష్‌రావు సూచించారు. ఈ మేరకు గురు వారం సిద్దిపేటలో ప త్రిక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగం చిన్నదా? పెద్దదా ? అని కాకుండ ఏదో ఒక ఉద్యోగం చేస్తా. కావాలి అనే తపన ఉండాలని ఉద్దేశ్యంతో ఈనెల 13న జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10వతరగతి నుండి ఇంజనీర్ చదివిన యువతి, యువకులకు మంచి అవకాశాలు రానున్నాయన్నారు.ఈజాబ్ మేళాలో 20 కంపెనీలు, 40 మంది హెచ్‌ఆర్‌లు పాల్గొంటారన్నారు. ఆసక్తిగల వారు పత్రిక ప్రకటనలోని క్యూఆర్ కోడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు టెక్ మహీంద్ర, టిసిఎస్,ఇన్ఫోసిస్ కంపెనీలు, జిఎంఆర్, ఎంఆర్‌ఎఫ్, వెల్స్‌ఫన్, సిరఫ్, పెటిఎం, తదితర కంపెనీలు, ఐటిఐ చేసిన వాళ్లకు ఎంఆర్‌ఎఫ్ కంపెనీ ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు.ఇంజనీరింగ్ ఇసిఇ, ఇఇఇ ,గ్రాడ్యుయేషన్ ఏదైన డిగ్రీ. ఎంబిఎ. ఎంసిఎ,ఎంఫార్మసీ, ఎంటెక్. ఐటిఐ ఎలక్ట్రికల్, ఫిట్టర్, ఇంటర్,పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు

## మెరుగైన విద్యా బోధన చేయడమే ప్రభుత్వ లక్ష్యం; కలెక్టర్



**ప్రజాపక్షం /మల్లాపూర్ :** ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని గిరిజన మినీ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలను క్షుణ్ణంగా పరిశీలించి విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తున్నారా లేదా అని హాజరు పట్టికను పరిశీలించి ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించాలని భావితరాలకు అవసరమైన విద్య అందించేలా పని చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా అనే విషయాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని ఖచ్చితమైన ప్రమాణాలు పాటించాలని సిబ్బందికి అధికారులకు సూచించారు. దోమలు వృద్ధి చెందకుండా పాఠశాల ఆవరణలో శానిటేషన్ ఎప్పటికప్పుడు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఆర్‌డిఒ శ్రీనివాస్, ఎస్‌సి వెల్ఫేర్ జిల్లా అధికారి రాజ్ కుమార్, మండల స్థాయి అధికారులు ఉన్నారు.

## భర్తపై హత్యా యత్నానికి భార్యే సూత్రదారి

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** ప్రేమ వ్యవహారానికి కట్టుకున్న భర్తను అడ్డు తొలగించుకునేందుకు ప్రియుడితో కలిసి పన్నిన పన్నాగం విఫలం కావడంతో ప్రియుడు, ప్రియురాలు కటకటాల పాలైన సంఘటన జగదేవ్‌పూర్ మండలంలోని ఇటిక్యాలలో వెలుగు చూసింది. గురువారం ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం 15 రోజుల క్రితం వడ్డే బాబు అనే వ్యక్తి ఇటిక్యాల గ్రామానికి చెందిన తిగుళ్ల బాల చంద్రం తన ఇంట్లో నిద్రిస్తున్న క్రమంలో కత్తితో హత్య యత్నానికి పాల్పడినట్లు తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసు విచారణలో బాబుకు, బాలచంద్రం భార్య మమతతో గత సంవత్సరం నుండి వివాహేతర సంబంధం కొనసాగుతుందని వెల్లడించారు. ఈ వ్యవహారంపై బాలచంద్రంతో పాటు మమత సోదరులు రెండు సార్లు మందిలించారు. ఈ క్రమంలో తమ వివాహేతర సంబంధం సాఫిగా కొనసాగాలంటే బాలచంద్రంను చంపడమే ఏకైక లక్ష్యమని భావించిన మమత తన ప్రియుడితో పథకం వేసి గత నెల 24న అతడు నిద్రిస్తున్న క్రమంలో మమత బాబుకు ఫోను చేసి హత్య చేసేందుకు పురికొల్పినట్లు తమ విచారణలో నిందింతుడు ఒప్పుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అయితే తీవ్రగాయాల నుండి బయటపడిన బాలచంద్రం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ అనంతరం బాబుతో పాటు మమతను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఆయన తెలిపారు.

## ఆలయాల్లో చోరీకి పాల్పడిన నలుగురి అరెస్ట్

**ప్రజాపక్షం/అక్కన్నపేట:** జల్సాల కోసం దేవాలయాలను టార్గెట్‌గా చేసుకొని చోరీలు చేస్తున్న ముఠాను సిద్దిపేట పోలీస్ కమీషనరేట్ పరిధిలోని అక్కన్నపేట పోలీసులు అరెస్ట్ చేశారు.కేసుకు సంబంధించిన వివరాలను ఎస్‌ఐ చాతరాజు ప్రశాంత్ గురువారం వెల్లడించారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం..చోరీ కేసుల పరిశోధనలో భాగంగా సాంకేతికత ఆధారంగా ఆధారాలు స్వీకరించి తమ సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అనుమానిత ట్రాలీ ఆటోలో సూర్యాపేట జిల్లాకు చెందిన మామిడిగోపి,జాదవ్ గణేష్,మామిడి నాగమణి,జాదవ్ శిరీష వెళ్ళిన క్రమంలో వీరిని పట్టుకొని విచారించగా చౌటపల్లి ఆలయంతో పాటు పలు ఆలయాల్లో చోరీ చేసినట్లు నిందితులు అంగీకరించారు.నిందితులు చోరీ చేసిన వస్తువులను స్టేషన్ ఘనపుర్‌కు చెందిన బొల్ల లక్ష్మికి విక్రయించేవారని వెల్లడించారు.చోరీకి గురైనా వాటిలో మండలంలోని చౌటపల్లి పెద్దమ్మ ఆలయంలో చోరీకి గురైన అమ్మవారి ముక్కు పుడక ఆభరణాలతో పాటు రెండు ఇత్తడి గుడి గంటలు,గౌరవెళ్ళి ప్రభుత్వ పాఠశాలలోని క్రీడా సామాగ్రి,ఆరుసిసి కెమరాలు, ట్రాలీ ఆటో,రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

# మంథనిలో విద్యారంగ అభివృద్ధికి కృషి

కలెక్టర్ తో కలిసి మంథని మున్సిపాలిటీలో విస్తృత పర్యటన: ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

పిల్లలు మంచి నాయకత్వ లక్షణాలు, లక్ష్యాన్ని కలిగి ఉండాలి సినీ నటి మంచు లక్ష్మి





**ప్రజాపక్షం/ముత్తారం/మంథని:** మంథని ప్రాంతంలో విద్యారంగ అభివృద్ధికి సంపూర్ణ కృషి చేస్తామని రాష్ట్ర ఐ.టి, పరిశ్రమలు,శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. గురువారం మంథని ప్రాంతంలో మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి మంథని మున్సిపాలిటీలో విస్తృతంగా పర్యటించారు. మంథని మున్సిపాలిటీలో రూ. 80 లక్షలతో నిర్మించనున్న నూతన ట్రాన్స్ ఫార్మర్ రిపేర్ సెంటర్‌కు మంత్రి శంకుస్థాపన చేశారు. పట్టణంలో ఎంపిపిఎస్ బాలికల పాఠశాలలో టీచ్‌ఫర్ చేంజ్ (మం చు లక్ష్మి ఫౌండేషన్) ఆధ్వర్యంలో డిజిటల్ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ పేదలకు నాణ్యమైన విద్య అందాలని స్వచ్ఛంద సంస్థ టీచ్ ఫర్ చేంజ్ ద్వారా సేవలు అందిస్తున్న మంచు లక్ష్మి , ఇతర ప్రతినిధులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. విద్య,వైద్య రంగాలలో స్పష్టమైన మార్పు తీసుకుని రావడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు.మంథని నియోజకవర్గ పరిధిలో 6 ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ క్లాస్ రూమ్స్ ఏర్పాటుకు ముందుకు వచ్చిన టీచ్ ఫర్ చేంజ్ సంస్థకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమాజంలో మంచిజరగాలని నిస్వార్థంగా కృషి చేస్తున్న మంచు లక్ష్మి గారికి అభినందనలు తెలిపారు. విద్యా రంగంలో అభివృద్ధి కోసం ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు తమ సహకారం అందించడం సంతోషకరమని అన్నారు. విద్యతో వస్తుందని, బాగా విజ్ఞానం చదువుకున్న తర్వాత నాయకులుగా ఎదగడానికి ఆస్కారం ఉంటుందని అన్నారు. మంథని నియోజకవర్గం పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తామని అన్నారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ తరగతులు ఏర్పాటు చేస్తూ పిల్లలకు మెరుగైన బోధన అందించేందుకు సహకారం అందిస్తున్న టీచ్ ఫర్ చేంజ్ సంస్థ స్థాపకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు డిజిటల్ తరగతులను, మూడు సంవత్సరాల వరకు టీచ్ ఫర్ చేంజ్ సంస్థ అందించే కరి కులంను సద్వినియోగం చేసుకుంటూ పిల్లల్లో మంచి మార్పు తీసుకుని రావాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తుందని, అవసరమైన పాఠశాలల్లో ప్రహరీ గోడ, అదనపు తరగతులు, టాయిలెట్స్ అవసరమైన మరమ్మతు పనులు చేపట్టామని అన్నారు.టీచ్ ఫర్ చేంజ్ సంస్థ ప్రతినిధులు ప్రముఖ నటులు మంచు లక్ష్మి మాట్లాడుతూ.. మంథనిలో 6 తరగతి గదులను డిజిటలైజ్ చేయడం జరిగిందని, ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో మొత్తం మా సంస్థ ద్వారా 51 తరగతి గదులలో డిజిటల్ సౌకర్యాలు కల్పించామని అన్నారు. తమ కుటుంబ నేపథ్యం విద్యా రంగం నుంచి వచ్చిందని, తమ తాతగారు హెడ్ మాస్టర్‌గా పని చేసేవారని తెలిపారు. మంచి నాణ్యమైన విద్య ప్రతి ఒక్కరికి అందాలనే లక్ష్యంతో టీచ్ ఫర్ చేంజ్ సంస్థ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. పిల్లలు మంచి నాయకత్వ లక్షణాలు, జీవితంలో ఒకమంచి లక్ష్యం కలిగి ఉండాలని అన్నారు .పిల్లలు అందరూ డాక్టర్లు, ఇంజనీర్ కలెక్టర్ వంటి పెద్ద స్థాయికి చేరుకోవాలని అన్నారు. మా సంస్థ సహకారంతో ఇక్కడి పాఠశాలల్లో మంచి మార్పులు వస్తే మరిన్ని పాఠశాలల్లో సదుపాయాల కల్పనకు ముందుకు వస్తామని అన్నారు. అనంతరం మంత్రి తన క్యాంపు కార్యాలయంలో విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్స్, మంథని రామగిరి కమాన్ పూర్ మండలంలో ఎంపికైన 205 లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఇందిరమ్మలబ్ధిదారులు త్వరగా ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించుకోవాలని, ప్రతి సోమవారం లబ్ధిదారులకు ఇంటి నిర్మాణ పురోగతి ఆధారంగా నిధులు జమ చేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ నన్నయ గౌడ్, జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, మంథని మార్కెటింగ్ కమిటీ చైర్మన్ వెంకన్న,ఆర్‌డిఓ సురేష్, సహకార సంఘ అధ్యక్షుడు శ్రీనివాస్, తహసీల్దార్, ఎంపిడిఓ, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహం తొలగింపును నిరసిస్తూ రాస్తారోకో



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** కరీంనగర్ నగరంలోని కిసాన్‌నగర్‌లో ఎన్నో సంవత్సరాలుగా ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని అర్ధరాత్రి పూట దొంగతనంగా అవమానకరమైన పద్ధతిలో తొలగించడాన్ని నిరసిస్తూ గురువారం స్థానిక డివిజన్ ప్రజలు, దళిత సంఘాలతో కలిసి విగ్రహం తొలగించిన చోట నుంచి నిరసన ర్యాలీతో పాటు గాంధీ చౌక్ వద్దకు చేరుకుని రాస్తారోకో చేపట్టి ధర్నా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున ట్రాఫిక్ అంతరాయం కలిగింది. పోలీసులు జోక్యం చేసుకుని నిరసనకారులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు కంసాల శ్రీనివాస్, నక్క ప్రమోద్, గోష్కి శంకర్‌లు మీడియాతో మాట్లాడారు. నగరపాలకసంస్థ ఫుట్‌బోర్డుపై అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నామని, వారి జయంతి,వర్ధంతి వేడుకలు సైతం నిర్వహించుకుంటున్నామని పేర్కొన్నారు. అంబేద్కర్ అంటే పడని కొంతమంది దుర్మార్గులు హైకోర్టులో కేసు వేసి తొలగించుటకు ఆర్డర్ తీసుకుని రావడం, దానికి అధికారులు, పోలీసులు ఒక కుట్రపూరితంగా అర్ధరాత్రి ముందు సమాచారం ఇవ్వకుండా దొంగతనంగా అవమానకరమైన పద్దతిలో విగ్రహాన్ని జెసిబితో తొలగించడాన్ని తీవ్రంగా నిరసిస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి మంత్రులుగా ఉన్న పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, అడ్లూరు లక్ష్మణ్‌కుమార్‌లు బాధ్యత వహించి దళితులకు సమాధానం చెప్పాలని, తిరిగి విగ్రహాన్ని పునఃప్రతిష్టించాలని , లేని పక్షంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. మాజీ కార్పోరేటర్లు , జిల్లా అంబేద్కర్ యువజన సంఘం ప్రెసిడెంట్ క్యాదాసి ప్రభాకర్, రాష్ట్ర నాయకుడు గజ్జల ఆనందరావు, ఎంఆర్‌పిఎస్ నాయకు లు , దళిత సంఘాల నాయకులు, పలువురు దళిత సం ఘాల నాయకులు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

## ఎరుపెక్కిన కరీంనగర్



**ప్రజాపక్షం/కరీంనగర్:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అసువులు బాసిన అమర వీరులను స్మరించుకుంటూ సిపిఐ శ్రేణులు కరీంనగర్‌లో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన భారీ బైక్ ర్యాలీ సంధర్భంగా పార్టీ కార్యకర్తలు ఎర్ర జెండాలు చేతబూని ఎర్ర చొక్కాలు ధరించి నగర వీధుల గుండా బైక్ ర్యాలీ నిర్వహించారు. అమరులకు జోహార్లు అంటూ చేసిన నినాదాలు మారుమ్రోగాయి. కరీంనగర్ బద్దం ఎల్లారెడ్డి విగ్రహం నుంచి ప్రధాన కూడళ్ల వద్ద ఎర్ర జెండాలు రెపరెపలాడాయి. దాదాపు 500 మంది కార్యకర్తలు బైక్ ర్యాలీ చేపట్టడంతో కరీంనగర్ పట్టణం ఒక్కసారిగా ఎరుపుమయమయ్యింది. సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ నాయకత్వంలో భారీ బైక్ ర్యాలీ విజయవంతంగా సాగింది.

## కేంద్రం యూరియా సరఫరా చేయకపోవడం వల్లే సమస్య:మంత్రి పొన్నం



**ప్రజాపక్షం/కరీంనగర్:** కేంద్రం యూరియా సరిగా సరఫరా చేయకపోవడం వల్లనే ఎరువుల సమస్య వచ్చిందని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఆరోపించారు. సైదాపూర్ మండలంలోని నల్లరామయ్యపల్లిలో నూతన గ్రామ పంచాయతీ భవనం, ఆకునూరు కెజిబివిలో రూ.90 లక్షల అంచనా వ్యయంతో డార్మెంటరీహాల్, వెంకటేశ్వర్లపల్లి బూడిదపల్లిలో రూ.5 లక్షలతో ఓపెన్ జిమ్‌ను ఆయన ప్రారంభించారు. నల్లాని రామయ్యపల్లి, ఎక్లాస్‌పూర్‌లో మహిళా సంఘాలకు స్టీల్ బ్యాంకులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులకు సంబంధించి రోజు కలెక్టర్‌తో మాట్లాడుతున్నామని, ఎరువులు రాష్ట్రంలో తయారు కావని, కేంద్రం ఆధీనంలో తయారు జరుగుతుందని చెప్పారు. రైతులు ఎరువుల కోసం లైన్‌లో నిల్చునే పరిస్థితి రావద్దని, కేంద్రం సరిగా సరఫరా చేయకపోవడం వల్ల సమస్య వచ్చిందని ఆరోపించారు. మిగతా వాటికంటే కొంత మెరుగైనా ఇక్కడ రైతులు ఎరువుల కోసం లైన్‌లో నిల్చోవడం అనేది మంచిగా అనిపించలేదన్నారు. దానికి తాను సైతం బాధ్యతవహిస్తున్నా వాస్తవాలు కొన్ని ఒప్పుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఎరువుల సరఫరా అంతా కేంద్రం వద్దనే ఉంటదని, యూరియా రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాలని, సరిపడా యూరియా కేంద్రం పంపడం లేదన్నారు. యూరియా కొరతను అధిగమించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. రైతులు ఆందోళన చెందవద్దని కోరారు. గ్రామాల్లో మహిళా సంఘాలకు స్టీల్ వస్తువులను అందిస్తున్నామని, ప్లాస్టిక్ వాడకుండా స్టీల్ వస్తువులను వాడాలని తెలిపారు. ప్రజాపాలన ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్లు లక్ష్మి కిరణ్, అశ్విని తానాజీ వాకడే, ఎఎంసి చైర్మన్ దొంత సుధాకర్, సింగిల్ విండో చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి, తహసీల్దార్ గుర్రం శ్రీనివాస్, ఎంపిడివో యాదగిరి, వ్యవసాయాధికారి వైదేహి, వివిధ శాఖల అధికారులు, నాయకులున్నారు.

## గణేష్ చందా ఇవ్వలేదని కుల బహిష్కరణ

పోలీసులకు బాధితుల ఫిర్యాదు

ఏ సమస్య ఉన్నా పోలీసులను సంప్రదించాలి: సిఐ సుధాకర్



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామంలో ఈనెల 8వ తేదీ సోమవారం రోజున కల్లెడ ఎస్.సి కాలనీలో వినాయక నిమజ్జనం సందర్భంగా అరుణ్, గంగా, ల చ్చయ్య, అంజి, సూర్య వంశీ వి నాయకుని వద్దకు కొబ్బరికాయ కొట్టడానికి రాగా గణపతికి చందా డబ్బులు 1116 రూపాయలు ఇచ్చిన తర్వాత కొబ్బరి కాయ కొట్టాలని కుల పెద్దలు తేల్చి చెప్పడంతో ఆ విషయం కాస్త చినిగి చినిగి గాలి వనై పెద్ద వివాదంగా మారిందని ఆర్థిక స్థోమత బాగాలేక గణపతి చందా 1116 రూపాయలు ఇచ్చుకోలేమని చెప్పినావినకుండా గణేష్ చందా పేరుతో నాలుగు కుటుంబాలను కుల సంఘాల పెద్దలు కులం నుంచి బహిష్కరించారని బాధితులు తెలిపారు. ఆ నాలుగు కుటుంబాల సభ్యులతో గ్రామంలో ఎవరు మాట్లాడిన, వారి ఇంటికి వెళ్ళిన 25 వేల రూపాయలు జరిమానా విధించడం జరుగుతుందని గ్రామంలో డప్పు చాటింపు చేపించారని బాధితులు వాపోతున్నారు. **జగిత్యాల రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితులు :** గణేష్ చందా ఇవ్వలేదని పేరుతో తమ నా లుగు కుటుంబాలను కులం నుంచి బహిష్కరించారని అరుణ్, గంగా, లచ్చయ్య, అంజి, సూర్య వంశీలు జగిత్యాల రూరల్ పోలీసు స్టేషన్ ఈ నెల 10 వ తేదీన ఫిర్యాదు చేయగా జగిత్యాల రూరల్ పోలీసు అధికారులు స్పందించి కుల బహిష్కరన చట్ట విరుద్ధం అని విచారణ జరిపి నిందితులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**కుల బహిష్కరన ఫిర్యాదుపై స్పందించిన జగిత్యాల రూరల్ పోలీస్ అధికారులు :** జగిత్యాల రూరల్ మండలంలోని కల్లెడలో ఈ మధ్య జరిగిన కుల బహిష్కరణ సంఘటనను ఉద్దేశించి సామాజిక అంశాలు, పౌర హక్కులు, పోలీసు చట్టాలపై గ్రామప్రజలకు అవగాహన కల్పించారు.

## అర్హులకు చేయూత ఫించన్ పథకం లబ్ధి చేకూరేలా చర్యలు

కలెక్టర్ సందీప్ కుమార్ ఝ



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** అర్హులకు చేయూత ఫించన్ పథకం లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాల ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో చే యూత పెన్షన్ల పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో పి.పి.టి. ద్వారా డైరెక్టర్ సెర్ప్ గోపాల్ అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ చేయూత పథకం కింద వృద్ధులకు, దివ్యాంగులకు, హెచ్‌ఐవి వ్యాధి గ్రస్తులకు, వితంతువులకు, నేతన్నలకు, గీత కార్మికులు, బీడి కార్మికులు, ఒంటరి మహిళలు, బీడి , డయాలసిస్, ఫిలేరియా పెషెంట్లకు ప్రభుత్వం పెన్షన్ అందిస్తుందని అన్నారు. ప్రస్తుతం వృద్ధుల పింఛన్ తీసుకుంటున్న వారు మరణిస్తే వారి స్థానంలో జీవిత భాగస్వామికి పెన్షన్ మంజూరు చేయడం, హెచ్.ఐ.వి, డయాలసిస్ పింఛన్ పోర్టల్ ఓపెన్ ఉందని అన్నారు. ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శులు పెన్షన్ సంబంధించి రెండు రిజిస్టర్లు మెయింటెన్ చేయాలని ఒక రిజిస్టర్ లో మంజూరు చేసిన ఫించన్ దారుల వివరాలు, మరో రిజిస్టర్ లో అర్హత ఉన్న లబ్ధిదారుల వివరాలు రాయాలని, ప్రభుత్వం నుండి ఆదేశాలు వస్తే నూతన పెన్షన్లు మంజూరు చేయాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శులు బర్త్ సర్టిఫికెట్, డెత్ సర్టిఫికెట్ జారీ వివరాల రిజిస్టర్ పక్కాగా మెయింటైన్ చేయాలని అన్నారు. ఆధార్ కార్డు, డెత్ సర్టిఫికెట్ ,బ్యాంక్ పాస్ పుస్తకం రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం మొదలగు పత్రాలతో వీటిని పరిశీలించాలని అన్నారు. జిల్లాలో ఆత్మహత్యలు చేసుకున్న రైతు నేతన్న కుటుంబాలలో ఈ పథకానికి ఎవరైనా అర్హులు ఉన్నారా లేదా పరిశీలించి ప్రతిపాదన సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డైరెక్టర్ సెర్ప్ గోపాల్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేషాద్రి, ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శుల, వార్డ్ ఆఫీసర్లు పోస్టల్ సిబ్బంది సెక్షన్ అసిస్టెంట్లు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## చీరల చెకింగ్ పేరుతో చేనేత జౌళి శాఖ దోపిడీ

లాల్ బహుట చేనేత పవర్ లూమ్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పంతం రవి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** చీరల చెకింగ్ పేరుతో చేనేత జౌళి శాఖ ఆర్థిక దోపిడీ చేస్తుందని డబ్బులు ఇస్తేనే సెలెక్ట్ లేదంటే రిజెక్ట్ అన్న చందంగా వ్యవహరిస్తున్నారని లాల్ బహుట చేనేత పవర్ లూమ్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పంతం రవి అన్నారు. గురువారం సిరిసిల్ల సిపిఐ కార్మిక భవనంలో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. సంవత్సరానికి కోటి రూపాయలు అక్రమంగా వసూలు చేస్తున్నారని ఆరోదించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము సిరిసిల్లలో కార్మికులకు ఆసాములకు మంచి ఉపాధి దొరకాలనే సదుద్దేశంతో ఇందిరా మహిళా స్వశక్తి చీరల పథకాన్ని ప్రవేశ పెట్టి ఇక్కడి కార్మికులకు ఉపాధి దొరికే విధంగా ఈ ఒక్క సంవత్సరానికే సుమారు 8 కోట్ల 50 లక్షల మీటర్ల గుడ్డ ఉత్పత్తికి ఆర్డరు ఇవ్వడం జరిగిందని ఉత్పత్తి అయిన గుడ్డను నాణ్యత ప్రమాణాలు చూడడం కొరకు జేటిఓ జూనియర్ టెక్నికల్ ఆఫీసర్లను నియమించుకోవడం జరిగిందని వారు ప్రభుత్వ నుండి వేతనాలను పొందుతూనే తమ తమ విధులను సరిగ్గా నిర్వహించకుండా డబ్బులు ఇచ్చిన వారి గుడ్డని సెలెక్ట్ చేస్తూ ఇవ్వని వారివి పక్కన పెట్టి అనేక కొరివిలు పెట్టడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ సంవత్సరానికి ఎనిమిది కోట్ల 50 లక్షల గుడ్డ ఉత్పత్తికి ఆర్డర్లు ఇస్తే వాటిని 1000 మీటర్లకు ఒక ఘట్టాగా తయారుచేసి గోదాముకు జేటిఓ లు దగ్గరికి తీసుకెళ్తారని జే టి వోలు ఒక ఘట్టాకు 80 నుండి 100 రూపాయలు ఫిక్స్ గా వసూలు చేస్తున్నారని దీని ద్వారా వారికి 85000 ఘట్టాలకు సుమారు 70 లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని ఇది కాకుండా అదనంగా ఒక మ్యాక్స్ సంఘానికి 15000 రూపాయల చొప్పున అదనపు వసూలు చేస్తున్నారని అన్నారు. డబ్బులు వసూలు చేసి నాణ్యతలేని గుడ్డం సెలెక్ట్ చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సమావేశంలో కడారి రాము లు,అజ్జ వేణు, ఎలిగేటి రాజు, సోమ నాగరాజు పాల్గొన్నారు.

# రీల్

## నార్త్ అమెరికాలో ఓజీ టికెట్ల హవా




పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన తాజా చిత్రం ఓజి. సుజిత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం కోసం నార్త్ అమెరికాలో టికెట్లు భారీగా అమ్ముడుపోతున్నాయి. గ్యాంగ్ స్టార్ బ్యాక్ డ్రాప్ లో రూపొందుతున్న సినిమా కావడంతో ఈ సినిమాపై భారీగా అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదలైన రెండు పాటలకు , ట్రైలర్ కు మంచి స్పందన లభిస్తోంది. పవన్ కళ్యాణ్ సరసన ప్రియాంక అరుల్ మోహన్ హీరోయిన్ గా నటిస్తోంది. అన్ని పనులు పూర్తి చేసి ఈనెల 25వ తేదీన విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.



## రొమాన్స్ క్యారెక్టర్ చేయాలనుంది

హీరోయిన్ రితికా నాయక్

తేజ సజ్జా హీరోగా నటించిన చిత్రం 'మిరాయ్'. ఈ చిత్రానికి కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించారు. సెప్టెంబర్ 12న ఈ సినిమా రిలీజ్ కాబోతుంది. ఈ సందర్భంగా రితికా నాయక్ మీడియా తో చిట్ చాట్ నిర్వహించింది. నా తొలి చిత్రం అశోకవనంలో అర్జున కళ్యాణం తర్వాత ఒక మంచి క్యారెక్టర్ కోసం చూస్తున్నప్పుడు మిరాయ్ అవకాశం వచ్చింది. అద్భుతమైన కథ. నా క్యారెక్టర్ చాలా నచ్చింది. హిమాలయాల్లో ఉండే ఒక మాంక్ క్యారెక్టర్. తనలో గ్రేట్ ఎనర్జీ ఉంటుంది. ఇందులో నా క్యారెక్టర్ గురించి అప్పుడే ఎక్కువ రివిల్ చేయకూడదు. మిరాయ్‌లో యాక్షన్ అడ్వంచర్ ఆడియన్స్ గొప్ప అనుభూతిని ఇస్తుంది. తేజ చాలా ప్రొఫెషనల్. వెరీ స్వీట్. డెడికేటెడ్‌గా వర్క్ చేస్తారు. మనోజ్ చాలా పవర్ఫుల్ క్యారెక్టర్‌లో కనిపిస్తారు. జగపతిబాబు గారితో కలిసి వర్క్ చేయడం, శ్రీయాతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడం మరచిపోలేని అనుభూతి. ఈ సినిమాలో దాదాపు 80% లైవ్ లొకేషన్స్‌లో షూట్ చేశాం. ప్రతి రియల్ టైమ్ లొకేషన్స్‌లోకి వెళ్లడం వెరీ చాలెంజింగ్. అయితే మా టీమ్ అందరూ చాలా సపోర్ట్ చేశారు. కార్తీక్ చాలా విజన్ ఉన్న డైరెక్టర్. ఆయన సెట్‌లో చాలా క్లారిటీగా ఉంటారు. సినిమాని చాలా అద్భుతంగా తీశారు. ఆయనతో కలిసి వర్క్ చేయడం చాలా ఆనందాన్నిచ్చింది. కథలో ప్రాధాన్యత ఉన్న అన్ని రకాల పాత్రలు చేయాలని ఉంది. పెర్ఫార్మెన్స్‌కి స్కోప్ వుండే అన్ని రకాల పాత్రలు చేయడానికి సిద్ధంగా ఉన్నాను. అలాగే నాకు సూపర్ హీరో మూవీస్ అంటే చాలా ఇష్టం. యాక్షను రొమాన్స్ నా ఫేవరెట్ జోనర్స్. వరుణ్ తేజ్ గారితో ఒక సినిమా చేస్తున్నాను.



దుల్కర్ సల్మాన్, పూజా హెగ్డే

## దుల్కర్ సల్మాన్ సరసన పూజా

దుల్కర్ సల్మాన్ 41వ చిత్రంలో హీరోయిన్‌గా పూజా హెగ్డే నటిస్తోంది. ఈ చిత్రం ద్వారా రవి నేలకుడిటి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్ పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. గ్రేట్ హ్యూమన్ డ్రామాతో నడిచే ప్రేమకథగా రూపొందుతోంది. ప్రస్తుతం పూజా హెగ్డే షూటింగ్ లో పాల్గొంటున్నారు. పూజ స్కూటీ నడుపుతూ, దుల్కర్ వెనుక కూర్చుని, వా రి మ్యాజికల్ కెమిస్ట్రీని ప్రజెంట్ చేసే సన్నివేశం ఆకట్టుకుంది. అనయ్ ఓం గోస్వామి డీవోపీ, జివి ప్రకాష్ కుమార్ సంగీతం సమకూరుస్తారు. ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళంలో థియేటర్లలోకి రానుంది.

## కిష్కింధపురి లాంటి హారర్ సినిమా ఇప్పటివరకూ రాలేదు



హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటించిన తాజా చిత్రం 'కిష్కింధపురి'. ఈ చిత్రం సెప్టెంబర్ 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. డైరెక్టర్ కౌశిక్ కలిసినప్పుడు కిష్కింధపురి కథ చెప్పారు. నాకు బాగా ఇష్టమైన జానర్ ఇది. ఫస్ట్ టైం థియేటర్స్‌లో చూసాం. సినిమా అదిరిపోయింది. ముఖ్యంగా సౌండ్ సలార్, యానిమల్, కాంతారా సినిమాలకు పనిచేసిన సౌండ్ డిజైనర్ రాధాకృష్ణ సౌండ్‌ని అద్భుతంగా డిజైన్ చేశారు. సినిమా మీద చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాము. ఈ సినిమా చేయడం చాలా ప్రౌడ్‌గా ఉంది. సినిమాని ఇలా కూడా తీయొచ్చా అనిపించేలా చేసిన సినిమా ఇది. ఈ సినిమా కథలోనే యాక్షన్ ఉంది. మొత్తం ఆర్గానిక్‌గా చేసిన సినిమా ఇది. విజువల్ ఎఫెక్ట్స్ సౌండ్ పరంగా ఆడియన్స్ చాలా థ్రిల్ అవుతారు. అనుపమ పెర్ఫార్మెన్స్ కొత్తగా ఉంటుంది. నిజానికి అలాంటి క్యారెక్టర్ చేయడం చాలా టఫ్. టైసన్ నాయుడు షూటింగ్ అయిపోయింది. పోస్ట్ ప్రొడక్షన్ జరుగుతుంది. హైందవ షూటింగ్ చివరి దశకు వచ్చింది. సమ్మె కారణంగా బ్రేక్ పడింది కానీ ఈపాటికి షూటింగ్ అయిపోయేది. ఈ రెండు కూడా డిఫరెంట్ సినిమాలు. అలాగే పొలిమేర డైరెక్టర్ అనిల్‌తో ఒక సినిమా ఉండబోతుంది.

## 'తెలుసు కదా' టీజర్ విడుదల

స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటించిన తాజా చిత్రం రొమాంటిక్ ఎంటర్టైనర్ 'తెలుసు కదా' అక్టోబర్ 17న విడుదలకు సిద్ధమవుతోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. సినిమా టీజర్‌ను రిలీజ్ చేశారు. రాశి ఖన్నా, శ్రీనిధి శెట్టి పాత్రలతో కమ రిలేషన్ ఆసక్తికరంగా వుంది. 'లవ్ యు2' అనే ట్యాగ్‌లైన్ మరింత క్యూరిరియాసిటీని పెంచింది. హ్యాపీ నెస్, లవ్, ఎమోషనల్ మూమెంట్స్‌తో టీజర్ అదిరిపోయింది. నీరజ కోన నెటివిటిని చాలా మెచ్యూర్‌గా ప్రజెంట్ చేశారు. ఫన్, డ్రామా అద్భుతంగా వర్క్ అవుట్ అయ్యాయి. సిద్ధు జొన్నలగడ్డ డిజే టిల్లు పాత్రకు భిన్నంగా న్యూ ఛార్మింగ్ అవతార్ లో కనిపించారు. ఈ సినిమాకు తమన్ సంగీతం అందిస్తున్నారు.



## 'లిటిల్ హార్ట్స్' సక్సెస్ మీట్



మౌళి తనూజ్, శివానీ నాగరం జంటగా నటించిన 'లిటిల్ హార్ట్స్' సినిమా ఇటీవల ప్రేక్షకుల ముందుకొచ్చి ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ బ్యానర్‌పై దర్శకుడు సాయి మార్తాండ రూపొందించారు. ఆదిత్య హాసన్ నిర్మాతగా వ్యవహరించారు. ఈ సినిమాను అద్భుతంగా ప్రమోట్ చేసి నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్స్ బన్నీ వాస్ తన బీవీ వర్క్స్ వంశీ నందిపాటి తన వంశీ నందిపాటి ఎంటర్ టైన్‌మెంట్స్ బ్యానర్స్‌పై వరల్డ్ వైడ్ గ్రాండ్‌గా థియేట్రికల్‌గా రిలీజ్ చేశారు. ఈ సినిమా థ్యాంక్స్ మీట్ హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నటులు నిఖిల్, హరి, జయక్రిష్ణ , నటి పద్మినీ , హీరోయిన్ శివానీ నాగరం ,డైరెక్టర్ సాయి మార్తాండ , మౌళి తనూజ్ , ఈటీవీ విన్ కంటెంట్ హెడ్ నితిన్ , ఈటీవీ విన్ హెడ్ సాయికృష్ణ , నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ వంశీ నందిపాటి, నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ బన్నీ వాస్ పాల్గొన్నారు.

## అటవీ శాఖ అమరుల త్యాగం చిరస్మరణీయం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అటవీ శాఖ అధికారుల త్యాగం చిరస్మరణీయమని రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయ శా ఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గురువారం నెహ్రూ జులాజికల్ పార్కులోఅటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి కొండ సురేఖ మాట్లాడు తూ రాష్ట్రంలో 1984వ సంవత్సరము నుండి ఇప్పటివరకు (22) అటవీ సిబ్బం ది ధైర్య సాహసాలతో అంకిత భావంతో పనిచేస్తూ అటవీ సంపద పరిరక్షణలో తమ అమూల్యమైన ప్రాణాలు అర్పించారన్నారు. తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ అధికారులు తమ శాయశక్తుల కృషి చేస్తున్నారని అభినందించారు. అటవీ రక్షణలో భాగంగా రాష్ట్రంలో 174 బేస్ క్యాంపులు, 62 చెక్ పోస్టులను ఏర్పాటు చేయడమే కాకుండ అడవి సరిహద్దుల నిర్వహణకు పశువులు అడవిలో చొరబడకుండా నియంత్రించే కాలువలు నిర్మించడం,సాయుధ పోలీసు దళాలు కలప అక్రమ రవాణా అరికట్టడానికి తోడ్పాటును అందిస్తున్నాయని తెలిపారు.అంతకుముందు అమరుల స్తూపం వద్ద పోలీసుల గౌరవ వందనాన్ని ఉన్నతాధికారులతో కలిసి మంత్రి స్వీకరించారు.ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డిజిపి డాక్టర్ జితేందర్, ప్రిన్సిపల్ సెక్రెటరీ నదీమ్ అహ్మద్ వివిధ విభాగాల అధికారులు, అమరుల త్యాగాలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పించారు.

## బిజెపి హైజాక్

(మొదటి పేజీ తరువాయి)

హాస్యాస్పదమన్నారు. నాడు జరిగిన వర్గ పోరాటాన్ని నేడు రెండు మతాల మధ్య ఉద్యమంగా బిజెపి చిత్రీకరించి రాజకీయ లబ్ది పొందేందుకు యత్నిస్తోందని విమర్శించారు. కమ్యూనిస్టుల చరిత్ర చెరిపితే చెరిగిపోయేది కాదని, అమరుల త్యాగాలకు ఎవరూ వెల కట్టలేరని ఆయన స్పష్టం చేశారు. అజీజ్ పాషా మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో సాయుధులైన రైతులు నిజాం రజాకార్లను తరిమి తరిమి కొడితే తన పరాభావం తప్పదన్న భయంతో నిజాం అప్పటి కేంద్ర ప్రభుత్వంతో చేసుకున్న చీకటి ఒప్పందంలో భాగంగానే నాడు 'ఆపరేషన్ పోలో' జరిగిందన్నారు. హైదరాబాద్ రాష్ట్రం కమ్యూనిస్టు వశం కానుందని ఆనాడే అమెరికా గ్రహించి భారత ప్రభుత్వానికి లేఖ రాసిందని, అందులో భాగంగా ప్రజలను హింసించి రజాకార్లను కాకుండా కమ్యూనిస్టు యోధులను నాడు కేంద్ర బలగాలు మట్టు పెట్టాయన్నారు. ఎంతో చరిత్ర గల పోరాటాన్ని ఎవరు వక్రీకరించినా చరిత్ర ఎప్పుడూ చరిత్రగా నిలిచిపోతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.ఛాయాదేవి, సిపిఐ రాష్ట్ర నాయకులు బి.వెంకటేశం, పి.ప్రేమ్ పావని, ఎం.నర్సింహ్మా, ఎం.ధర్మేంద్ర, ఎం.అనిల్ కుమార్, కమతం యాదగిరి, ప్రజానాట్యమండలి అధ్యక్షులు కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ్మా, లక్ష్మి నారాయణతో పాటు సిపిఐ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ట్యాంక్‌బండ్‌పై ఎర్ర కవాత్

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలలో భాగంగా సిపిఐ ఆధ్వర్యంలో ఎర్ర సైనికులు ట్యాంక్‌బండ్‌పై కదం తొక్కారు. మఖ్దూం మోహియుద్దీన్ విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు భారీ 'రెడ్ ఫ్లాగ్ మార్చ్'తో అరుణ పతకాలు రెపరెపలాడాయి. ప్రజానాట్య మండలి కళాకారుల ఆట పాటల మధ్య రెడ్ షర్ట్ వాలంటీర్లు అరుణ పతాకాలతో ముందుకు సాగారు. నాటి తెలంగాణ సాయుధ పోరాట యోధుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రజా నాట్యమండలి కళాకారులు ఆలాపించిన గేయాలు, మరో వైపు ఎర్ర జెండా కవాత్ ట్యాంక్‌బండ్‌పై ప్రయాణికులను, ప్రజలను ఆకట్టుకున్నాయి.



## ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్ల బకాయిలు వెంటనే చెల్లించాలి

ఎస్‌జిపిఎటి డిమాండ్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** గత ఏడాది కాలంగా ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్ల బకాయిలను సత్వరం చెల్లించాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు అర్విణి రాజేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి ఎంవి.నరసింగరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం జరిగింది. ఎస్‌జిపిఎటి సమావేశం పెన్షనర్లకు ప్రత్యేక డైరక్టరేట్ ఏర్పాటు చేయాలని, కరువుభత్యం బకాయిలు వాయిదాల పద్ధతిలో కాకుండా ఏక మొత్తం గా చెల్లించాలని, 2023 జూలై నుండి పిఆర్‌సి వర్తింపచేయాలని సమావేశం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానించింది. ఎస్‌జిపిఎటి రాష్ట్ర ఉపాధ్యక్షులు విరామనోహర్ కూర్పు చేసిన 'సమస్యలు సమాధానాలు' పుస్తకాన్ని సీనియర్ పెన్షనర్ జి. శంకరయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎఐఎస్‌పిఎఫ్ సెక్రటరీ జనరల్ సుధాకర్, పూర్వపు సెక్రటరీ జనరల్ జి.పూర్ణచంద్ర రావు, పెన్షనర్ జెఎసి సెక్రటరీ జనరల్ తులసి సత్యనారాయణ, సంఘం సలహాదారు ఇ.నరసింహారెడ్డి, సంయుక్త అధ్యక్షులు జి.వీరాస్వామి, వి.ఆర్ దేశ్‌పాండే తదితరులు పాల్గొన్నారు.

### ఎస్‌జిపిఎటి నూతన నాయకత్వం ఎన్నిక

స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ (ఎస్‌జిపిఎటి) రాష్ట్ర అధ్యక్షులుగా అర్విణి రాజేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి గా ఎంవి.నరసింగరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని అసోసియేషన్ ఎన్నికల అధికారులు ఎంవి.గోనారెడ్డి, జి.లచ్చయ్య ప్రకటించారు. అసోసియేషన్ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శిగా బి.నరసయ్య, సంయుక్త అధ్యక్షులు గా జి.వీరాస్వామి, అదనపు ప్రధానకార్యదర్శి గావి. రాంమనోహర్ ఎన్నికయ్యారు.

## టిమ్స్ ఆస్పత్రి కాంట్రాక్ట్ నర్సింగ్ సిబ్బంది ఐదు నెలల జీతాలు వెంటనే చెల్లించాలి

ఎఐటియుసి డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** టిమ్స్ ఆస్పత్రి కాంట్రాక్ట్ నర్సింగ్ సిబ్బందికి గత 5నెలలుగా పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ డిమాండ్ చేశారు. కరోనా సమయంలో తెలంగాణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టీమ్స్) ఆస్పత్రిలో దాదాపు 160 మంది కాంట్రాక్టు నర్సింగ్ ఆఫీసర్స్‌ను నియమించుకోగా, అనంతరం 2022లో ఈ సిబ్బందిని నీలోఫర్ ఆసుపత్రి, ఉస్మానియా ఆసుపత్రి, సరోజినీ ఆసుపత్రి, కోటి మెటర్నిటీ ఆసుపత్రిలకు డిప్యూటేషన్‌పై టిమ్స్ అధికారులు పంపించడం జరిగిందన్నారు. అయితే వివిధ ఆస్పత్రుల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు నర్సింగ్ సిబ్బందికి గత ఏప్రిల్ నెల నుండి జీతాలు చెల్లించకపోవడం తీవ్ర అన్యాయమని వారు విమర్శించారు. హైదరాబాద్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో టిమ్స్ ఆస్పత్రి వివిధ ఆస్పత్రిలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ నర్సింగ్ ఆఫీసర్ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎండి. యూసుప్, ఎం.నరసింహాలు మాట్లాడుతూ గత5 ఏళ్లుగా వారు విధులు నిర్వహిస్తున్నారని టిమ్స్ అనంతరం వివిధ ఆస్పత్రులకు డిప్యూటేషన్ పై పంపించిన అధికారులు గతంలో ప్రతినెల జీతాలు చెల్లించి గత ఏప్రిల్ మాసం నుండి నేటి వరకు జీతాలు చెల్లించడం లేదన్నారు. ఈ అంశంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ లకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారులకు అనేకసార్లు విన్నవించినా సమస్య మాత్రం పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం ప్రతి నెల ఒకటవ తేదీన జీతాలు చెల్లించాల్సి ఉండగా ఆరునెలగా నర్సింగ్ ఆఫీసర్లకు జీతాలు ఇవ్వకపోవడంతో వారు ఆర్థికంగా అనేక ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం తక్షణమే స్పందించి ఐదు నెలల జీతాలు తక్షణం విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్యమాలను ఉధృత్తం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి హసీనా బేగం నర్సింగ్ ఆఫీసర్స్ సిబ్బంది పాల్గొన్నారు.




## 680 బిలియన్ డాలర్లు

(మొదటి పేజీ తరువాయి)

కూడా ఈ సహకారం విస్తృతమవుతుంది. మోదీ తన పార్లమెంటరీ నియోజకవర్గం వారణాసిలోని తాజ్ హోటల్‌లో మారిషస్ ప్రధానమంత్రికి ఆతిథ్యం ఇచ్చారు. ఈనెల 9న రామ్‌గూలమ్ భారత్ పర్యటన ప్రారంభించారు. 16వ తేదీ వరకూ అనేక ప్రాంతాలలో ఆయన పర్యటిస్తారు. ఈ సందర్భంగా నరేంద్రమోదీ ఆయనతో మాట్లాడుతూ, మారిషస్‌కు భారత్ ఇస్తున్నది ప్రత్యేక ఆర్థిక సహాయం కాదనీ, రెండు దేశాల ఉమ్మడి భవితవ్యానికి ఒక గొప్ప పెట్టుబడి అనీ చెప్పారు. మన రెండు దేశాల కలలూ, లక్ష్యాలూ ఒకటేనన్నారు. భారత్—మారిషస్ దేశాలు రెండూ కేవలం వాణిజ్య భాగస్వాములు మాత్రమే కాదనీ, ఒకే కుటుంబమని ప్రకటించారు. రెండు దేశాల మధ్యా ఉన్న సుసంపన్నమైన సాంస్కృతిక వారసత్వాన్ని చాటిచెప్పడానికి ప్రతిబింబంగా వారణాసిలో ఆయనకు ఆతిథ్యం ఇచ్చారు. వందలసంవత్సరాలక్రితమే రెండు దేశాలమధ్యా ప్రారంభమైన సాంస్కృతిక భాగస్వామ్యాన్ని మోదీ గుర్తుచేసుకున్నారు. రెండు దేశాలూ కేవలం వాణిజ్య భాగస్వాములు కాదనీ, ఒకే కుటుంబమనీ ఉద్ఘాటించారు. మారిషస్ భద్రతకు ప్రత్యేకించి ఆ దేశ ఆర్థిక మండల భద్రతను పటిష్టం చేయడానికి భారత దేశం పూర్తిగా కట్టుబడి ఉందని మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో మోదీ పేర్కొన్నారు. స్థానిక కరెన్సీలలోనే వాణిజ్యం చేసేందుకు కట్టుబడి ఉన్నట్లు చెప్పారు. హైడ్రోగ్రఫీ ఒప్పందం కింద రెండు దేశాలూ సముద్రతలంపై, సముద్రాంతరం ఉమ్మడి పరిశోధనలు చేపడతాయి. రాబోయే ఐదేళ్లపాటు హైడ్రోగ్రఫీ ఒప్పందం అమలులో ఉంటుంది. భారతదేశం మారిషస్‌లో త్వరలో 'మిషన్ కర్మయోగి''ని ప్రారంభిస్తుందని మోదీ చెప్పారు. మారిషస్ విశ్వవిద్యాలయంతో దేశంలోని మద్రాస్ ఐఐటి, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లానిటోరియం మేనేజ్‌మెంట్‌లు ఒప్పందాలు చేసుకున్నాయి. ఈ మేరకు ఎడ్యుకేషన్ రీసెర్చ్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. సురక్షితమైన, స్వేచ్ఛాయుతమైన ఉమ్మడి హిందూ మహాసముద్ర ప్రాంతమే రెండు దేశాలకూ ప్రాధాన్యతాంశమని ఉద్ఘాటించారు. హిందూమహాసముద్ర ప్రాంత సంరక్షణలో భారతదేశం అందరికంటే ముందుగా స్పందిస్తుందన్నారు. ఈ ఒప్పందాల ప్రకారం మారిషస్ తీరప్రాంత గస్తీ దళాలకు భారతదేశం శిక్షణ ఇస్తుంది. ఛాగోస్ ఒప్పందం ముగింపు సందర్భంగా మారిషస్ ప్రభుత్వానికి, ప్రజలకు ఆయన అభినందనలు తెలియజేశారు. ఇది ద్వీపదేశం మారిషస్ సార్వభౌమాధికారానికి ఒక చరిత్రాత్మకమైన విజయమన్నారు. భారతదేశం ఎప్పుడూ వలసల నిర్మూలనకు మద్దతు ఇస్తుందని, మారిషస్ సార్వభౌమాధికారాన్ని సంపూర్ణంగా భారతదేశం గుర్తిస్తోందని చెప్పారు. ఛాగోస్ దీవులను మారిషస్‌కు స్వాధీనం చేసేందుకు బ్రిటన్‌దేశం గడచిన మే నెలలో ఒక నిర్ణయం తీసుకుంది. ఈ ఒప్పందం ముగింపు ప్రకారం మారిషస్‌లో పలు దీవులపై బ్రిటన్ తన పూర్తి హక్కులను వదులుకుంటుంది.

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

మావోయిస్టులు పోలీసు తూటాలకు తాలలేక అడువుల్లోనికి జారుకున్నటు తెలుస్తోంది. వారి కోసం మరింత ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. 2026 మార్చి 31నాటికి మావోయిస్టులే లేకుండా అంతం చేస్తామని కేంద్ర ప్రభుత్వం శపథం చేసిన నేపథ్యంలో మావోయిస్టుల వేట మరింత ముమ్మరంగా సాగుతోంది. ఇప్పటి వరకు మావోయిస్టు కేంద్ర ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు, కేంద్ర కమిటీ సభ్యులు చలపతి, వివేక్, ఉదయ్, రాష్ట్రకమిటీ సభ్యులు శర్మ, గౌతమ్, మధు, జయ, రూపేష్,కార్తీక్, నీతి, చేతే, గుడ్డ, సత్యం, అలోప్, పాపన్న, మధు, భాస్కర్, జగన్,అరుణ, విజయ్ తో పాటు జిల్లా కమిటి సభ్యులు 26, ఏరియా కమిటీ సభ్యులు 86, పిఎల్‌జిఏ సభ్యులు 152 మంది, స్థానిక నిర్మాణ సభ్యులు, ప్రజలు 38 మంది వివరాలు తెలియని వారు 43 మందితో సాహ తాజా ఎన్‌కౌంటర్‌తో కలిపి 374 మందిని భద్రతా బలగాలు కాల్చి చంపాయి. ఆపరేషన్ కాగర్‌కు వ్యతిరేకంగా భారీ ప్రజా సమీకరణ

### సిపిఐ (మావోయిస్ట్) కేంద్ర కమిటీ పిలుపు

మావోయిస్టు ఉద్యమాన్ని దెబ్బతీసేందుకు కేంద్ర ప్రభుత్వం జరుపుతున్న సైనిక దాడి 'ఆపరేషన్ కగార్'ను ఓడించేందుకు భారీగా ప్రజా సమీకరణ అవసరమని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ నెల 21 నుంచి 27 వరకు దేశవ్యాప్తంగా పార్టీ స్థాపన 21వ వార్షికోత్సవాన్ని పెద్ద ఎత్తున జరుపుకోవాలని ప్రజలను సూచించింది. పార్టీని బలోపేతం చేసేందుకు, విప్లవోద్యమాన్ని రక్షించేందుకు గెరిల్లా యుద్ధంలో విస్తృత ప్రజాసమీకరణ అవసరాన్ని సిపిఐ (మావోయిస్టు) అత్యున్నత నిర్ణయాధికార కమిటీ ఒక ప్రకటనలో గుర్తుచేసింది. ఈ ఏడాది ఆపరేషన్ కగార్‌ను ప్రతిఘటిస్తూ, కొత్త ప్రజాస్వామ్య విప్లవ పోరాట లక్ష్యాల కోసం పోరాడుతూ సిపిఐ (మావోయిస్టు) ప్రధాన కార్యదర్శి బసవరాజు (నంబాల కేశవ్ రావు), కేంద్ర కమిటీ సభ్యులు చలపతి, వివేక్, ఉదయ్తో సహా 366 మంది వీర మరణం పొందినట్లు పేర్కొంది. ప్రాణత్యాగం చేసిన వారి ఆలోచనలకు, సిద్ధాంతాలకు కట్టుబడి పోరాటాలను కొనసాగిస్తామని కేంద్ర కమిటీ ప్రతిజ్ఞ చేసింది. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి, విప్లవ ప్రాంతంలో సాయుధ దళాల శిబిరాల ఏర్పాటు ఆపితే, ప్రజల విశాలమైన ప్రయోజనాల కోసం తమ పార్టీ ఎప్పుడూ శాంతి చర్చలకు సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేసింది. పీడిత వర్గాల ప్రయోజనాలను రక్షించడానికి సామ్రాజ్యవాద, హిందుత్వ ఫాసిస్ట్, జమీందారీ శక్తులపై పోరాటం చేయాలని ప్రకటనలో ప్రజలకు పిలుపునిచ్చింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com